
ఈనాడు
ఆదిలాబాద్
గురువారం 4 జనవరి 2018 | 16 పేజీలు

తేలిన భూముల లెక్కలు..

- వివాదరహితంగా 8.62లక్షల ఎకరాలు
- వివాదంలో 20,913 సర్వే నెంబర్లు
- రూ.62కోట్ల పెట్టుబడి వ్యయానికి 1,29,326మంది అర్హులు
- పూర్తయిన భూసర్వే



ఈనాడు-ఆదిలాబాద్

మూడునెలలుగా కొనసాగిన భూముల సర్వేకు సంబంధించిన లెక్కలు ఎట్టకేలకు తేలాయి. ఈ సర్వేలో 9,01,079.33 ఎకరాల దస్త్రాలను పరిశీలించిన రెవెన్యూయంత్రాంగం 8,62,538.37 ఎకరాల భూములు వివాదరహితంగా ఉన్నట్టుగా గుర్తించారు. మిగిలిన 38,540.36 ఎకరాల భూమి వివాదంలో ఉన్నట్లుగా నిర్ధరించారు. ప్రతిష్ఠాత్మకంగా జరిగిన భూదస్త్రాల పరిశీలనలో పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.



దస్త్రాలు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రైతులకు వచ్చే ఏడాది నుంచి పెట్టుబడి వ్యయం కింద ఎకరానికి రూ. 4వేలు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం అందుకు అర్హులను గుర్తించేందుకు భూదస్త్రాల పరిశీలన కార్యక్రమానికి గతేడాది సెప్టెంబరు 15న శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఆ సర్వే గడువు డిసెంబర్ 31వ తేదీతో ముగిసింది. అయితే ఈసర్వేలో అంశాలవారీగా లెక్కలు తేల్చేందుకు మూడురోజుల పాటు మండలస్థాయి, జిల్లా స్థాయి యంత్రాంగం కసరత్తు చేసింది. జిల్లావ్యాప్తంగా 509 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేసి 9,01,079.33 ఎకరాల దస్త్రాలను పరిశీలించారు. ఇందులో 8,62,538.37 ఎకరాల భూమి వివాదరహితంగా గుర్తించిన అధికారులు 38,440.36 ఎకరాలు వివాదంలో ఉన్నట్లు తేల్చారు. ఈ భూములను అపరిష్కృతంగా ఉండి కోర్టు కేసుల్లో కొన్ని, వివాదాల్లో మరికొన్ని ఉన్నట్లుగా గుర్తించి పార్ట్-బి జాబితాలో చేర్చారు. జిల్లా వ్యాప్తంగా 1,95,564 ఉండగా.. అందులో 1,74,651 సర్వేనెంబర్లు ఎలాంటి వివాదంలో లేనట్లుగా తేల్చిన యంత్రాంగం 20,913 సర్వే (మిగతా 7లో)

ప్రగతికి చేయూతనివ్వండి..

- జిల్లాలో జంతు, జీవ వైవిధ్య ప్రదర్శనశాల ఏర్పాటుచేయాలి
- పొచ్చర, కుంటాల జలపాతాలను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించాలి
- దిల్లీలో కేంద్ర మంత్రులను కలిసిన మంత్రి జోగురామన్న, ఎంపీ నగేశ్, చారి

వివరాలు 7లో



పశుజీవ వైవిధ్యశాలపై కేంద్ర సహాయ మంత్రి మహేశ్‌శర్మకు వినతిపత్రం ఇస్తున్న మంత్రి జోగు రామన్న, చిత్రంలో ఎంపీ నగేశ్, వేణుగోపాలచారి

అతుకుల బొంత..

నాణ్యతపై చింత

- రూ.12కోట్ల కుంటాల రహదారి విస్తరణ పనులు అధ్వానం
- పర్యవేక్షణలేక ఇష్టారాజ్యంగా సాగుతున్న పనులు

కుంటాల రహదారికి నిధులు: 12 కోట్లు

ప్రారంభం: ఫిబ్రవరి 22, 2017

నిర్దేశిత గడువు: 21 ఫిబ్రవరి 2018

పూర్తయిన పనుల శాతం: 70

ప్రస్తుత పరిస్థితి: అధ్వానం

నేరడిగొండ- ఇచ్చోడ, న్యూస్‌టుడే

కుంటాల జలపాతానికి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం రహదారుల నిధుల నుంచి రూ.12 కోట్లను కుంటాల జలపాతం రహదారి విస్తరణ పనులకు మంజూరు చేసింది. రెండు వరుసల రహదారిని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకులు, అటుగా ఉన్న గ్రామాల ప్రయాణికుల రాకపోకలకు వెసులుబాటు కలుగుతుందని ఇక్కడి వారు హర్షం వ్యక్తం చేశారు. కానీ పది కాలాల పాటు మన్నికతో నిలవాల్సిన రహదారి పనులు అధికారుల పర్యవేక్షణ లేక అధ్వానంగా కొనసాగుతున్నాయి. నాణ్యత ప్రమాణాలు అంతంత మాత్రమే పాటిస్తూ రహదారి నిర్మాణ నిబంధనలు గాలికొదిలేస్తున్నారు. దీంతో రాకపోకలకు జనం, యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కుంటాల రహదారి పనుల నిర్వహణ తీరుపై 'న్యూస్‌టుడే' కథనం.



ఈ చిత్రం నేరడిగొండ మండలం బుగ్గారాం దగ్గర కుంటాలకు వెళ్లే రహదారి నూతనంగా నిర్మిస్తున్న రహదారి వేసిన తారు అతుకు. ప్యాచ్ పని, రహదారి నిర్మిస్తున్న సమయంలోనే గుంత పడి కంకర తేలడంతో మళ్లీ తారుతో అతుకులు వేశారు. ఇది కలకాలం నిలిచేలా లేదు. మళ్లీ రహదారి పరిస్థితి మున్నాళ్ల ముచ్చటే అవుతుందేమోనని గ్రామీణులు వాపోతున్నారు.


నేరడిగొండ మండల కేంద్రం నుంచి కుంటాల వరకు 11 కిలోమీటర్ల వరకు రహదారిని విస్తరిస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. వాస్తవంగా పాత రోడ్డును తవ్వేసి లోతుగా చేసి అందులో మొరం, కంకర, కాంక్రీటుపొడి వేసిన తరువాత రెండు పొరలు (మిగతా 7లో)

వ్యాపారులకు 'తెల్ల బంగారం'..!



మిల్లుల్లో పేరుకుపోయిన పత్తి నిల్వలు

- క్వింటాకు రూ.800 నుంచి 1000 పెరిగిన ధర
- రైతులకు రూ.190 కోట్ల మేర నష్టం





మొక్కజొన్నకు నీటి తడులు ఇస్తున్న రైతు సత్యనారాయణ మండలంలోని తిమ్మాపూర్. రెండెకరాల్లో పత్తి పంట వేయగా గులాబి పురుగు సోకి దిగుబడులు దెబ్బతిన్నాయి. రెండెకరాలకు సుమారు రూ. 30 వేలు పెట్టుబడులు పెట్టాడు. కేవలం అయిదు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. పెట్టుబడులు సైతం చేతికి రాకపోవడంతో పత్తి పంటను తొలగించి మొక్కజొన్న వేశాడు. పత్తి పంటను అలాగే దమ్ము చేయడంతో తెల్లబంగారం ఇలా నేలపై పరుచుకుంది.

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే

గతేడాది ప్రభుత్వం పత్తి సాగు తగ్గించడంతో రైతులు ఇతర పంటల వైపు మళ్లారు. దీన్నే నమ్ముకున్న రైతులు పత్తి సాగు చేయగా అధిక ధరలు లభించాయి. ఈసారి ఖరీఫ్‌లో భారీ స్థాయిలో రైతులు పత్తి పంట సాగు చేశారు. దిగుబడులు రాక ధరలు లేక తీవ్రంగా నష్టపోయారు. దీనికి తోడు గులాబి పురుగు రైతులను నట్టేట ముంచింది. రైతులు పత్తి నంతా అమ్ముకున్నాక ప్రస్తుతం అమాంతంగా ధరలు పెరిగాయి. విపణిలో క్వింటా రూ.5,200 వరకు పలుకుతోంది. పెరిగిన ధరలతో పంట పడిన రైతుకన్నా పంట కొనుగోలు చేసిన వ్యాపారులకే 'తెల్లబంగారం' అయ్యింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు క్వింటా సరాసరి రూ.800-1000 కోల్పోగా రూ.190 కోట్లు నష్టపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. పత్తి రైతు దయనీయస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి సాగు, నష్టం వివరాలు పట్టికలో..

జిల్లా	విస్తీర్ణం హెక్టార్లలో	అంచనా దిగుబడి (లక్షల క్వింటాళ్లలో)	విపణికి వచ్చిన పంట (లక్షల క్వింటాళ్లలో)	విపణిలో పెరిగిన ధరలతో రైతుకు వాటిల్లిన నష్టం
ఆదిలాబాద్	1.40 లక్షలు	23.00	14.00	రూ. 140 కోట్లు
నిర్మల్	1.36 లక్షలు	12.00	3.00	రూ. 30 కోట్లు
మంచిర్యాల్	64 వేలు	2.00	1.10	రూ. 10.10 కోట్లు
కుమురంభీం	62 వేలు	1.80	1.00	రూ. 10 కోట్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మునుపెన్నడూ లేనంతగా భారీ విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 1.40 లక్షల హెక్టార్లలో, నిర్మల్ జిల్లాలో 1.36 లక్షల హెక్టార్లలో, మంచిర్యాల జిల్లాలో 64 వేల హెక్టార్లలో, కుమురం భీం జిల్లాలో 62 వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు కేవలం 19 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే విపణికి (మిగతా 7లో)

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని బాదనకుర్తిలో బుధవారం జరిగింది. బాదనకుర్తికి చెందిన రైతు మడిషెట్టి రాజన్నకు ఎద్దు మేతకు వెళ్లి విద్యుత్తు నియంత్రిక వద్ద మేత మేస్తుండగా నియంత్రికకు ఉన్న 11 కేవీ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో బాధిత రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. యాసంగి పంటలకు నాట్లు వేసే సమయంలో రూ.55 వేలు విలువ చేసే ఎద్దు ఆకస్మాత్తుగా మృత్యువాతపడటంతో చేయివిరిగినంత పనయ్యిందని వాపోయాడు. సంబంధిత అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం మంజూరయ్యేలా కృషిచేయాలని బాధిత రైతు కోరుతున్నాడు. సర్పంచి గడ్డం మోహన్, నాయకులు దొనికెని సాగర్, పశువైద్య సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించారు.


విద్యుత్తు నియంత్రిక వద్ద మృతిచెందిన ఎద్దు

వన్యప్రాణులు వేటాడిన వ్యక్తులపై కేసు నమోదు

నెన్నెల, న్యూస్‌టుడే: మండలంలోని బొప్పారం సమీపంలో వన్యప్రాణుల కోసం వేటాడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖాధికారి అప్పలకొండ తెలిపారు. అయన తెలిపిన వివరాలిలా.. బెల్లంపల్లి మండలం దుగ్నెపల్లి గ్రామానికి చెందిన చల్లూరి నానయ్య, దుగుట రవి, చెల్మటికారి రవిలు విద్యుత్తు తీగలు అమర్చి వన్యప్రాణుల వేట కోసం ప్రయత్నిసున్నట్లు తెలిపారు. అడవీలో గస్తీ తిరుగుతుండగా వేటగాళ్లను గుర్తించినట్లు చెప్పారు. అక్కడికి వెళ్లగా ముగ్గురులో ఇద్దరు పరారైనట్లు చెప్పారు. చల్లూరి నానయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోని రిమాండ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు.


నిందితుడు నానయ్యను అదుపులోకి తీసుకున్న అధికారులు

మహిళను అవమానపర్చినందుకు జరిమానా

హాజీపూర్ (మంచిర్యాల న్యాయవిభాగం), న్యూస్‌టుడే: హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామానికి చెందిన వైద్య తిరుపతి అనే వ్యక్తి ఒక మహిళను అవమానపర్చినందుకు రూ.5వేలు జరిమానా విధిస్తూ లక్సెట్టిపేట ఫాస్టు ట్రాక్ అసిస్టెంట్ సెషన్స్ ఇన్చార్జి జడ్జి మహ్మద్ నిజాముద్ధీన్ బుధవారం తీర్పునిచ్చారు. 2013 సెప్టెంబర్ 3న అదే గ్రామానికి చెందిన అంకం అమ్మాయి అనే మహిళను దూషించి అవమానపర్చినందుకు బాధితురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు బాధితురాలి కుటుంబసభ్యులు హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి కోర్టుకు పంపారు. కోర్టులో పీపీ కిరణ్‌కుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా దూషించి అవమానపర్చినట్లు నిరూపణ కాగా న్యాయమూర్తి దోషి తిరుపతికి రూ.5వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

భీంపూర్, న్యూస్‌టుడే: మండలంలోని నిపాని చెందిన గొంపల్లి చిన పొచ్చన్న(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి పొచ్చన్నను గమనించిన కుటుంబీకులు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లేష్ తెలిపారు.

కాలిబూడిదైన కంది పంట

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఇంద్రవెల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని అంజి గ్రామానికి పండిత్ చాందుడే అనే రైతుకు చెందిన కంది పంట ప్రమాదవశాత్తు కాలిబూడిద కావడంతో రూ.లక్ష నష్టం జరిగింది. గ్రామస్థులతో పాటు తహసీల్దార్ మామిడి శివరాజ్‌లు తెలిపిన వివరాల ప్రకారం రైతు తన ఐదు ఎకరాల సాగు భూమిలో వేసిన కంది పంటను ఒక చోట పోగు చేశారని, మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూర్తిగా కాలి పోయిందన్నారు. రైతు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకుని కంది పంటను అంచన వేయగా రూ.లక్ష నష్టం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. కంది పంట కాలిబూడిద అయిన సంఘటన స్థలాన్ని ఎస్సై గంగారాం సైతం సందర్శించారు.


కాలిబూడిద అయిన కందిపంట

అతి వేగం.. ఒకరి ప్రాణాన్ని బలిగొంది

☛ మరొకరి పరిస్థితి విషమం ☛ ఇద్దరికి గాయాలు

కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అతి వేగం ఒకరికి ఉత్సాహం కలిగిస్తే.. మరొక కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చింది. అప్పటిదాక చిన్నారితో ఆడుకున్న అమ్మ ఆనందం అంతలోనే ఆవిరైంది. ఇంటికి చేరే క్రమంలో ద్విచక్రవాహనం రూపంలో మృత్యువు కబలించింది. పేద కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలుతో ఇంటి యాజమాని ఆటో నడుపుతూ సంతోషంగా జీవిస్తున్నా సమయంలో ద్విచక్రవాహన చోదకుని అతివేగం ఓ కుటుంబంలో ముగ్గురు చిన్నారులకు తల్లిని లేకుండా చేసింది. కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి కమాన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే కన్నెపల్లి గ్రామానికి చెందిన గోమాస దేవాజీ, అతని భార్య అనిత, చిన్న కుమార్తె సరితను తీసుకొని బుధవారం మంచిర్యాల ఆసుపత్రికి వెళ్లి వస్తున్నారు.


ఆటోలోకి చొచ్చుకుపోయిన ద్విచక్రవాహనం

కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి ముఖద్వారం సమీపంలో ఆటోను వెనుక నుంచి ద్విచక్రవాహనం అతి వేగంగా ఢీకొని ఆటోలోకి చొచ్చుకుపోయింది. ఈప్రమాదంలో ఆటోలో వెనుక కూర్చున్న అనిత వారి కుమార్తె సరిత వెంటనే కిందపడిపోయారు. పడిపోయే సమయంలో అనిత(27) తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. అనిత పక్కనే కూర్చున్న చిన్నారి సరిత కింద పడిపోయే సమయంలో తల్లి మీద పడింది. దీంతో చిన్నారికి స్వల్పగాయాలు కాగా మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న అనిత భర్త దేవాజీ కాలు విరిగింది. ద్విచక్రవాహనం నడుపున్న రియాజ్ చేతికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా అతన్ని 108లో బెల్లంపల్లి ఆసుపత్రి నుంచి అత్యవసర చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కాసిపేట ఎస్సై సతీష్ తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదం సంఘటణ స్థలంలో ఉన్న వారందరిని కంటతడి పెట్టించింది.


ప్రమాదంలో మృతిచెందిన అనితపై పడిపోయిన చిన్నారి

సంస్కృతి పరిరక్షణలో శిశుమందిరాలు ఆదర్శం

జిల్లా విద్యాధికారి డా.రవికాంత్‌రావు

చొక్కారాంనగర్ (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: శిశుమందిరాల్లో చదివే విద్యార్థులు చదువు, నైతిక విలువలతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి డా.రవికాంత్‌రావు పేర్కొన్నారు. బుధవారం హాజీపూర్ మండలం పడ్తనపల్లి పంచాయతీ పరిధిలోని చొక్కారాంనగర్‌లో లోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఐదు జిల్లాలకు చెందిన విభాగ్‌స్థాయి ఖేల్‌కూద్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని కాపాడేప్రయత్నంలో శిశుమందిరాలు ఎంతో పురోగతి సాధిస్తున్నాయన్నారు. క్రీడలతో విద్యార్థుల మనోవికాసం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎంఈఐ వివేకానందరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించేందుకు ప్రతి విద్యార్థి నిత్యం శ్రమించాలన్నారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎంఈఐ రంగారావు, పాఠశాల అధ్యక్షుడు వినయ్‌ప్రకాష్‌రావు, విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు డా.విష్ణువర్ధనరావు, కరీంనగర్ శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవిందర్, ప్రధానాచార్యుడు రావుల రామన్న, తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే....

రాష్ట్రంలోని ఐదు జిల్లాల పరిధిలోని శ్రీసరస్వతి విద్యాపీఠం పాఠశాలలకు చెందిన 250 కి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జూనియర్ల విభాగంలో 600మీ.పరుగు పందెంలో గడ్డం చరణ్ (జమ్మికుంట) ప్రథమ, రుత్విక్ (తడకపల్లి) ద్వితీయ స్థానాలు సాధించారు. 80మీ. హార్డిల్స్ విభాగంలో కౌషిక్ (రాంపూర్) ప్రథమ, కె.రాహుల్ (తడకపల్లి) ద్వితీయ స్థానాలు సాధించారు. లాంగ్‌జంప్‌లో మణిదీపక్ (ప్రథమ), పి.సంతోష్(ద్వితీయ), హైజంప్‌లో ఉదయ్‌కిరణ్ (ప్రథమ), సంతోష్ (ద్వితీయ), షాట్‌పుట్ శ్రీనివాస్ (ప్రథమ), మణికంఠస్వామి (ద్వితీయ), కబడ్డీ మంచిర్యాల జట్టు, ఖోఖోలో రాంపూర్ జట్లు ప్రథమ స్థానాలు పొందారు. సీనియర్స్ విభాగంలో 1500 మీ.పరుగు పందెంలో అఖిల్ (ప్రథమ), హరీష్ (ద్వితీయ), మూడువేల మీ.పరుగు పందెంలో అఖిల్, రూప్‌సాగర్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలకు క్రీడల అనంతరం నిర్వహించిన సమారోప్ కార్యక్రమంలో కరీంనగర్ శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవిందర్, వినయ్‌ప్రకాష్‌రావు, తదితరుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్, ప్రబంధకారిణి సభ్యులు బొడ్డు శంకర్, తదితరులు పాల్గొన్నారు.


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

కరెంటుపై ఆధారపడిన వారికి కానుక

★ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలు అమలు ★ తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ ప్రభుత్వం 24గంటల కరెంటు ఇస్తుండటంతో పంటల సాగుతో పాటు దీనిపై ఆధారపడిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం కానుక ఇచ్చినట్లయిందని తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కరెంటు లేక గతంలో అనేక పంటలు ఎండిపోయాయని ప్రస్తుతం బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులకు 24గంటల విద్యుత్తు వరంలాంటిదని పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డైరీ కార్యాలయం ఆవరణలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే ఎలాంటి లాభాలు ఉంటాయో చెప్పడమే కాకుండా.. అప్పుడు చెప్పిన ఘట్టాన్ని గుర్తుకు తెచ్చేలా విద్యుత్తును అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. వద్దనే వరకు నీళ్లు.. సరిపోతుందనే వరకు కరెంటు ఇచ్చే ప్రభుత్వమని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు అందించడం, ఎరువుల కొరత లేకుండా చేయడం, పంటలకు గిట్టుబాటు ధరలు అందజేస్తూ ముఖ్యమంత్రి రైతుపక్షపాతిగా నిరూపించుకుంటున్నారని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ మూడున్నరేళ్లలో రూ.14వేల కోట్లు ఖర్చుచేసిందని తెలిపారు. రాష్ట్రం పవర్‌హబ్‌గా మారబోతోందన్నారు. ఆటోస్టార్టర్లను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి, మమత, గంగారెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి

రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ సంక్షేమంతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేస్తానని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాబాయి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డైరీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ మహిళకు గుర్తింపు దక్కడం ఇది మొదటిసారిగా భావిస్తున్నట్లు వివరించారు. పదవి వచ్చినందుకు ముఖ్యమంత్రి, జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ సభ్యులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆమెను స్థానిక తెరాస నాయకులు శాలువాతో సత్కరించారు.


మాట్లాడుతున్న తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి


నీలాబాయిని సన్మానిస్తున్న తెరాస నాయకులు

దూరభారం.. విద్యార్థులకు శాపం

◆ సెమిస్టర్ కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి
◆ అర్ధంతరంగా చదువు మానేస్తున్న పేద మహిళా విద్యార్థులు
◆ బేలలోనే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



ఆదిలాబాద్‌లోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల.. పరీక్ష కేంద్రం

బేల, న్యూస్‌టుడే:

మారుమూల మండలం బేల మండలం.. ఉన్నత విద్యను పూర్తి చేయాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి డిగ్రీ పూర్తి చేసుకునే సౌకర్యం మండల కేంద్రంలో అందుబాటులో ఉన్నా పరీక్షల కోసం ఆదిలాబాద్‌కు వెళ్లాల్సి రావడంతో పేద విద్యార్థులకు ఆర్థిక, దూరభారంగా మారుతోంది. మారుమూల గ్రామాల నుంచి కిలోమీటర్ల దూరం ప్రయాణానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా ఉన్నత విద్య పూర్తి చేయలేక మహిళ విద్యార్థులు చదువులు అర్ధంతరంగా మానేస్తున్నారు. బేలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తే విద్యార్థుల కష్టాలు దూరం కావడంతో పాటు ఉన్నత చదువులు పూర్తి చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

మండల కేంద్రం ఏజెన్సీ గిరిజన ప్రాంతంతో పాటు మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న మండలం. ఇక్కడ డిగ్రీ చదవే విద్యార్థులు చాలా తక్కువగా మంది ఉంటారు. 2014-15లో బేలలో ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. ఇంటర్ పూర్తి చేసి ఉన్నత విద్య పూర్తి చేసుకోక ఇంటిపట్టునే ఉన్న విద్యార్థులకు ఇందులో ప్రవేశాలు తీసుకుంటున్నారు. రెగ్యులర్ విద్యార్థులు ఇక్కడే ప్రవేశాలు పొందుతున్నారు. ఆంగ్లమాధ్యమం కావడంతో ఇందులో మరాఠీ, గిరిజన విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నారు. ప్రస్తుతం 220 మంది విద్యార్థులు డిగ్రీ విద్యనభ్యసిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల వారు రవాణ సౌకర్యాలు సక్రమంగా లేకున్నా ఆర్థిక ఇబ్బందులను అధిగమించి చదువుతున్నారు. వీరికి పరీక్ష కేంద్రం జిల్లా కేంద్రంలో కేటాయించడంతో అక్కడికి వెళ్లాల్సి ఉంటుంది. గతేడాది నుంచి ప్రభుత్వం సెమిస్టర్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఒక సంవత్సరంలో రెండు సెమిస్టర్ పరీక్షలు రాయడానికి జిల్లా కేంద్రానికి వెళ్లాలి. పరీక్ష ముగిసిన తర్వాత ఇంటికి రావడానికి ఎంతో సమయం పడుతోంది. మహిళా విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాక చదువును అర్ధంతరంగా మానేస్తున్నారు.

నిర్మల్ జిల్లాలో రెండు కేంద్రాలకు అనుమతి

మారుమూల మండల కేంద్రాల్లో ప్రయివేటు డిగ్రీ కళాశాలలున్నా చోట యూనివర్శిటి అధికారులు పరీక్ష కేంద్రాలకు అనుమతి ఇస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని కల్లూర్ మండల కేంద్రంలో ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలకు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రానికి అనుమతి ఇచ్చారు. లక్ష్మణచాంద మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రానికి అనుమతి లభించింది. సెమిస్టర్ విధానం ప్రవేశపెట్టడం, ఈ ఏడాది నుంచి డిటెంక్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకురావడంతో ప్రతి విద్యార్థి కచ్చితంగా పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పేద విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి యూనివర్శిటీ అధికారులు బేల మండల కేంద్రంలోనే పరీక్ష కేంద్రానికి అనుమతి ఇవ్వాలని విద్యార్థులు, పోషకులు కోరుతున్నారు. ఈ విషయమై కాకతీయ యూనివర్శిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సదానందంను 'న్యూస్‌టుడే' సంప్రదించగా కళాశాల నుంచి యూనివర్సిటీ కంట్రోలర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానికంగా పరీక్ష కేంద్రంలో సౌకర్యాలు, నిర్వహణకు అనువుగా ఉందో లేదో పరిశీలించాక అనుమతి ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు.

బేలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

- బండిసోని, బీఎస్సీ(బీజెడ్‌సీ), మశాల(బి)



మాది మశాల(బి) గ్రామం. బేల మండల కేంద్రానికి రావాలంటో బస్సు సౌకర్యం లేదు. ఆటోలో రోజూ కళాశాలకు వెళ్తున్నా. డిగ్రీ చదవడమే ఇబ్బందికరంగా ఉంది. ప్రతి సెమిస్టర్‌కు ఆదిలాబాద్‌కు వెళ్లడం మాలాంటి విద్యార్థులకు మరింత కష్టం ఉంది. మండల కేంద్రంలోనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా విశ్వవిద్యాలయ అధికారులు చొరవ తీసుకోవాలి

చాలా ఇబ్బందులు పడుతున్నాం

- జాదవ్ రూపాలి, బీఎస్సీ, పిట్‌గావ్



నేను మండల కేంద్రానికి చేరుకోవడానికి దాదాపు అరగంట సమయం పడుతుంది. సమయానికి బస్సు సౌకర్యం లేదు. నాకు డిగ్రీ చదువుకోవాలనే ఆసక్తి ఉండడంతో తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడుతూ బేలకు పంపిస్తున్నారు. సెమిస్టర్ పరీక్షలకు ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే దూరభారంతో పాటు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నాం. ఇకనైన అధికారులు కరుణించాలి.

పరీక్ష కేంద్రం కోసం ప్రయత్నిస్తున్నాం

- వరప్రసాద్‌రావు, ప్రిన్సిపల్, కీర్తన డిగ్రీ కళాశాల



పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కళాశాలకు సమీపంలోనే పరీక్ష కేంద్రం ఏర్పటుకు ప్రయత్నిస్తున్నాం. బేల మండలంలో ప్రత్యేక పరిస్థితులు చూడలేదు. భాష, రవాణాపరంగా చాలా ఇబ్బంది ఉంది. సెమిస్టర్ పరీక్షలకు ఆదిలాబాద్‌కు వెళ్లలేక చదువు అర్ధంతరంగా మానేయడం బాధగా ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులు ఉన్నత విద్యను పూర్తి చేసుకునే అవకాశం ఉంది.


వ్యవసాయాధికారుల కాలసూచీని ఆవిష్కరిస్తున్న పాలనాధికారిణి దివ్య

రైతులకు అందుబాటులో ఉండాలి

వ్యవసాయాధికారులతో పాలనాధికారిణి దివ్య

పాలనా ప్రాంగణం, న్యూస్‌టుడే : వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా పాలనాధికారిణి దివ్య ఆదేశించారు. తన తొలి ప్రాధాన్యం రైతుల సంక్షేమం కోసమేనని, త్వరలో ప్రారంభించబోయే కిసాన్ మిత్ర కార్యక్రమంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. మంగళవారం రాత్రి వ్యవసాయాధికారుల సంఘం రూపొందించిన కాలసూచీ, దైనందినిలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చి అండగా నిలవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాకుమారి, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శివకుమార్, మహ్మద్‌అశ్రఫ్, కోశాధికారి రవిందర్, సంయుక్తకార్యదర్శి వివేక్, ఏడీఏలు ప్రమోద్, పుల్లయ్య, రమేష్, గణేష్, ఏవోలు సాగరిక, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈనెల 7 నుంచి మణిపూర్‌లో జరిగే సీనియర్ జాతీయ హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. చావరా అకాడమీ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్, నేరడిగొండ మండలం ఘటఘటితాండకు చెందిన అశోక్, జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌లు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యంవహిస్తారు. వీరి ఎంపిక పట్ల హాకీ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి, తెలంగాణ పోలీసు హాకీ శిక్షకుడు దేవిడ్‌రాజ్, హాకీ శిక్షకుడు జె.రవీందర్, సీనియర్ క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.


జాతీయ హాకీ జట్టుకు ఎంపికైన శేఖర్ శ్రీనివాస్ అశోక్

హోరాహోరీగా అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి 3 కి.మీ.ల దూరంలోని బెల్లూరి అయ్యప్ప ఆలయం సమీపంలో జరుగుతున్న అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు హోరాహోరిగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న మైదానంలో పచ్చికపై క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ఆడి క్రీడాభిమానులను అలరిస్తున్నారు. ఉదయం జరిగిన నాగ్‌పూర్, జైనూరు పోటీల్లో నువ్వానేనా అన్నట్లుగా ఆడారు. చివరికి 10 పరుగులతో నాగ్‌పూర్ జట్టు గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన నాగ్‌పూర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 123 పరుగులు చేయగా జైనూరు 113 పరుగులు చేసింది. గెలుపు దశలో ఉన్నట్లుగా కనిపించిన జైనూరు జట్టును నాగ్‌పూర్ బౌలర్ గుల్ మహమ్మద్ దెబ్బతీశాడు. 5 వికెట్లు తీసి జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు. ఈ పోటీకి ముఖ్య అతిథిగా హాజరైన ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి క్రీడాకారులతో మాట్లాడారు. ఆటను పూర్తిగా ఆస్వాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోపి, ప్రభాకర్, నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి

అర్హులందరికీ రెండు పడక గదుల ఇళ్లు

★ రాష్ట్రంలో ఉగాది నాటికి 1.70లక్షలు పూర్తి ★ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు భూమారెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ఇళ్లులేని, అర్హులైన పేదవారందరికీ రెండు పడకగదుల ఇళ్లు నిర్మించి ఇస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు మడపు భూమారెడ్డి అన్నారు. అధికారిక కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయన స్థానిక రోడ్లు, భవనాలశాఖ విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఇళ్లు అనేది అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ నిలువనీడ కల్పించేందుకు సీఎం కృషిచేస్తున్నారని తెలిపారు. ఉద్యమ సమయంలో సీఎం అనేక ప్రాంతాల్లో తిరుగుతున్న సమయంలో ఇళ్లులేని ప్రతిఒక్కరికీ శాశ్వత గృహాలు నిర్మించాలని భావించారని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేసి పరిపాలన విధానాన్ని మార్చి రెండు పడక గదుల ఇళ్లకు శ్రీకారం చుట్టారని వివరించారు. అలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించి గృహనిర్మాణాలను పూర్తిచేయిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 2.75లక్షలు నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 22శాతం పూర్తిచేశామన్నారు. వచ్చే ఉగాది నాటికి 1.70లక్షల ఇళ్లను పూర్తిచేసి గృహాలు ప్రవేశాలు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోనూ 4010 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1212 ఇళ్లకు టెండర్లు పిలిచామని 760 ఇల్లు నిర్మాణ దశలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ఎందుకు వెనుకబడి ఉన్నాయో కారణాలు తెలుసుకుంటానన్నారు. గుత్తేదారులు తెలివిగల కూలీలుగా పనిచేయాలని.. ఎస్ఎస్ఆర్ ప్రకారం ఇళ్లను నిర్మిస్తే కచ్చితంగా వారికి 15 శాతం లాభం వస్తుందని చెప్పారు. గుత్తేదారులు ముందుకురావాలని ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని భరోసా ఇచ్చారు. మంజూరయ్యాయని ఉదాహరించారు. అర్హతలేని వారి పేర్ల మీద మంజూరుచేసుకున్నారని ఆరోపించారు. ఎవరైనా నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తిచేసుకొని బిల్లు రాలేని పక్షంలో స్థానిక తహసీల్దార్, డిప్యూటీఈఈని కలిస్తే వారికి బిల్లు మంజూరుచేసేందుకు సిద్ధంగా ఉన్నామని హామినిచ్చారు. ఇలాంటి విషయాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు చొరవ తీసుకోవాలని సూచించారు. అంతకుముందు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గృహనిర్మాణశాఖ అధికారులతో సమీక్షించారు. తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు నారాయణ, తుడం రాములు, బండారి సతీష్, సంద నర్సింగ్, ప్రశాంత్, అశోక్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.


రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు భూమారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెరాస నాయకులు

ఆదిలాబాద్

ఎస్సీ వర్గీకరణకు టీమాస్‌ఫోరం పూర్తి మద్దతు

ఎదులాపురం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను టీమాస్ ఫోరం పూర్తి స్థాయిలో మద్దతును ప్రకటిస్తున్నదని ఆ ఫోరం జిల్లా కన్వీనర్ బండి దత్తాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేస్తూ శాంతియుతంగా దీక్షలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులను ప్రభుత్వం ఆరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. ఎంఆర్‌పీసీ నాయకులు, మందకృష్ణ ఆరెస్టులు పూర్తి అక్రమమైనవన్నారు. వెంటనే అఖిల పక్షాన్ని దిల్లీకి పంపి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, ఆరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఆదిలాబాద్ పట్టణంలో అమ్ముడవుతున్న తునికి పండ్లు

'తునికి' పండ్లకు భలే గిరాకీ

ఎదులాపురం, న్యూస్‌టుడే: అరుదుగా కేవలం వేసవి కాలం ప్రారంభానికి ముందు మాత్రమే లభించే 'తునికి' పండ్లకు జిల్లా కేంద్రంలో భలే గిరాకీ కొనసాగుతోంది. అడవిలో మాత్రమే తునికి చెట్ల నుంచి వచ్చే ఈ పండ్లలో ఎటువంటి రసాయనాలు ఉండకపోగా, మంచి రుచితో పాటు విశేషంగా పోషకాలు కలిగి ఉంటాయి. తునికి చెట్లు కాతదశ అనంతరం ఆకులన్నీ రాలియి కొత్త ఆకులు మార్చ్ నాటికి చిగురిస్తాయి. ఈ ఆకులను బీడీలు తయారు చేయడానికి కూలీల ద్వారా అటవీ శాఖ కొనుగోలు చేయిస్తుంది. కొందరు తునికి పండ్లను అడవుల్లో నుంచి నేరుగా సేకరించి స్థానిక వ్యాపారులకు విక్రయించగా వారు తోపుడు బండ్లపై ఇలా విక్రయిస్తున్నారు. ఒక కిలో రూ.100 ధర పలికినా కూడా పలువురు ఆసక్తిగా వీటిని కొనుగోలు చేస్తున్నారు.



పాలనాప్రాంగణం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వర్గీకరణకు అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలి

పాలనాప్రాంగణం ఎదుట ఎమ్మార్పీఎస్‌టీఎస్ ధర్నా

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మాణం చేసినందుకు సీఎం కృతజ్ఞతలు తెలుపుతున్నామని, అదే మాదిరి అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించేలా ఒత్తిడి తీసుకురావాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(తె.రాష్ట్రం) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాలనా ప్రాంగణం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని ఇతర కులాలు, వృత్తుల వారికి పింఛన్లు అందించడం హర్షనీయమేనని, ఉపకులాల వారికి, డప్పులు కొట్టడం, చెప్పులు కొట్టేవారికి రూ. 2వేల పింఛను అందించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోరె నర్సింగ్, రాష్ట్ర అధికార ప్రతినిధి మోతె బారిక్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యవంశి ద్రోచన, సంఘం జిల్లా అధ్యక్షుడు కడదరపు ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడు మారంపల్లి శంకర్, వివిధ మండలాల అధ్యక్షులు బొజ్జ ఇస్తారి, నిరంజన్, కాంతారావు, అయిండ్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సదల్‌పూర్‌లో విద్యార్థులకు వనభోజనం

బేల, న్యూస్‌టుడే: మండలంలో మినీ బాలికల గురుకులం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం సదల్‌పూర్ ఆలయానికి వనభోజనానికి వెళ్లారు. ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నిరంతరం గుర్తింపునిస్తాయి

★ సన్మానసభలో పుర అధ్యక్షురాలు రంగినేని మనీష

శాంతినగర్: అంకితభావంతో అందించిన సేవలు జీవితంలో నిరంతరం గుర్తుండిపోతాయని పుర అధ్యక్షురాలు రంగినేని మనీష, పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శి మంచికట్ల ఆశమ్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో జిట్ట రమేష్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మొదటగా జిట్ట రమేష్ - లక్ష్మి దంపతులను శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిట్ట రమేష్ పురపాలక కార్యాలయంలో పంపు హౌజ్ ఆపరేటర్‌గా విధినిర్వహణలో అంకితభావంతో సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. పద్మశాలీ సంఘ నాయకునిగా సంఘాభివృద్ధికి ఆయన చేసిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. వీరితో పాటు మాజీ మంత్రి రామచంద్రారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గండ్రత్ సుజాత, పురపాలక కమిషనర్ మారుతిప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆరెరాజన్న, జోగు ఫౌండేషన్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు కస్తాల ప్రేమల, తెరాస నాయకులు అడ్డిభోజారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోరెడ్డి పార్థసారథి, పోపా అధ్యక్షుడు బాస భగవాండ్లు, పద్మశాలీ సంఘం జిల్లా నేతలు జిట్ట రమేష్, కాసర్ల శ్రీనివాస్, వై.రాజమౌళి, సామల లక్ష్మినారాయణ, కోడూరి ఆనంద్, దాసరి రమేష్, బొమ్మకంటి రమేష్, ఆదిలాబాద్, జైనథ్ మండలాధ్యక్షులు బాసదత్తు, మోరె కిష్టన్న దంపతులను కలిసి సన్మానించారు.



:మార్కండేయ జీవితచరిత్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పుర అధ్యక్షురాలు మనీష తదితరులు

ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

ఆదిలాబాద్ అర్బన్: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి నుంచి అమలవుతున్న పథకాల్లో భాగంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలు వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి 2016-17 ఏడాదికి ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు కార్మికశాఖ కమిషనర్ జగదీష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఫారాలు సహాయ కార్మికశాఖ కార్యాలయంలో తీసుకొని ఫిబ్రవరి 15తేదీలోపు అందజేయాలని సూచించారు. ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్‌సీ అగ్రికల్చర్, బీఎస్సీ వెటర్నరీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ హార్టికల్చర్, బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లొమా ఇన్ మెడికల్ లేబొరేటరి టెక్నిషియన్, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ లెబోరేటరీ టెక్నిషియన్‌లలో ఉత్తీర్ణులైన వారికి రూ.2 వేలు, పాలిటెక్నిక్‌లో రూ.1500, పదో తరగతి, ఐటీఐ వారికి రూ.వెయ్యి అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైదరాబాద్ సభను విజయవంతం చేద్దాం

శాంతినగర్, న్యూస్‌టుడే: రజకుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు నిర్వహిస్తోన్న రజకుల సభను జయప్రదం విజయవంతం చేయాలని ఆసంఘం జిలా అధ్యక్షుడు చిక్కాల దత్తు రజకులకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వారి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకుల సమస్యలను తెలుసుకొని ఆసంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీలక్ష్మి చేపట్టిన 200 రోజుల పాదయాత్ర ఈనెల 7వ తేదీన ముగుస్తోందన్నారు. ఈ సభ 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో మధ్యాహ్నం 12.30 గంటలకు జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రులు, కార్యక్రమానికి రజక ప్రముఖులు, కులస్థులు అధికసంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న రజకసంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు

6న నాయీబ్రాహ్మణ జిల్లా సంఘం ఎన్నికలు

శాంతినగర్, న్యూస్‌టుడే: నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకుంటున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజయ్‌కుమార్, మందపెల్లి శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లాకేంద్రంలోని బీసీ సంఘ భవనంలో సమావేశం నిర్వహించిన అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. 18మండలాల నుంచి హాజరైన నాయీబ్రాహ్మణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమక్షంలో జిల్లా నూతన కమిటీ సభ్యులను ఎన్నుకుంటామన్నారు. పోటీ చేయదల్చిన వారు ఈనెల 5వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దస్నాపూర్‌లోని గల సంఘ భవనంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎస్ఐని సన్మానించిన మానవ సేవా సభ్యులు

శాంతినగర్, న్యూస్‌టుడే : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న దుర్గే విశ్వంబర్‌కు ఎస్ఐగా పదోన్నతి రావడంతో మానవ సేవే మాధవ సేవా సభ్యులు బుధవారం సన్మానించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని వినాయక్‌చౌక్ సరస్వతీశిశుమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. మానవ సేవే మాధవ సేవా సమితి సభర్యులు చిందం దేవిదాస్, లక్ష్మిబాయి, లోకండే అనిల్, శైలేందర్ బాబు, జంగిలి ఆశన్న, గంట భగవాండ్లు తదతరులు ఉన్నారు.

గ్రామీణ సీఐగా ప్రదీప్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

పాలనాప్రాంగణం: ఆదిలాబాద్ గ్రామీణ సీఐగా ఎ.ప్రదీప్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మందమర్రి ఎస్సైగా పనిచేసిన ఈయనకు ఇటీవల పదోన్నతి కల్పిస్తూ ఇక్కడకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. కాగా ఇక్కడ సీఐగా పనిచేసిన పురుషోత్తమచారి మందమర్రికి బదిలీ అయ్యారు. కొత్తగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్‌కుమార్‌కు తాంసి, తలమడుగు, ఆదిలాబాద్‌గ్రామీణ ఎస్సైలు రాజు, సుబ్బారావు, తోట తిరుపతిలు మర్యాద పూర్వకంగా కలిశారు.



సీఐకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సైలు

నిరుపేద వివాహానికి తెరాస ఆర్థిక సాయం

ఆదిలాబాద్ పట్టణం: సంజయ్‌నగర్ కాలనీకి చెందిన నిరుపేద మైనార్టీ యువతి ఆఫ్రీన్ సుల్తానా వివాహానికి తెరాస తరపున రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. షాదీ ముబారక్ డబ్బులు కాస్త ఆలస్యంగా రానుండడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పార్టీ సాయం చేసి ఆసరాగా నిలిచింది. తెరాస పట్టణ అధ్యక్షుడు సాజిదొద్దీన్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు జహూర్, ముజాహిద్‌షా, మహిళా నేత పర్వీన్‌సుల్తాన, పార్టీ గోవర్ధన్, ప్రశాంత్, అశోక్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రాందాస్ అతవలె రాజీనామా చేయాలి

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : మహారాష్ట్రలో దాడికి గురైన దళితులకు మద్దతుగా కేంద్ర మంత్రి రాందాస్ అతవలే తన పదవికి రాజీనామా చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మేకల మధుకర్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవనల్‌లో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో దళితులపై జరిగిన దాడిపై చర్చించారు. ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు జామ్నేరాజు, కోషాధికారి చౌహాన్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ అరెస్టుపై సీపీఎం నిరసన

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: మందకృష్ణమాదిను పోలీసులు అరెస్టుచేయడం అమానుషం, అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కమిటీ పేర్కొంది. ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నట్లు వివరించింది. ఈ మేరకు కమిటీ జిల్లా కార్యదర్శి డి.మల్లేష్, కార్యదర్శి వర్గ సభ్యులు బండిదత్తాత్రి, ఎక్కడా చూసినా పోలీసుల రాజ్యం ఉన్నట్లు కనిపిస్తోందని విమర్శించారు.



ప్రవచిస్తున్న సంత్ ఆసారాంబాపూ శిష్యుడు సతీష్ హాజరైన భక్తులు

ఆధ్యాత్మిక చింతన అవసరం

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : నేటి యాంత్రిక యుగంలో క్షణం తీరిక లేకుండా ఉరుకులు, పరుగులు చేస్తున్న మనిషి ఒత్తిళ్లతో సతమతమవుతున్నాడు. ఫలితంగా చేసే కార్యాలయల్లో తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయి. కారణం ప్రశాంతత లేకనేనని, తప్పకుండా గంటపాటు ఇష్టమైన దేవుడి సన్నిధిలో ఆధ్యాత్మిక చింతన చేయాలని సంత్ ఆసారాం బాపూ శిష్యుడు సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మురళీకృష్ణ ధ్యానమందిర్‌లో జరుగుతున్న సత్సంగంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రవచించారు.

పాడి పరిశ్రమలో యాంత్రీకరణపై ప్రసారం

శాంతినగర్, న్యూస్‌టుడే: ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ద్వారా గురువారం 'పాడి పరిశ్రమలో యాంత్రీకరణ'పై కార్యక్రమం ప్రసారమవుతుందని కేంద్రం కార్యక్రమ నిర్వహణాధికారి రామేశ్వర్‌కేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కిసాన్‌వాణిలో భాగంగా రాత్రి 7.15 నుంచి 7.45 వరకు కార్యక్రమం ప్రసారమవుతుందన్నారు. ఆదిలాబాద్ విజయడైరీ ఉప సంచాలకుడు మధుసూదన్‌రావుతో ముచ్చటిస్తూ వివరిస్తారన్నారు. అనంతరం రైతు అంతరంగం కార్యక్రమంలో 'పాలీహౌజ్‌లో వివిధ కూరగాయల సాగు'పై నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం ధర్మారం గ్రామ రైతు అయిండ్ల శ్రీధర్‌రెడ్డితో ముచ్చటిస్తూ కార్యక్రమం ప్రసారమవుతుందన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పల్లాల పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు భోజన పల్లాలు పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు జిల్లా కేంద్రంలోని మాదవ ఆసుపత్రి యాజమాన్యం. బచ్చు మాదవ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు బచ్చు గజానన్, బచ్చు ప్రకాష్‌లు బుధవారం పాఠశాలలో సుమారు పల్లాలు(ప్లేట్లు) విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.లచ్చిరాం, ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, కాంచన, జరీనానాజ్నీన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పల్లాలను అందజేస్తున్న బచ్చు గజానన్ తదితరులు

మహిళ సంఘాలకు వంటనూనె పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : మహాలక్ష్మీవాడలో స్టార్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో సంఘాల సభ్యులకు సంక్రాంతి పండగ కోసం వంటనూనె డబ్బాలు పంపిణీ చేశారు. బుధవారం ఆ సమాఖ్య పరిధిలోని 30 సంఘాల సభ్యులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఓ పండరి, ఆర్‌పీ రూప, స్టార్ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు బేబిమణి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్

మహిళలకు సావిత్రిబాయి పూలే ఆదర్శం

★ జేసీ కృష్ణారెడ్డి


శాంతినగర్, న్యూస్‌టుడే: మహిళా ఉద్యమకు తోడ్పాటును అందించిన సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని మహిళలు ఉన్నతవిద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదగాలని సంయుక్త పాలనాధికారి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే 187వ జయంతిని జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ కార్యాలయ భవన ఆవరణలో నిర్వహించారు. జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలేసి జోహార్లు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి జి.ఆశన్న, కిషన్‌యాదవ్, బీసీ సంక్షేమశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: సావిత్రిబాయిపూలేని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని చదువులో రాణించాలని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి జి.ఆశన్న అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ పర్యవేక్షకురాలు భాగ్యలక్ష్మీ, కళాశాల ప్రిన్సిపల్ భగవాండ్లు, టీఎస్‌యూటీఎఫ్ మహిళ విభాగం కన్వీనర్ సురేఖ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎల్.జమున, కార్యదర్శి మయూరిఖాన్, సంధ్య, అధ్యాపకులు శైలజ, బాగీ, కవిత, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: క్రాంతిజ్యోతి సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరుస్తున్న పలువురు కళాశాల విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలు, డిక్షనరీలు, పెన్నులను అందజేశారు. స్వేరోస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉర్మిళ మాట్లాడారు. స్వేరోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటపర్తి ఊశన్న, కుశాల్‌జాడే, ఉపాధ్యక్షుడు అస్తక్‌సుభాష్, కోశాధికారి కూర పొచ్చన్న, అబ్దుల్‌షరీఫ్, మహిళ విభాగం సభ్యురాలు ప్రియాంక, సభ్యులు జువ్వాక నర్సిములు, అధ్యాపకులు ప్రేమ్‌చందర్‌రెడ్డి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ సాంస్కృతికం: జిల్లా కేంద్రంలోని జీఎంటీడీ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ ఏబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం సాయిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. గంగాధర్, దస్తగిరమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్


మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆశన్న


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న స్వేరోస్

ఆదిలాబాద్ పట్టణం: ఆదిలాబాద్ మండలం పొచ్చర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణంతోపాటు విద్యార్థుల కోసం మరుగుదొడ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆరె రాజన్న తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు.

ఎదులాపురం, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ఘనంగా జరుపుకున్నారు. ఐఆర్‌సీ ప్రతినిధులు గంగేశ్వర్, పి.విజయ్ పాల్గొన్నారు.

బేల: క్రాంతి జ్యోతి సావిత్రి బాయి జయంతి వేడుకలను బుధవారం బేల పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. సర్పంచి మస్కేతేజారావు, వైస్‌ఎంపీపీ సంజేయ్‌నిపుంగే, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం పూలె జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సీపీఎంసభ్యులు బండి దత్తాత్రి, లంకా రాఘవులు, మయూరీఖాన్, పూసం సచిన్, జాదవ్ రాజెందర్, శోభ, మయూరీఖాన్, లంక జమున పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న జేసీ కృష్ణారెడ్డి, ఇతర అధికారులు

జైనథ్: సావిత్రిబాయి పూలే దేశానికి ఆదర్శమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనువాస్ అన్నారు. బుధవారం జైనథ్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇ.శివ్వన్న, వి.అశోక్, కస్తూర్బా ఇన్‌ఛార్జి హెచ్‌ఎం స్వప్న, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం విజయసారథి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

శాంతినగర్: జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలో గల పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలేసి జోహార్లు సమర్పించారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈర్ల సత్యనారాయణ, కోరెడ్డి పార్థసారథిలు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జగదీశ్వర్, ప్రమోద్‌కుమార్ ఖత్రీ, సామలప్రశాంత్, చిక్కాలదత్తు, మందపెల్లి శ్రీనివాస్, నర్సాగౌడ్, నర్సోజీ, ఎన్.నర్సయ్య, ఎస్.నర్సింలు, నాకోడ్ రాజేశ్వర్, షేర్లవార్ రవీందర్, లింగంపల్లి రాములు, విజయ్‌కుమార్, పతిహార ప్రభాకర్, తదిదతరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పట్టణం: సావిత్రిబాయి పూలే జీవితం బాలికలందరికి ఆదర్శమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బాలికల ఆశ్రమపాఠశాలలో బుధవారం సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్ని నిర్వహించారు. ఎస్జీటీగా ఉండి డిగ్రీ కళాశాల అధ్యాపకురాలి స్థాయికి ఎదిగిన సుజాత, మారుమూల ప్రాంతాల్లోని గిరిజన సంక్షేమ ప్రాంతాల్లో అంకితభావంతో పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన విజయసుందరిని శాలువాతో సన్మానించారు. టీఎస్‌యూటీఎఫ్ మహిళా నాయకురాళ్లు స్వరూప, జగన్‌మోహన్‌పాల్గొన్నారు.


సన్మానిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేస్తున్న సీపీఎం నాయకులు


బేలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచి తదితరులు

శాంతినగర్, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే విద్యావ్యాప్తికి కృషిచేసిన స్త్రీశక్తి అని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టుప్రహ్లాద్ అన్నారు. మాల సంఘం మహిళా నాయకురాళ్లు కారింగుల స్వరూపారాణి, పి.ఊశన్న, మేదరి స్వామి, మహిళలు పాల్గొన్నారు.

శాంతినగర్ : సావిత్రిబాయి పూలే మహిళలకు విద్య అవసరమని పాఠశాలను ప్రారంభించి వారికి చదువునేర్పుతూ విజ్ఞానపు వెలుగుల్ని పంచారని బుద్ధవిహార్ నిర్వాహకులు రత్నజాడే ప్రజ్ఞకుమార్, సోగల సుదర్శన్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మహాప్రజ్ఞ బుద్ధవిహార్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జె.కమలాబాయి, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కాలసూచీ ఆవిష్కరణ

ఆదిలాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కాలసూచీని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర, ఉమ్మడి జిల్లా బాధ్యులు హాజరయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండూరి గంగాధర్, ఉపాధ్యక్షులు ఎస్ యాదన్న, కోశాధికారి రాములు, ఉమ్మడి జిల్లా బాధ్యులు సుమిత్ర, సి.సత్యనారాయణ, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు పెగడ రాజు, ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్, కోశాధికారి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కాలసూచి

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని డీఎస్పీకి విన్నపం

శాంతినగర్, న్యూస్‌టుడే: పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా యువజన సంఘాల సమితి నాయకులు బుధవారం డీఎస్పీ నర్సింహారెడ్డిని కలిసి విన్నవించారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ భారీ వాహనాలు నిల్పుతున్నారని దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కల్గడమే కాకుండా పలు ప్రమాదాలకు తావిస్తున్నాయని ఈసమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే వాణిజ్య ప్రాంతాలైన అంబేడ్కర్, వినాయక్, నేతాజీ, శివాజీ కూడళ్లు, ఠాకూర్ హోటళ్లు, అశోక్‌రోడ్‌లలో దుకాణాల ముందు సరకులను దింపుతూ భారీవాహనాలను నిలబెట్టడం వల్ల రోడ్డు చిన్నగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. లోకండే అనిల్, శశికాంత్, పతిహార్ ప్రభాకర్, సికేందర్, విజయ్, విశ్వనాథ్, తదితరులు ఉన్నారు.


డీఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న యువజన సంఘాల జిల్లా నాయకులు

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం

ఎదులాపురం: స్థానిక బొక్కలగూడలోని నౌనిహాల్ ఉర్దూ మాధ్యమ పాఠశాల యాజమాన్యం అయిదో తరగతి విద్యార్థిని షిఫాముస్కాన్‌ను మానవత్వం మరచి కనికరం లేకుండా శిక్షించిన విషయం నిర్ధరణ అయిందని బాలల సంక్షేమ సమితి అధ్యక్షుడు అమృత్‌రావు పేర్కొన్నారు. ఈ పాఠశాల వారు అకారణంగా ఈ విద్యార్థినిని గత నెల రెండున పుస్తకాల బ్యాగు నెత్తిపై ఉంచి కనికరం లేకుండా గోడకుర్చీ వేసి కూర్చోబెట్టినట్లు కుటుంబ సభ్యులు జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు పాలనాధికారి ఆదేశాల మేరకు పాఠశాలలో, బాధిత విద్యార్థి ఇంటి వద్ద బుధవారం విచారణ జరపగా విద్యార్థినిని వేధించిన విషయం నిర్ధరణ అయిందన్నారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. విచారణలో జిల్లా బాలల సంరక్షణాధికారి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

జైనథ్, న్యూస్‌టుడే : అదుపు తప్పి ద్విచక్ర వాహనం నుంచి కింద పడడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జైనథ్ మండలం బెల్గాం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, 108 వాహన సిబ్బంది తెలిపిన విరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వినయ్ హైదరాబాద్‌లో జియో టెలికాం కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ నుంచి బేల మండల కేంద్రానికి బయలుదేరారు. ఈ క్రమంలో జైనథ్ మండలం బెల్గాం గ్రామం మూల మలుపు వద్దకు రాగానే అదుపుతప్పి ద్విచక్ర వాహనం కింద పడింది. దీంతో వినయ్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందజేశారు. వెంటనే అతన్ని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. శిరస్త్రాణం ధరించి ఉండడంతో వినయ్‌కు ప్రమాదం తప్పిందని, కిడ్నీ భాగం వద్ద దెబ్బలు తగిలినట్లు తెలిపారు. మూలమలుపు కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థులు వాపోయారు. వంతెన వద్ద రక్షణ గోడలు నిర్మించాలని, ప్రమాద సూచికల బోర్డులూ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న విశ్వంబర్ బొజ్జల్‌వార్

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఆర్య వైశ్య విశ్రాంత ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వంబర్ బొజ్జల్‌వార్ కోరారు. స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో ఆయన బుధవారం మాట్లాడుతూ కన్యకా పరమేశ్వరీ మందిరంలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం అయ్యే శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు ముందుగా తమ పేర్లను ఈ నెల 6వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులతో బీఎండీ పరీక్ష, మధుమేహం, గర్భసంచీ క్యాన్సర్ నిర్ధరణ పరీక్ష, రక్తగాఢత పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 94402 07287 చరవాణి సంఖ్యపై సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ కొమ్మవార్, సంయుక్త కార్యదర్శి గందె హన్మండ్లు, ఉపాధ్యక్షుడు బీరెల్లి చంద్రకాంత్ మల్లూర్‌వార్ విలాస్, సభ్యులు ప్రమోద్ కొమ్మావార్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రాజీవ్‌రాజు

జైనథ్, న్యూస్‌టుడే: సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి రాజీవ్‌రాజు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై బుధవారం జైనథ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ఏఎన్‌ఎంలు దృష్టిసారించాలని పేర్కొన్నారు. ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మాతాశిశు సంరక్షణ, వ్యాధినిరోధకాలు, మలేరియా, హెచ్ఐవీ, ఏఎన్‌సీ, తదితర జాతీయ కార్యక్రమాలపై ఆరోగ్య సిబ్బందిపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా ఉపవైద్య, ఆరోగ్య శాఖాధికారి సాధన, డీఐఓ తొడసం చందు, జిల్లా ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమ అధికారి(పీవో డీటీపీ) మనోహర్, ఐడీఎస్ ఇన్‌ఛార్జి డా.అశోక్, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి శ్యాంసన్, పీహెచ్‌సీ వైద్యురాలు చైతన్య స్రవంతి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసేవరకు పోరు

తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: యూపీ హయాంలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేసిన భాజపా నేడు పూర్తి స్థాయి మెజారిటీ ఉన్నా ఎందుకు బిల్లు ప్రవేశపెట్టడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బిరుదుల లాజర్ అన్నారు. మందకృష్ణ ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్‌లో చేపట్టిన ఉపవాస దీక్షను పోలీసులు భగ్నం చేసినందుకు నిరసనగా బుధవారం ఉట్నూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో మన రాష్ట్ర భాజపా ఎమ్మెల్యే, ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలా చూడాలని అన్నారు. వర్గీకరణ గురించి మంద కృష్ణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి జనవరి ఐదో తేది వరకు సమయమివ్వడంతో దానిని పక్కదారి పట్టించేందుకు ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ నియమించడంలో ఆంతర్యమేమిటని అన్నారు వర్గీకరణ చేయకపోతే మున్ముందు రోజుల్లో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గాదేకర్ సంజీవ్, దిండె మహాద్, కాంబ్లే సుభాష్, ఎం భారత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పశు సంతతితోనే రైతు అభివృద్ధి

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పశు సంతతి రైతు అభివృద్ధి దోహదమని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ దుర్గం సురేష్ అన్నారు. ఉట్నూరు మండల మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉట్నూరు మండల కేంద్రంతో పాటు శ్యాంపూర్‌లలోని పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా పశు సంవర్ధక శాఖ జేడీ సురేష్ మాట్లాడుతూ.. పశు సంతతి, రైతులతోనే దేశాభివృద్ధి అని అన్నారు. పశువులకు ఏమైనా వ్యాధులు సోకితే వెంటనే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లాల్‌దేవ్, జీవన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.


పశువులకు గాలికుంటు టీకాలు ఇస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి

'బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలి'

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గౌరపూర్ పంచాయతీ పరిధిలోని చిత్తబట్ట గ్రామానికి చెందిన కోవ సంగీత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు స్వరాజ్ జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. బుధవారం చిత్తబట్ట గ్రామానికి వెళ్లి గత నెల 28 న జరిగిన విద్యుదాఘాతంపై బంధువులను, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు విద్యుదాఘాతానికి గురై 63 మంది మృత్యువాత పడితే, కేవలం 43 మందికి మాత్రమే ప్రభుత్వ జీఓ ప్రకారం నష్టపరిహారం అంద చేశారని, మిగతా వారికి ఇప్పటి వరకు అందచేయలేదని గుర్తు చేశారు. మృత్యువాతపడిన వారందరికి ప్రభుత్వ జీఓ ప్రకారం నష్టపరిహారం అందచేయాలని డిమాండ్ చేశారు. లాల్‌షావ్, దేవ్‌రావు, బండులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ

★ భక్తిగీతాలతో మార్మోగిన బెల్లూరి అయ్యప్పస్వామి ఆలయం

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన మహా పడి పూజ ఉత్సవం ఎంతో వైభవంగా సాగింది. తెలుగు సినీ నిర్మాత, ప్రముఖ హోమియోపతి వైద్యుడు డా.రవికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ మహాపడి పూజ జరిగింది. ఈ ఉత్సవానికి తెలుగు సినీ సంగీత దర్శకుడు కుద్దుస్ ఆధ్వర్యంలో గాయకులు చైతన్య బృందం ఆలపించిన భక్తి గీతాలతో అయ్యప్పస్వామి ఆలయం మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు దామోదర గురుస్వామి తాంత్రిక విధానం పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని కిన్వట్, బల్లార్ష ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిచ్చారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న స్వాములు


కుటుంబ సమేతంగా అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న సినీ నిర్మాత డా.రవికిరణ్‌యాదవ్


పాల శీతలీకరణ కేంద్రంలోని స్థలం పరిశీలిస్తున్న పాలనాధికారిణి దివ్య

ఆడిటోరియం కోసం స్థల పరిశీలన

పాలనా ప్రాంగణం, న్యూస్‌టుడే : పాల శీతలీకరణ కేంద్రంలో ఆడిటోరియం ఏర్పాటు నిమిత్తం పాలనాధికారిణి దివ్య దేవరాజన్ బుధవారం పాల శీతలీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి ఖాళీ స్థలంలో ఆడిటోరియం నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆరాతీశారు. ఆమె వెంట ఆర్డీవో సూర్య నారాయణ ఉన్నారు.


దిల్లీలో కవాతు చేస్తున్న తాడాట, జూడో తెలంగాణ జట్టు

తాడాట, జూడో తెలంగాణ జట్టు కవాతు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : దిల్లీలో జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-17, 19 తాడాట, అండర్-14 జూడో పోటీలకు తెలంగాణ జట్టు బుధవారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కవాతు నిర్వహించింది. జట్టు మేనేజర్లు, కోచ్‌లు ఎన్.హరిచరణ్, వెంకటరమణ, కల్యాణ్, ఎన్.స్వామి, గుండి మహేష్‌లు క్రీడాకారులతో కలిసి కవాతులో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ జట్టుకు సృంజిత్‌రెడ్డి ఎంపిక

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: అతి పిన్న వయసులో ఉమ్మడి జిల్లాల్లోనే సృంజిత్‌రెడ్డి రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న లీగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఈయన బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించాడు. ఆడిన 9 పోటీల్లో మొత్తం 33 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. నాలుగుసార్లు అయిదు వికెట్లు, మూడుసార్లు నాలుగు వికెట్లు తీసిన ఈ బుడతడికి పదకొండేళ్లే. నిర్మల్‌కు చెందిన ఈయన హైదరాబాద్‌లోని ఓక్రిడ్జ్ ఇంటర్‌నేషనల్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 7 నుంచి 21 వరకు కేరళలో జరిగే పోటీలకు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈయన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తనయుడు.

ప్రగతికి చేయూతనివ్వండి..

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన మంత్రి జోగురామన్న, పార్లమెంటు సభ్యుడు గోడం నగేష్, దిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి వేణుగోపాలచారిలు బుధవారం దిల్లీలో కేంద్ర మంత్రులను కలుసుకున్నారు. నలుగురు కేంద్రమంత్రులను కలిసి జిల్లా, రాష్ట్ర సమస్యలను విన్నవించారు. పరిష్కారానికి హామీలు తీసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జంతు, పశు జీవ వైవిధ్య ప్రదర్శన శాల ఏర్పాటు చేయాలని కేంద్ర అటవీ, సాంస్కృతిక, పర్యావరణశాఖ సహాయ మంత్రి మహేశ్‌శర్మను కలిసి వినతిపత్రం అందించారు. ఈ ప్రదర్శనశాల కోసం రాష్ట్రప్రభుత్వం తరపున రూ.185 కోట్లతో ప్రతిపాదనలు కేంద్రానికి పంపించినట్లు వివరించారు. ఇందులో రూ.125 కోట్లు కేంద్రం విడుదలచేయాల్సి ఉందని తెలిపారు. మిగితా రూ.45కోట్లు రాష్ట్రవాటా భరించనుండగా అంకుశ్ స్వచ్ఛంద సంస్థ రూ.20కోట్లు ఇవ్వనుందని మంత్రికి తెలిపారు. కేంద్ర వాటా త్వరగా విడుదల చేయాలని కోరారు. కేంద్ర పర్యాటకశాఖ మంత్రి అల్ఫాన్స్‌ను కలిసి జిల్లా, రాష్ట్ర పర్యాటక ప్రాంతాలపై చర్చించారు. కుంటాల, పొచ్చర జలపాతాలను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించేందుకు ఇదివరకే రూ.141 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు ఆయనకు వివరించారు. జిల్లాకేంద్రంలో మూతపడ్డ సిమెంటు పరిశ్రమను పునఃప్రారంభింపచేయాలని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి అనంత్‌గీతేను కలిసి విన్నవించారు. సామిజిక న్యాయ శాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్‌ను కలిసి బీసీ సమస్యలు విన్నవించారు. తెలంగాణలో బీసీలో 113 బీసీ కులాలున్నా 85 కులాలకు మాత్రమే ఓబీసీ ధృవపత్రాలు జారీ అవుతున్నాయని మిగితా వారిని ఓబీసీలుగా గుర్తించేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

తేలిన భూముల లెక్కలు..

(మొదటిపేజీ తరువాయి) నెంబర్లు అపరిష్కృతంగా మిగిలినట్లు గుర్తించారు. మొత్తం విస్తీర్ణంలో వ్యవసాయ భూములు 3,56,633.09 ఎకరాలు ఉండగా.. 17,040.09 ఎకరాలు ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలుగా గుర్తించారు.

అసైన్డ్‌భూములు 1,55,534.13 ఎకరాలు ఉండగా..3,006.28 ఎకరాలు అర్హులకు బదులు ఇతరులు సాగు చేస్తుండగా.. 321.29 ఎకరాల్లోనూ అసలు అసైన్డ్‌దారులు లేరు. వివాద భూములు 12,202.13 ఎకరాలు పార్ట్-బిలో చేర్చారు. జిల్లాలో ప్రభుత్వ ఖాళీస్థలాలు కూడా ఈ సర్వేలో గుర్తించారు. ఇవి 91,621.07 ఎకరాలు ఉండటం గమనార్హం. అటవీభూములు 2,36,168.03 ఎకరాలు ఉంటే దేవాదాయ భూములు 399.37 ఎకరాలు, వక్ఫ్‌భూములు 454.16 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు.

రూ.62కోట్లకు పైగా పెట్టుబడి..

మూడునెలల పాటు సాగిన భూదస్త్రాల పరిశీలన సర్వేలో అధికారయంత్రాంగం ఎలాంటి వివాదాలు లేని రైతుల జాబితాను రూపొందించే పనిలో నిమగ్నమైంది. ప్రభుత్వం అందించే పెట్టుబడి వ్యయం అర్హులకు అందేలా ఈ సర్వే ద్వారా సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం సేకరించగలిగింది. గతంలో కొంతమంది వేర్వేరు సర్వే నెంబర్లు, వేర్వేరుగా ఖాతానెంబర్లు కలిగి ఉండేవారు. ఈ సర్వేలో ఒక్క రైతుకు ఒకే ఖాతా నెంబరును కేటాయిస్తూ.. ఆ ఖాతా నెంబరులో సర్వే నెంబర్ల వారీగా ఉన్న భూములను ఒకే దగ్గరకు చేర్చారు. దీంతో జిల్లావ్యాప్తంగా మొత్తం 1,38,299 ఖాతాలు ఉన్నట్లుగా నిర్ధరించారు. ఇందులో 1,29,326 ఖాతాలు వివాదరహితంగా .. మిగిలిన 8,973ఖాతాలు వివాదంగా ఉన్నాయి. అంటే వివాదరహితంగా ఉన్న 1,29,326 మంది రైతులు జూన్ మాసం నుంచి పెట్టుబడి వ్యయం కింద ప్రభుత్వం ఎకరానికి రూ.4వేలు అందించనుంది. ఇవే లెక్కలను జిల్లాయంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. జిల్లాలో సాగవుతున్న 5,12,167.22 ఎకరాలకు పెట్టుబడి వ్యయం అందజేయనుంది. ఇవే లెక్కలను పరిగణలోకి తీసుకుంటే జిల్లాకు ప్రభుత్వం పెట్టుబడి వ్యయం కింద రూ.62.24కోట్లు కేటాయించాల్సి ఉంటుందని రెవెన్యూవర్గాలు అంచనా వేస్తున్నాయి.


రహదారికి ఆనుకుని ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తొలగించకుండానే మొరం వేసిన దృశ్యం


రహదారి నిర్మాణ పనుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక రహదారికి అడ్డంగా కర్రను ఏర్పాటు చేసిన దృశ్యం

అతుకుల బొంత.. నాణ్యతపై చింత

(మొదటిపేజీ తరువాయి) వేయాల్సి ఉంది. ఆపై తారు వేయాలి. కానీ నిర్మిస్తున్న సమయంలోనే రహదారి బీటలు వారి కంకర చాలా చోట్ల తేలింది. దీంతో పట్‌పట్‌తాండా, బుగ్గారాం, సవర్గాం గ్రామాల మధ్యలో గుంతలు పడడంతో అక్కడ తారుతో అతుకులు(ప్యాచ్)లు వేశారు. పనులు జరుగుతున్న చోట ఎలాంటి


కుంటాల గ్రామం వద్ద మొరంపై నీళ్లతో క్యూరింగ్ చేయక రేగుతున్న దుమ్ములో నుంచే పర్యాటకుల బస్సు వెళుతున్న దృశ్యం

హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు, యాత్రికులు ఇక్కట్లు పడుతున్నారు. హెచ్చరిక బోర్డుల స్థానంలో కర్రలు నామమాత్రంగా ఏర్పాటు చేయడం గమనార్హం. రహదారిపై దుమ్మురేగడంతోనూ జనం అవస్థలు పడుతున్నారు. అలా జరగకుండా కనీసం నీళ్లతో క్యూరింగ్ చేయడం లేదు. కాంక్రీటు వాడకం సైతం సరైన పద్ధతిలో లేదని ఆరోపణలున్నాయి. రోడ్డుకు ఆనుకుని విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. వీటిని తొలగించి రహదారికి కనీసం 5 అడుగుల దూరంలో వేయాల్సి ఉండగా అలాగే వదిలేశారు. దీంతో రహదారిపై ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. విద్యుత్తు స్తంభాలపై సైతం హైట్ రైసర్‌లను ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు శాఖ వారు ఆర్అండ్‌బీ శాఖకు తెలియజేసినప్పటికీ అలాగే పనులు కొనసాగిస్తున్నారు.

మరో రెండు నెలల్లో పూర్తయ్యేనా..?

కుంటాల రహదారి పనులు ఇప్పటి వరకు 70 శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికిని ఆలోపు కొలిక్కి వచ్చేలా లేవు. దీంతో నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే రహదారి పనులవల్ల రోడ్డు ఇరుకుగా మారింది. జనం రాకపోకలకు తంటాలు పడుతున్నారు. నిర్మించిన రహదార్లకు ఇరువైపులా మొరం వేయాల్సి ఉండగా అనుమతి లేని నాసిరకం మొరాన్ని వాడుతున్నారని అక్కడి గ్రామాల ప్రజలు ఆరోపించారు. రహదారికి ఇరువైపులా రోలింగ్ చేయకుండా అలాగే మొరం వేయిస్తున్నారు. రహదారి నిర్మాణం ప్రారంభమైన ప్రదేశానికి సమీపంలో సవర్గాం వద్ద ఇంకా పనులు మొదలు పెట్టలేదు. కంకర తేలి ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇక్కట్లు కలుగుతున్నాయి.

పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాం

వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ, డీఈ, బోథ్ డివిజన్

కుంటాల రోడ్డు పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. పనుల నిర్వహణ తీరును సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మొరం కొరత కారణంగా కొంత ఆలస్యమైంది. పనులకు ఇంకా గడువు ఉంది. నిర్దేశిత సమయంలోనే రహదారి పనులు పూర్తవుతాయి. సందర్శకులతో పాటు అటుగా ఉన్న గ్రామాల ప్రజలకు రెండు వరుసల రహదారితో ఇబ్బందులు తొలగుతాయి. ఒకటి రెండు చోట్ల ప్యాచ్‌పనులు జరిగాయి. వాటిపై మరో పొర తారు రోడ్డు వస్తుంది. విద్యుత్తు స్తంభాలను మార్పు చేయిస్తాం.

వ్యాపారులకు 'తెల్ల బంగారం'..!

(మొదటిపేజీ తరువాయి) వచ్చింది. మొదట్లో పత్తి ధర రూ.4,200 పలికింది. ఆదిలాబాద్, భైంసా పట్టణాల్లో కొనుగోళ్లు ప్రారంభించి రూ.4,100-4200 వరకు చెల్లించి వ్యాపారులు కొనుగోళ్లు జరిపారు. ఇది వరకే రైతులు పండించిన పంటను అమ్ముకున్నారు. రైతుల వద్ద పత్తి నిల్వలు నిండుకున్నాక ఇటీవల ధరలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం క్వింటా ధర రూ.5,200 వరకు పలుకుతోంది. పత్తి నాణ్యంగా ఉండటం విపణిలో క్యాండి ధర రూ.42 వేల వరకు పలుకుతుండటంతో పత్తికి డిమాండు ఏర్పడింది. ఈ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.


పత్తి పంటను తొలగిస్తున్న రైతు రాజారం బక్కన్న మండల కేంద్రం కుంటాల. రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి వేశాడు. ఇందుకు గాను రూ.40 వేలు వెచ్చించాడు. తీరా దిగుబడులు తగ్గి గులాబి తెగుళ్లు సోకడంతో పూర్తిగా నష్టపోయాడు. చేసేదేమి లేక పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు నేలను సాగుకు సన్నద్ధం చేసుకుంటున్నాడు. పత్తి సాగు చేసిన రైతులకు ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయి.

వ్యాపారులకే తెల్లబంగారం'..!

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ధరల రూపంలో ఎప్పుడూ నష్టాలే మిగులుతున్నాయి. యాసంగి సాగు కోసం వ్యాపారుల వద్ద ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పొందేందుకు పంటను అమ్మక తప్పలేదు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు కుమ్మక్కయి ధరలను అదే స్థాయిలో కొనసాగించి కొనుగోలు చేపట్టి నిల్వ చేశారు. అంతర్జాతీయ విపణిలో ధరలు కలిసి వస్తుండటంతో వ్యాపారుల పంట పండుతోంది. పంట అమ్ముకున్న రైతు నష్టపోగా వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు లాభాలు గడించారు. గులాబి పురుగు సోకి దిగుబడులు తగ్గాయి. రైతులు పత్తి పంటను తొలగించడంతో విపణికి పత్తి ఉత్పత్తులు వచ్చే వీలు లేకపోవడంతో ధరలు మరింత పెరగనున్నాయి.

కనికరించని ప్రకృతి..!

ఖరీఫ్ మొదట్లో ఆశాజనకంగా ఉన్న పత్తి పంటలు సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, వరదలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా కలుపు మొక్కలు పెరిగిపోయాయి. మొదట్లో అతి కష్టం మీద కలుపు తీయించినా భారీ వర్షాలు, వరదలకు రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. దీంతో నామమాత్రంగా ఎకరానికి ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. మొదట్లో రైతులంతా తాము పండించిన పత్తిని రూ.4,100-4200 ధరలకు అమ్ముకున్నారు. ఇప్పుడు రూ.5200 పైగా పెరగడంతో ఒక్కో రైతు ఎకరానికి రూ.5000-6000 మేర నష్టపోవాల్సి వచ్చింది. కొన్ని చోట్ల రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కలేదు. విపణిలో పత్తికి మద్దతు ధర రూ.4150 ఉండగా ప్రస్తుతం రూ.5200 వరకు ధరలు లభిస్తున్నాయి. క్వింటా రూ.1100 మేర అధికంగా ఉంది.


మిల్లులో బేళ్ల నిల్వలు

కొనుగోళ్ల తీరు జిల్లాల వారీగా..!

* ఆదిలాబాద్ విపణిలో 23 లక్షల క్వింటాళ్ల పత్తి లక్ష్యం కాగా 14 లక్షల క్వింటాళ్లు, నిర్మల్ జిల్లాలో 12 లక్షల క్వింటాళ్ల లక్ష్యం కాగా 3.10 లక్షల క్వింటాళ్లు, కుమురంభీం జిల్లాలో 5 లక్షల క్వింటాళ్ల లక్ష్యం కాగా 1.65 లక్షల క్వింటాళ్లు, మంచిర్యాల జిల్లాలో రెండు లక్షల క్వింటాళ్ల లక్ష్యం కాగా 1.10 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు జరిపారు.

ఊరికి ఉపకారం



- ప్రజాహితం వారి అభిమతం
- పాఠశాలలకు భూమి విరాళం
- ఆదర్శంగా నిలుస్తున్న పల్లెవాసులు

వాంకిడి, న్యూస్‌టుడే

భూముల వాటా కోసం సొంత అన్నదమ్ములు, బంధువుల మధ్య తగాదాలు జరగడం చూస్తున్నాం. ఒక్కోసారి విభేదాలు పెరిగిపోయి హత్యలకు దారి తీసిన సందర్భాలున్నాయి. స్వార్థ ప్రయోజనాలు వీడి ప్రజల అవసరాల కోసం భూ దానం చేసేవారు అరుదు. వాంకిడి మండలంలోని పలువురు తమకున్న భూముల్లో కొంత పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, చౌక ధరల దుకాణాల కోసం ఇతర సామాజిక అవసరాల కోసం భూ దానం చేశారు. ఊరి కోసం, ప్రజల అవసరాల కోసం భూదానం చేసి తమ ఉదారతను చాటుకుంటున్న వారిపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న ప్రత్యేక కథనం.



వాంకిడి ఉన్నత పాఠశాల కోసం జయరాం విరాళంగా అందజేసిన విలువైన మూడెకరాల స్థలం ఇదే

పిల్లల చదువుల కోసం..



ఉప్రె జయరాం

వాంకిడి మండల కేంద్రానికి చెందిన ఉప్రె జయరాం 1978లో ఉన్నత పాఠశాల కోసం తనకున్న భూమిలో మూడెకరాల స్థలాన్ని విరాళంగా అందజేశారు. ఆ సమయంలో పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా స్థలాన్ని ఇవ్వడానికి ఎవరు ముందుకు రాలేదు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు శివానందం ఈ విషయాన్ని జయరాం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాఠశాలకు స్థలాన్నిస్తే భవిష్యత్తులో అందరికి ఉపయోగపడుతుందని భావించి భూమిని విరాళంగా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 620 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జీవితంలో పలువురికి ఉపయోగపడే పని చేయాలన్నది నా కోరిక. నేనిచ్చిన భూమిలో ఏర్పాటు చేసిన పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటూ ఉన్నత స్థానాలకు వెళుతుండడం తృప్తినిస్తోందని జయరాం ఆనందం వ్యక్తం చేశారు.



గోయగాంలో డీఆర్‌డిపో దుకాణం కోసం ధానం చేసిన స్థలం

చౌక ధరల దుకాణం, పాఠశాల కోసం..



దుర్వ ముకుంద్‌రావు

వాంకిడి మండలంలోని గోయగాంకు చెందిన దుర్వ ముకుంద్‌రావు గ్రామంలో చౌకధరల దుకాణం, ఐటీడీఏ పాఠశాల నిర్మాణం కోసం భూమిని విరాళంగా అందజేశారు. దీంతో పాటు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు అదనపు భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కాగా స్థలం లేక నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడడంతో ముకుంద్‌రావును సంప్రదించారు. దీంతో మరోసారి పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని అందించి ఉదారతను చాటుకున్నారు. ఊరు అభివృద్ధి చెందితే అందరూ బాగు పడే అవకాశం ఉంది. ఊరి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ముకుంద్‌రావు పేర్కొంటున్నారు.



సవ్వాతిలో పాఠశాల, అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలకు ధానం చేసిన భూమి

ఎకరం భూమి ఇచ్చారు



సోయం భీంరావు

వాంకిడి మండలంలోని సవ్వాతి గ్రామానికి చెందిన సోయం జంగు గ్రామంలో పాఠశాల భవన నిర్మాణం కోసం ఎకరం భూమిని అందించారు. పాఠశాల నిర్మాణానికి పోను మిగతా స్థలంలో గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం భవనాలు నిర్మించారు. దీంతో గ్రామస్థులకు ఉపయోగకరంగా మారింది. పిల్లలకు చదువులు, గ్రామస్థులకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో మా తండ్రి సోయం జంగు భూమిని విరాళంగా అందించారని ఆయన కుమారుడు సోయం భీంరావు వివరించారు.

ఆసుపత్రి నిర్మాణానికి

మండల కేంద్రంలోని ఆసుపత్రిని 30 ఏళ్ల కిందట నిర్మించారు. ఆసుపత్రి నిర్మించక ముందు మండలం వాసులు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు కావటంతో భూమి కోసం వెతుకున్న తరుణంలో మండలంలోని గోండ్‌కోసార గ్రామానికి చెందిన దివంగత కొట్నాక బాజీరావు భూమిని విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వాంకిడిలో అయిదెకరాల భూమిని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఆ స్థలంలో 30 పడకల ఆసుపత్రిని నిర్మించారు.



వాంకిడిలో ప్రభుత్వ ఆసుపత్రి ఇదే

క్రీడా కుటుంబం





రాష్ట్రస్థాయిలో సాధించిన పతకాలతో ఆనందరావు, శకుంతల

- పరుగులో చిరుత ఆనందరావు
- ఆయన అడుగుజాడల్లో పతకాలు సాధిస్తున్న భార్య, కూతుళ్లు
- రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో మెరిసిన దంపతులు

ఎవరి అభీష్టాలు వారికుంటాయి.. కుటుంబంలోని అందరూ ఒకే రంగాన్ని ఎంచుకొని రాణించే దృష్టాంతాలు తక్కువగా ఉంటాయి. ఓ కుటుంబంలోని అందరూ క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగడం అంటే పట్టణాలు, నగరాల్లో క్రీడల్లో పేరొందిన కుటుంబాలకే పరిమితంగా ఉంటుంది. మరి ఓ కుగ్రామంలోని బీద కుటుంబంలో తలిదండ్రులు, ఇద్దరు కూతుళ్లు అథ్లెటిక్స్‌లో పతకాల పంట పండించడం అరుదైన విషయంగా చెప్పవచ్చు. ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడకు చెందిన ఆటో డ్రైవర్ వైరాగడే ఆనందరావు కుటుంబం అథ్లెటిక్స్‌లో అసాధారణ ప్రతిభ కనబరుస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. వీరి ఆదర్శంపై 'న్యూస్‌టుడే' స్ఫూర్తిదాయక కథనం.

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

మండలంలోని బూరుగూడకు చెందిన వైరాగడె ఆనందరావు, శకుంతల దంపతులకు నలుగురు కూతుళ్లు. పెద్ద కూతుళ్లిద్దరికి పెళ్లిళ్లయ్యాయి. కడుబీద స్థితిలో ఉన్న ఈ కుటుంబ పోషణ కోసం ఆనందరావు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. యాభై ఏళ్ల వయసు సమీపిస్తున్న మలివయసులోనూ ఆనందరావులో క్రీడా స్ఫూర్తి తొణికిసలాడుతోంది. పదో తరగతి వరకు చదువుకున్న ఆనందరావు ఉపాధి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ జీవన పోరాటం సాగిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. తన క్రీడా స్ఫూర్తిని భార్య శకుంతల, కూతుళ్లు హేమలత, దీప్తిలకు అందించాడు. వారు కూడా ఆనందరావు బాటలో నడుస్తూ అథ్లెటిక్స్‌లో అదరగొడుతున్నారు. క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

పరుగు పెడితే పతకమే..

వెటరన్ క్రీడాకారుడైన ఆనందరావు పతకాల పట్టికలో తాజాగా మరో మూడు పతకాలు చేరాయి. డిసెంబరు 29 నుంచి 31 వరకు బెల్లంపల్లిలో నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ తెలంగాణ 5వ రాష్ట్రస్థాయి పోటీల్లో 10 కి.మీ. పరుగు, 1500 మీ. పరుగు, 800 మీ. పరుగులో తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించారు. పాల్గొన్న మూడింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు.



ఆటో నడిపిస్తూ..ఆనందరావు

మార్చి 23 నుంచి 27 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన 38వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆనందరావు రజత పతకం సాధించారు. ఈ పోటీల్లో 5 కి.మీ. రేస్ వాక్‌లో గమ్యాన్ని 30.13 నిమిషాల్లో చేరి ద్వితీయ స్థానంలో నిలిచారు. వెటరన్ క్రీడాకారుడిగా ఆనందరావు పరుగు, నడక పందేల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అప్పటికే రెండు బంగారు పతకాలు, ఐదు వెండి పతకాలను సాధించి ఈ ప్రాంతంలోని క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారు. తన గ్రామంలోని కాలువ గట్టే రన్నింగ్ ట్రాక్‌గా నిత్యం ఉదయం, సాయంత్రం 20 కి.మీ. నడక, పరుగు సాధన చేస్తున్నారు. తినడానికి బలమైన తిండిలేక పోయినప్పటికీ ఆత్మస్థైర్యంతో నెగ్గుతున్నానన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతానంటున్నారు. తనతో పాటు తన భార్య, కూతుళ్లను అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయికి సిద్ధం చేసిన ఆనందరావును తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం క్రీడా పురస్కారాన్ని అందజేసి సత్కరించింది. జిల్లా ఎస్పీ, క్రీడాకారులు, తోటి ఆటో డ్రైవర్లు ఆనందరావును పలు సందర్భాల్లో ఘనంగా సత్కరించారు.

భర్త అడుగుజాడలో శకుంతల

భర్త ఆనందరావు కుటుంబ బాధ్యతల్లో పాలు పంచుకుంటున్న ఆయన అర్ధాంగి శకుంతల క్రీడల్లోనూ భర్త అడుగుజాడల్లో నడుస్తున్నారు. భర్త ఆటో డ్రైవర్‌గా వెళ్తే కూతుళ్ల చదువు, పోషణ భారం మోసేందుకు కూలి పనులకు వెళ్తూనే నడక, పరుగులో సాధన చేస్తూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. భర్త ఆనందరావు రాష్ట్ర, జాతీయస్థాయి పరుగు పందేల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లినపుడు వెంట వెళ్లి ఆయన్ని ప్రోత్సహించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఆమె ఈ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. డిసెంబరు చివర్లో బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌సిప్ పోటీల్లో పాల్గొనేందుకు భర్తతో పాటు వెళ్లారు. 40 ఏళ్ల పైబడిని వారితో పోటీపడి 5 కి.మీ. రేస్ వాక్‌లో, 200మీ.ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. 400×100మీ. రిలే పరుగులో ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీల్లో మూడు రాష్ట్రస్థాయి పతకాలతో ఈ ప్రాంత క్రీడాభిమానులను ఆశ్చర్యంలో ముంచెత్తారు.

కుస్తీలో హేమలత



ఆనందరావు కూతురు హేమలత ఇప్పుడు ఎమ్మెస్సీ చదువుతున్నారు. చిన్ననాటి నుంచి తండ్రి క్రీడా కౌశలాన్ని చూసి స్ఫూర్తి పొందారు. పాఠశాల, కళాశాల చదువుల సందర్భంగా యువతులు అరుదుగా రాణించే రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో పట్టు సాధించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పాల్గొని పతకాలు సాధించి తండ్రితగ్గ తనయగా నిలిచారు.

కరాటే, డిస్కస్‌త్రో, హ్యాండ్‌బాల్ క్రీడల్లో మెరిసిన దీప్తి



ఆనందారావు చిన్నకూతురు దీప్తి తండ్రి నుంచి క్రీడా స్ఫూర్తిని అందుకొని పలు క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. మందమర్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాన్ని సాధించారు. హ్యాండ్ బాల్ పోటీల్లో వరుసగా రెండేళ్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. డిస్కస్‌త్రో అథ్లెటిక్స్ లోనూ జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానం పొందారు. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగేందుకు పట్టుదలతో ఉన్నానన్నారు. ప్రస్తుతం బీఎస్సీ చదువుతున్నారు.

నాట్య మయూరం



- వేదిక ఏదైనా ప్రదర్శన అద్భుతం
- బుల్లితెర 'ఆట'లో ద్వితీయస్థానం
- నాట్యం, నటనలో దీక్ష ప్రతిభ

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

అభిరుచి, పట్టుదల, అలుపెరుగని సాధనతో తను ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని నిరూపిస్తోంది ఈ బాలిక. తలిదండ్రుల ప్రోత్సాహంతో శాస్త్రీయ నృత్యంపై మక్కువ పెంచుకొని చిన్నతనంలోనే గొప్ప కళాకారిణిగా పేరు సంపాదించింది. బుల్లితెర రియాలిటీ షో ఆట 6లో అద్భుత నాట్యప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచింది. సినిమాల్లో అవకాశాలను అందుకొంది. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో స్వాగత నృత్యం చేసి కలెక్టర్ ప్రశంసలందుకున్న దీక్ష అసావా ప్రతిభపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

జూన్ రెండో తేదీన ఆసిఫాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో 'ఏకదంతాయ వక్రతుండాయ' అంటూ శాస్త్రీయ స్వాగత నృత్యం చేసి అందరి దృష్టిని ఆకర్షించిన దీక్ష అసావ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వ్యాపారి కిషన్‌గోపాల్, పూనంల కూతురు. నాలుగో యేటనే చిన్నారికి నృత్యంపై ఆసక్తి ఉన్నట్లు గమనించిన తలిదండ్రులు స్థానిక శ్రీనర్తనం నృత్యాలయ ఆచార్యులు బిట్ల వెంకటస్వామి వద్ద శిక్షణ కోసం చేర్పించారు. అక్కడ మొదలైన దీక్ష నృత్య సాధన ఇప్పటికీ కొనసాగుతోంది. చదువుకొనే పాఠశాల, పట్టణంలోని ఉత్సవాల వేదికలపైన ప్రదర్శనలిస్తూ టీవీ, సినిమాల వరకు ఎదిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న దీక్ష భరత నాట్యం, కూచిపూడి శాస్త్రీయ నృత్యాలతో పాటు జానపద, పాశ్చాత్య నృత్యాల్లోనూ ఆరితేరింది. వేదిక ఏదైనా నృత్యంలో తన ముద్రవేసి ప్రశంసలందుకొంటోంది.



హైదరాబాద్‌లో జరిగిన పోటీలో దీక్ష నృత్యం

బుల్లితెరపై...

అయిదేళ్ల క్రితం మందమర్రిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో బుల్లితెర ఆట ప్రదర్శన కోసం దీక్ష ఎంపికైంది. ఈ ఆట 6లో తన అసాధారణ ప్రతిభతో డ్యాన్స్ మాస్టర్లను ముగ్ధుల్ని చేసింది. తుది పోటీలో రెండో స్థానంలో నిలిచిందని దీక్ష గురువు బిట్ల వెంకటస్వామి తెలిపారు. చిన్నతనం నుంచే నాట్యంలో ఆకట్టుకున్న దీక్ష అన్ని స్థాయిల్లోనూ. అన్ని వేదికల్లోనూ ఆకట్టుకుంటోందని తెలిపారు.

సినిమాల్లో...

నాట్యంలో ప్రతిభ కనబరుస్తున్న దీక్ష ఓంకార్ దర్శకత్వంలో నిర్మించిన జీనియస్ సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకుందని, విడుదల కావాల్సి మరో సినిమాలోనూ నటించిందని దీక్ష కుటుంబీకుల తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆవిర్భావ వేడుకల్లో దీక్ష స్వాగత నృత్యం చూసిన కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించి ప్రశంసించడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఆకలి తీర్చి.. ఆప్తులయ్యారు

- నిర్మల్ ప్రభుత్వ మాతా, శిశు సంక్షేమ ఆసుపత్రిలో నిర్వహణ
- నిత్యం రోగుల బంధువులకు అన్నదానం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేది సర్వసాధారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. అలాంటి వారి ఆకలిని తీర్చేందుకు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు వారు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిర్మల్ ప్రభుత్వ మాతా, శిశు సంక్షేమ ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులు, సహాయకులకు శ్రీ సత్యసాయి నిత్యన్నదాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేస్తూ తమవంతు సేవా దృక్పథాన్ని చాటుకుంటున్న నేపథ్యంపై 'న్యూస్‌టుడే' కథనం.

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా, శిశు సంక్షేమ ఆసుపత్రికి జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల నుంచి ప్రసూతి కోసం వస్తుంటారు. ఆసుపత్రిలో ప్రతినిత్యం సరాసరిగా పదికి పైగా ప్రసవాలు జరుగుతాయి. కొన్ని సమయాల్లో సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. రోగులు దాదాపు వారం రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి ఉంటుంది. అయితే సదరు రోగికి ఆసుపత్రి వారే అవసరమైన ఆహారం, పాలు వంటి వాటిని అందజేస్తారు. అయితే రోగితో పాటు ఉండే బంధువులు, సహాయకులు బయటి నుంచి ఆహారం తెచ్చుకోవడమో లేదా అక్కడే వంట చేసుకోవడమో వంటివి చేసుకునేవారు. ఆసుపత్రికి వచ్చే వారు పేద, మధ్య తరగతి వారే కావడంతో రోజుల తరబడి భోజనానికి పెద్ద మొత్తంలోనే ఖర్చు అయ్యేది. దీనిని గమనించిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు వారు నిత్యన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వారి ఆకలిని తీరుస్తున్నారు. ప్రతి నిత్యం ఉదయం 9.30 గంటలకు ఆసుపత్రిలో ఉన్న రోగుల వద్దకు వెళ్లి అక్కడ వారికి సేవలు చేసే సహాయకులు, బంధువులను గుర్తించి ఇద్దరేసి చొప్పున టోకెన్లను అందజేస్తారు. అనంతరం వారి సంఖ్యను బట్టి అవసరమైన ఆహారాన్ని వండి వడ్డిస్తున్నారు.

నిత్యం వందకు పైనే...

ప్రతి రోజు వంద నుంచి 150 మందికి సదరు ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యాన్నదానాన్ని అందజేస్తున్నారు. భోజనం విషయంలో ఎలాంటి వెనుకడుగు వేయకుండా ఇంటి వద్ద చేసే భోజనాన్ని మైమరిపించేలా సదరు ట్రస్టు వారు వండుతున్నారు. నాణ్యమైన బియ్యం వండుతున్నారు. ఒక కూర, చట్నీ, సాంబారు, మజ్జిగ, అన్నం అందజేస్తున్నారు. మధ్యాహ్నం భగవాన్ శ్రీ సత్యసాయిబాబాకు హారతి అనంతరం 12 గంటల నుంచి ప్రతినిత్యం భోజనం అందజేస్తున్నారు. సదరు బంధువులు, సహాయకులకు చాలినంత వడ్డిస్తారు. అలాగే భోజనం పరబ్రహ్మ స్వరూపమని దానిని వృథా చేయకూడదని వారు బోధిస్తుంటారు. ప్రతినిత్యం ఆరుగురు శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యుల బృందం వచ్చి భోజనాన్ని వడ్డిస్తారు. అలాగే వంట చేసేందుకు ఇద్దరు మహిళలను ప్రత్యేకంగా నియమించారు.



దాతల వివరాల కోసం ఏర్పాటు చేసిన బోర్డు

మూడు చోట్ల...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు చోట్ల భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆయా ఆసుపత్రుల్లో నిత్యన్నదాన కార్యక్రమం జరుగుతోంది. ఆదిలాబాద్‌లో 2012, మంచిర్యాలలో 2016లో ప్రారంభం కాగా, నిర్మల్ జిల్లా కేంద్రంలో 2017 అక్టోబరు 20న ప్రారంభించారు. దాతల సహాయ సహకారాలతో పాటు ట్రస్టు సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవాలు, తదితర కార్యక్రమాల సమయంలో దాతలు ముందుకు వచ్చి అన్నదానం చేస్తున్నారు. ఒకవేళ దాతలు లేని సమయంలో సదరు ట్రస్టు వారే అన్నదానం చేపడుతూ ఆకలి తీరుస్తూ తమదైన ముద్రను వేసుకుంటున్నారు.

భోజనం చాలా బాగుంది



- గంగవ్వ, రోగి బంధువు, బంగల్‌పేట్

మాది నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్. నా కోడలు ప్రసవానికి ఆరు రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చాం. నేను వచ్చినప్పటి నుంచి నిత్యం మధ్యాహ్నం ఇక్కడే భోజనం చేస్తున్నాను. అన్నంతో పాటు కూర, సాంబారు, చట్నీ, మజ్జిగ ఇస్తున్నారు. ఇంటి భోజనాన్ని మైమరిపించేలా చాలా బాగుంది.



భోజనం వడ్డిస్తున్న సభ్యులు

నిత్యం ఆరుగురు సభ్యులం సేవలందిస్తాం



- కమల, శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యురాలు, నిర్మల్

ఆరుగురు సేవాదళ్ సభ్యులతో ఒక బృందం ఏర్పాటు చేశాం. ప్రతి రోజు ఒక బృందం వచ్చి ఇక్కడ సేవలు చేస్తాం. రోగుల బంధువులు, సహాయకులకు ఎంత కావాలంటే అంత భోజనాన్ని అందజేస్తాం. ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం చాలా ఆనందదాయకం.

నాణ్యత విషయంలో రాజీపడం



- బి.భీమ్‌సేన్, శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు అధ్యక్షులు, నిర్మల్

అందజేసే భోజనం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఇంటిని మైమరిపించేలా అందజేస్తున్నాం. ఆసుపత్రికి వచ్చేవారు పేద, మధ్య తరగతి వారే. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని వారి ఇబ్బందులను దూరం చేయాలన్న లక్ష్యంతో ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యన్నదానం చేపడుతున్నాం. దాతలు లేని సమయంలో ట్రస్టు ఆధ్వర్యంలోనే భోజనం అందజేస్తున్నాం. దాతలు తమవంతు సహాయ సహకారాలు అందించి పేదల ఆకలిని తీర్చాలి.

సేవతో చేరువై



- సామాజిక చైతన్యం ఆయన లక్ష్యం..
- పలు గ్రామాలకు రహదారి, తాగునీటి సౌకర్యం..
- ఆదర్శంగా నిలుస్తున్న దహెగాం ఎస్ఐ రమేష్

దహెగాం, న్యూస్‌టుడే

చట్టా వ్యతిరేక పనులపై ఉక్కుపాదం మోపడంలో ఆ యువ ఎస్ఐ దిట్ట. ప్రజలతో మమేకమవుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించి సామాజిక సేవ దృక్పథంగా పనులు చేయడం ఆయన నైజం. కొత్తపాత తేడా లేకుండా ప్రజల్లో కలిసిపోవడం ఆయన ప్రత్యేకత. ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకొని పోలీసులంటే భయాన్ని తొలగిస్తున్నారు. అంతే కాదు రక్షక భట నిలయాన్ని ఉద్యాన వనంలా తీర్చిదిద్దారు. దహెగాం ఎస్ఐ దీకొండ రమేష్ సామాజిక సేవలపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న కథనం.

జిల్లాలోనే అతిమారుమూల మండలం దహెగాం. ఏ శాఖలోనైనా ఈ మండలంలో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు కొంత వెనుకముందు ఆలోచిస్తారు. అదే పోలీసు ఉద్యోగం విషయంలో మరింత సమస్యగానే ఉంటుంది. ఇలాంటి మండలంలో అక్టోబర్, 2015లో దీకొండ రమేష్ దహెగాం ఎస్ఐగా విధుల్లో చేరారు. మండలంలోని గ్రామాలపై అవగాహన పెంచుకోవడం, ఆయా గ్రామాల్లో జరిగే చట్టా వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి సారించారు. అక్రమ వ్యవహారాలపై ఉక్కుపాదం మోపారు. మరో వైపు గ్రామీణుల్లో కలిసి పోయేందుకు పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో గుర్తింపు సాధించారు. పేకాట, గుడుంబా, కోడి పందేల అడ్డాలపై దాడులు నిర్వహించి ఎన్నడూ లేని విధంగా కేసులు నమోదు చేశారు. ఒకే ఏడాదిలో రెండు సార్లు ఎస్పీ చేతుల మీదుగా పురస్కారాలు పొందిన ఘనత ఆయనకు దక్కింది. అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్నారు. తాగు నీటికి ఇబ్బందులున్నాయని తెలపగానే శంకరాపురం గ్రామస్థులకు చేతిపంపు వేయించారు. లోహ గ్రామస్థులకు బోరు, విద్యుత్తు మోటారు, మినీ మంచి నీటి ట్యాంకు నిర్మించి డీఎస్పీ సాంబయ్య చేతుల మీదుగా ఇటీవల ప్రారంభించారు.

సామాజిక కార్యక్రమాల్లో ముందు...

- నాటుసారా తయారీదారులతో అప్పటి జిల్లా పాలనాధికారి చంపాలాల్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌లను ముఖ్య అతిథులుగా అవగాహన సదస్సు నిర్వహించారు.
- దిగిడ గ్రామంలో అంతర్గత రోడ్డు నిర్మాణాలు చేపట్టారు.
- శంకరపురంలో తాగునీటి కోసం చేతిపంపు వేయించారు.
- కొంచవెల్లి నుంచి చింతపురి ఎర్రవాగు వరకు మొరం రోడ్డు వేయించారు.
- కొంచవెల్లి గ్రామానికి చెందిన కె.పోశక్క అనే నిండు గర్భిణి రక్తస్రావంతో బాధపడుతుండగా సకాలంలో స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రక్తదానం చేయించి ప్రాణాలు కాపాడారు.
- పలు గ్రామాల్లో బడి మానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించారు.
- శంకరాపురం గ్రామంలో తాగు నీటి కోసం ప్రజలకు చేతిపంపు ఏర్పాటు చేశారు.
- దహెగాం పోలీస్‌స్టేషన్‌లో ఉద్యానవనంలా తలపిస్తున్న వివిధ రకాల మొక్కలను పెంచారు.
- దహెగాం పోలీస్‌స్టేషన్ పరిధిలో మెగా రక్తదాన శిబిరాలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు.
- రాంపూర్ గ్రామానికి చెందిన అంజలి అనే విద్యార్థినికి శస్త్ర చికిత్స నిర్వహించి ఆమెకు ప్రాణదాత అయ్యారు.
- బీబ్రా గ్రామంలో హరితహారంలో భాగంగా ప్రభుత్వ భూమిలో మొక్కలను నాటారు.
- లోహ గ్రామానికి 4 కిలోమీటర్ల, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి కోసం బోరు, విద్యుత్తు మోటారు, రక్షిత మంచి నీటి మినీ పథకం ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించారు.
- లోహ గ్రామంలో మెడిలైఫ్ ఆసుపత్రి వారి సహకారంతో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు.



రక్తదానం చేస్తున్న ఎస్ఐ దీకొండ రమేష్ (దాచిన చిత్రం)



జిల్లా ఎస్పీ విక్రమ్‌జిత్ దుగ్గల్ చేతుల మీదుగా పురస్కారం..

సామాజిక సేవతోనే సంతృప్తి



- దీకొండ రమేష్, ఎస్ఐ దహెగాం

సామాజిక సేవలతోనే ఎంతో సంతృప్తి ఉంటుంది. అధికారుల ప్రోత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చిన తనకు తోచిన విధంగా సహాయ సహకారాలందిస్తాను. నేరుగా తనను సంప్రదిస్తే అధికారుల సహాయ సహకారాలు తీసుకొని సమస్యలను పరిష్కరిస్తా. ప్రజలు సహకరిస్తే ఇంకా ముందుకు వెళ్తా.

వలస బతుకు గోస.. ముసాయిదాపైనే ఆశ...



☛ ప్రవాస విధానం అమలుతోనే మేలు ☛ నేడు నిర్మల్‌లో ఎన్ఆర్ఐ పాలసీ సాధన దీక్ష

నిర్మల్, న్యూస్‌టుడే:

ఏళ్లుగా ఎడారి వంచన చేరిన అభాగ్యులు వారు.. ఎప్పుడు ఆశలు ఆకాశ సౌధాలవుతాయో.. ఎప్పుడు నిరాశ నిస్పృహలు నీడలా వెంటాడుతాయో తెలియకుండా జీవనం గడుపుతున్నారు. బతుకు పూలవనంలో కొందరు వికసిస్తుంటే.. మరికొందరు వికసించకుండానే రాలిపోతున్నారు.. గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం ప్రభుత్వం ముసాయిదా ప్రకటించినా ఆచరణలో కనిపించడం లేదు. గల్ఫ్ బాధితులకు ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్మల్‌లో దీక్ష చేపట్టనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

గల్ఫ్ దేశాలంటే జిల్లాలో తెలియని గడప ఉండదు. పరిచయం లేని కుటుంబం ఉండదు. కొందరు అదృష్టం వంచన చేరితే ఎంతోమంది దురదుష్టం వెంటాడుతూనే ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా ఏళ్లుగా వారి జీవితాలు మారడం లేదు. కష్టాలొస్తే కాసింత ఓదార్చేవారే కానీ శాశ్వతంగా వారి కష్టాలను దూరం చేయడం లేదు. అయితే గల్ఫ్ బాధితుల కష్టాలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినా.. వారికి తక్షణమే అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రవాసీ



గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న నిర్మల్ జిల్లాకు చెందిన కార్మికులు

విధానం రూపొందించడానికి ఏడాదిరన్న క్రితం వివిధ దేశాల్లోని ప్రవాస తెలంగాణీయులతో రాష్ట్ర ప్రవాసీ వ్యవహారాల మంత్రి కేటీఆర్ సమావేశం నిర్వహించారు. అందరికీ మేలు జరిగే విధానం రూపొందిస్తామని వివరించారు. ఆ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఏం చెప్పారంటే..

ప్రవాస తెలంగాణీయుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటాం.. దేశ విదేశాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేస్తున్నాం.. వీటన్నింటికంటే అత్యుత్తమ విధానాన్ని రాష్ట్రంలో తీసుకొస్తాం. సమగ్ర సమాచార నిధిని ఏర్పాటు చేసి బీమా పథకం అమలు చేస్తాం. ముసాయిదా కోసం వివిధ దేశాల నుంచి వచ్చిన వారి అభిప్రాయాలను తీసుకొని ముఖ్యమంత్రికి నివేదించి రాష్ట్ర మంత్రి వర్గంలో చర్చిస్తాం. గల్ఫ్ బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం''. అంటూ ప్రకటించినా ఇప్పటికీ ముసాయిదాలో పొందుపర్చిన అంశాలు అమలు కావడం లేదు.

ఇదీ గల్ఫ్ ముఖచిత్రం..

★ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు గల్ఫ్ దేశంలోని యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, ఖతర్, బహెరాన్, తదితర దేశాల్లో ఉన్నారు. ఉపాధి కోసం జిల్లా నుంచి 24 వేల మంది అక్కడి దేశాలకు వెళ్లారు.

★ ఉపాధి కోసం వెళ్లిన వారిలో చాలా మంది సాంకేతిక పరిజ్ఞానం లేని వారు, శిక్షణ, అనుభవం లేని వారే ఉన్నారు.

★ రోజూవారి కూలీలుగా వెళ్లి చాలా ఇబ్బందులు పడుతున్న వారు దాదాపు 5 వేల మందికిపైగా ఉన్నారు.

★ నకిలీ ఏజెంట్ల మోసాల బారిన పడి రూ. లక్షల్లో మోసపోయిన వారు వందల సంఖ్యలో ఉంటారు.

★ అక్కడి వాతావరణం సరిపడక, ఇక్కడికి రాలేక చాలా మంది ప్రాణాలకు తెగించి ఎడారి దేశాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

★ కార్మికులుగా కంపెనీల్లో పనిచేస్తూ ప్రమాదాలకు గురైన చాలా చోట్ల కనీసం బీమా చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

★ ప్రవాసులకు సంబంధించిన వివరాలు ఇప్పటికీ లేవు. గ్రామ గ్రామాన సర్వే నిర్వహించి సమాచారాన్ని సేకరించాలి.

★ వాస్తవానికి ఏ దేశానికి వెళ్లినా వారి వివరాలు అందుబాటులో లేవు. ఎక్కువగా గల్ఫ్‌దేశాలకు వెళ్తూ అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని తిరిగి రప్పించడం కష్టసాధ్యమవుతుంది.

★ ఉపాధి కోసం వెళ్లిన వారికి వీసా నిబంధనలు, కంపెనీ యజమానుల వేధింపులు ఎక్కువగా ఉండటంతో అక్కడి నుంచి ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారు.

★ పాస్‌పోర్టులను కంపెనీ సిబ్బంది వద్ద వదిలి వెళ్తున్నారు. ఇలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం జరిగినా.. అనుకోకుండా ఇంటికి రావాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రవాసులకు సంబంధించిన వివరాలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఎదురవుతుంది.

★ 2017 మార్చి నెలలో గల్ఫ్‌దేశమైన బెహరాన్‌లోని ఓ కంపెనీలో అగ్ని ప్రమాదం సంభవించి జిల్లాకు చెందిన ముగ్గురు సజీవ దహనమయ్యారు.

★ గల్ఫ్ దేశాల్లో కంపెనీలు మూతపడుతుండటంతో మూణ్నెళ్ల కాలంలో జిల్లాకు చెందిన దాదాపు 650 మంది వరకు బాధితులకు స్వగ్రామాలకు వచ్చినట్లు ప్రవాసభారతీయ హక్కుల, సంక్షేమవేదిక ప్రతినిధులు వెల్లడించారు. ఏజెంట్ల చేతిలో మోసపోయిన బాధితులకు అక్కడ పనుల్లేక 120 మంది వరకు తిరిగి వచ్చారని స్పష్టం చేశారు.

పనిచేయని సహాయ కేంద్రం

ప్రవాసుల సమస్యల పరిష్కారం కోసం అన్ని జిల్లాల కలెక్టరేట్లలో సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇక్కడ కేంద్రంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పనిచేయడం లేదు. కేవలం బోర్డులకే పరిమితమై ఖాళీ కుర్చీలే కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సహాయ కేంద్రాల్లో నిరంతర సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. సిబ్బంది నియామకంతో పాటు టోల్‌ఫ్రీ నెంబరు కేటాయించనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుచేస్తే బాగుంటుందని గల్ఫ్ కార్మిక కుటుంబాలు ఆశతో ఎదురు చూస్తున్నాయి.

ఒకరిని చూసి ఒకరు..

ఒకరు చూసి ఒకరు అన్న చందంగా విదేశాలకు వెళ్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అక్కడ జరిగిన నిబంధనలతో పాటు ఉపాధి అవకాశాల్లో కోత ఉంటుండటంతో చాలా మంది తిరిగి వస్తున్నారు. జిల్లాలో ఏటా గల్ఫ్ దేశాల నుంచి తిరిగి వచ్చే సంఖ్య 1500 నుంచి 2 వేల వరకు ఉంటున్నారు. ఎంతమంది వస్తున్నారో అంతమంది వెళ్తున్నారు.

ఏజెంట్ల మోసాలకు బలి..

మాయమాటలు చెబుతూ ఏజెంట్ల వలలో ఎంతో మంది బాధితులకు ఇప్పటికీ చిక్కుకుంటున్నారు. గల్ఫ్ దేశాల్లో మంచి కంపెనీల్లో మంచి ఉద్యోగం కల్పిస్తామని ఆశ చూపించి అక్కడెళ్లిన తర్వాత గొర్రెలు మేపడం, మరుగు దొడ్లు శుభ్రం చేయించడం వంటి పనులు అప్పజెప్తున్నారు. ఇక్కడి వారి నిరక్షరాస్యతను సొమ్ముగా చేసుకుంటున్నారు. మంచి ఉద్యోగం కల్పిస్తామంటూ రూ. లక్షలు సంపాదిస్తూ అమాయకులను ఇంకా మోసం చేస్తూనే ఉన్నారు. నెల రోజుల్లో ఏజెంటు చేతిల్లో మోసిపోయిన దాదాపు 120 మంది స్వగ్రామాలకు వచ్చారు. ఎడారి కష్టాలకు కళ్లెం వేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు..

జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు కమిటీలు వేయాలని ప్రభుత్వం ప్రకటించిన ముసాయిదాలో పేర్కొన్నా.. ఉమ్మడి జిల్లాలో నాలుగు కలెక్టర్ల కార్యాలయాల్లో ఎక్కడా కూడా కమిటీలు వేయలేదు. గతంలోనూ కలెక్టర్ కార్యాలయాల నుంచి గల్ఫ్ కార్మికులకు సంబంధించిన పలు నివేదికలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరినా స్పందన కనిపించలేదు. గల్ఫ్ కార్మికులు మృతిచెందితే ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించాల్సి ఉంది. ఈ నిబంధన తెలియక ఎవరూ కూడా దరఖాస్తులు చేసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

మిషన్ కాకతీయ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

పార్డి(కె)(కుభీరు), న్యూస్‌టుడే: మండలంలోని పార్డి(కె) గ్రామం సమీపంలో నిర్మించిన కస్రా రిజర్వాయర్ ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను బుధవారం నీటిపారుదలశాఖ నిర్మల్ డీఈఈ అప్పాల నాయుడు పరిశీలించారు. నిర్మిస్తున్న అలుగు గోడలు, కాలువల తవ్వకం పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. చేపట్టిన పనులకు నీటిని క్రమం తప్పకుండా పోయాలన్నారు. కాలువలపై నిర్మిస్తున్న చిన్నవంతెనలు నిర్మించి చివరి భూములకు సాగునీరు అందేలా పనులు ఉండాలన్నారు. ఆయన వెంట ఏఈ రామారావు, నిర్మాణదారులు సాతం నందుకుమార్, ఆకుల వెంకటి తదితరులున్నారు.

దళితబస్తీ భూములను పరిశీలించిన శిక్షణ ఐఏఎస్ అధికారి

జైనథ్, న్యూస్‌టుడే: జైనథ్ మండలంలోని మాకోడ గ్రామంలో దళితబస్తీ భూములను శిక్షణ ఐఏఎస్ అధికారి గోపి బుధవారం పరిశీలించారు. వ్యవసాయానికి భూములు ఆమోదయోగ్యంగా ఉన్నాయా లేవో చేనులో తిరిగి పరిశీలించారు. 47.12 ఎకరాలకుగాను 17 మంది లబ్ధిదారులను గుర్తించి ప్రతిపాదనలు పంపించామని తహసీల్దార్ ప్రభాకర్ ఆయనకు వివరించారు. మాకోడలో 13 మంది, బెల్గాంలో నలుగురు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. తొలుత గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడారు. భూములు సాగుకు ఆమోదయోగ్యంగా ఉన్నాయా అని అడగగా అవునని సమాధానమిచ్చారు. ఏమైనా సమస్యలుంటే చెప్పాలని పేర్కొన్నారు. భూములు ఎలా ఉన్నాయో రిజిస్ట్రేషన్ కంటే ముందే చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి నిమ్మల స్వామిరెడ్డి, వీఆర్వో విజయలక్ష్మి ఉన్నారు.



భూములను పరిశీలిస్తున్న శిక్షణ ఐఏఎస్ అధికారి గోపి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రెండు పడక గదుల ఇళ్లను పరిశీలిస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ భూమారెడ్డి

జైనథ్, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ భూమారెడ్డి అన్నారు. జైనథ్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న 131 రెండు పడక గదుల ఇళ్లను నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. దేశంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళుతోందన్నారు. తెలంగాణ వస్తే ఆలయానికి వస్తానని మొక్కుకున్నానని పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని ఆయన సతీమణితో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వెంకటరమణాచార్యులు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం ఆయన్ను ఆలయ కమిటీ ఛైర్మన్ సర్పన్ లింగారెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మనోహర్, తెరాస నాయకులు తల్లెల చంద్రయ్య, గణేష్‌యాదవ్, గడ్డం పోతారెడ్డి, పూండ్రు వెంకట్‌రెడ్డి, కళ్లెం కిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

క్రికెట్‌లో చిచ్చర పిడుగు..!!

★ అండర్-14 క్రికెట్ రాష్ట్ర జట్టుకు డీసీసీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తనయుడు ఎంపిక

★ ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్న ఏలేటి సృంజిత్‌రెడ్డి





ఏలేటి సృంజిత్‌రెడ్డి

నిర్మల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి తనయుడు ఏలేటి సృంజిత్‌రెడ్డికి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ప్రాణం. . స్కూల్‌కు వెళ్లకముందే బుడిబుడి అడుగులతో బ్యాట్, బాల్ అందుకుని ఆడాడు. ఆటపై ఉన్న మక్కువను గమనించిన తండ్రి మహేశ్వర్‌రెడ్డి అప్పటి నుంచి క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తూ వస్తున్నారు. ఆటలో చూపిస్తున్న ప్రతిభతో అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. కేరళలో ఈనెల 7 నుంచి 21 వరకు జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

11 ఏళ్ల ప్రాయంలోనే..


ఏలేటి సృంజిత్‌రెడ్డికి ప్రస్తుతం 11 సంవత్సరాలు. సాధారణంగా అండర్-14 జట్టులో 13, 14 సంవత్సరాలకు చెందిన వారే ఎక్కువగా ఉంది. క్రికెట్ ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన చూపెట్టడంతో అతి చిన్న వయస్సులోనే రాష్ట్ర జట్టుకు ఎంపికై అందరిచే ప్రశంసలు అందుకున్నాడు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని లక్ష్యంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో కఠోర సాధన చేస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో ఆల్‌రౌండ్ ప్రతిభ చూపెట్టాడు. తొమ్మిది మ్యాచ్‌లలో నాలుగు సార్లు ప్రత్యర్థి జట్టుకు చెందిన ఐదేసి వికెట్లు పడగొట్టి మొత్తం 33 వికెట్లు తీసి అత్యుత్తమ బౌలర్‌గా ఎంపికయ్యాడు. అలాగే తన బ్యాట్‌తోనే ప్రతిభ చూపెట్టాడు. ప్రత్యర్థి జట్లపై పరుగుల వర్షం కురించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తన తనయుడు సృంజిత్‌రెడ్డి అండర్-14 రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం పట్ల డీసీసీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే

బాల్యం దాటకముందే బాలికల భారాన్ని దించేసుకుంటున్నారు.. ఆడపిల్ల ఇంట ఉంటే తంటేనని భావన చాలామందిని కలిచివేస్తోంది. ఎవరికో ఒకరికి అంటగట్టి బరువును తగ్గించుకుంటున్నారు. ఈ భావన ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో 103 బాల్య వివాహాలను ఐసీడీఎస్, పోలీసు అధికారులు అడ్డుకోవడం అందుకు అద్దం పడుతోంది. దీనికితోడు ఆలనాపాలన సరిగాలేని ఆడపిల్లలను గుర్తించి, అనువైన సమయంలో వారిని ఎత్తుకెళ్లి అమ్మేసేవారు కొందరైతే, ఆడపిల్లలంటే భారంగా భావించే కొందరు తల్లిదండ్రులే స్వయంగా తమ పిల్లలను పెళ్లిపేరిట ఇతర రాష్ట్రాల్లోని పెద్దమనుషులకు అప్పగిస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలు సభ్య సమాజం తలవంచుకునేలా చేస్తున్న నేపథ్యంలో 'ఈనాడు' ప్రత్యేక కథనం..

బాల్యం బందీ!

- బాలికలకు పెళ్లిళ్లు
- ఏజెన్సీలో అధికం
- ఇతర రాష్ట్రాలకు తరలించే ముఠా సంచారం



ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అవగాహన రాహిత్యం, ఆడ పిల్లలు ఎక్కువ రోజులు ఇంట్లో ఉండకూడదనే భావనతోనే వారు బాల్య వివాహాలవైపు వెళ్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా పరిశీలిస్తే ఏజెన్సీ ప్రాంతవాసులే ఇలాంటి పనులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, తలమడుగు, తాంసి మండలాల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో 59 వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. నిర్మల్ జిల్లాలోని తాండ్ర, ఖానాపూర్, మామడ ప్రాంతాల్లో 38 బాల్య వివాహాలను, మంచిర్యాల జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 24, కుమురం భీం జిల్లాలోని 13 వివాహాలను పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు.

ఇతర రాష్ట్రాలకు తరలింపు..

జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే కొన్ని కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని మోసాలు చేస్తున్నారు. ఆడ పిల్లలకు ఊహ తెలియని సమయంలోనే బాల్య వివాహాలు జరిపించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు సంవత్సరాలలో అధికారుల దృష్టికి వచ్చిన బాల్య వివాహాల సంఖ్య 103. ఈ లెక్కన గుట్టు చప్పుడు కాకుండా వేల సంఖ్యలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని అర్థమవుతోంది. ఐసీడీఎస్, ఐసీపీఎస్, సఖి కేంద్రంవారు కలిసి ఈ సంవత్సరం కొన్ని బాల్య వివాహాలకు అడ్డుకట్టవేయగలిగారు. వారి తల్లి దండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి సముదాయించే ప్రయత్నంచేశారు. బాల్య వివాహాలు చేసుకునే పురుషులకు, అందుకు సహకరించేవారికి రెండేళ్ల జైలుశిక్ష ఉన్నప్పటికీ, దాని ప్రభావం ఎక్కడా కనిపించడం లేదు.

ఈ చట్టం అమల్లో జిల్లా కలెక్టర్ సహా, సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు, సీడీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు కీలకంగా వ్యవహరించాల్సి ఉన్నప్పటికీ, ఆదిశగా కేసులు నమోదైన దాఖలాలు లేవు. బాలికల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ, అవి సరిగా అమలు కావడంలేదు. బాల్య వివాహ చట్టం 2006, లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం 2012, మహిళ, బాలికల సంస్థల లైసెన్సింగ్ చట్టం 1956, వెట్టి కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం 1976, అక్రమ రవాణా నిరోధక చట్టం 1956 తదితర చట్టాలు బాలికల బాగోగుల కోసం పనిచేస్తున్నప్పటికీ, వాటి ప్రభావం జిల్లాలో పెద్దగా కనిపించడం లేదు.

ఉమ్మడి జిల్లాలో బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్న తీరు...

2014	2015	2016	2017
59	18	15	11

ప్రత్యేక ముఠాల సంచారం..

అభం శుభం తెలియని ఆడపిల్లలను ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు జిల్లాలో ప్రత్యేక ముఠాలు తిరుగుతున్నాయి.. ఇందులో రెండు రకాల ముఠాలు ఉన్నాయి. తల్లిదండ్రులకు సముదాయించి డబ్బులిచ్చి పెళ్లిపేరట తీసుకెళ్లేవారు కొందరైతే, తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోని ఆడపిల్లలను గుర్తించి నేరుగా ఎత్తుకెళ్లే ముఠా సభ్యులు మరికొందరున్నారు. అమాయక తల్లిదండ్రులను గమనించి, వారికి మాయ మాటలు చెప్పి కన్యాశుల్కం తరహా డబ్బుల ఆశ చూపించి ఆడపిల్లలను అక్రమ రవాణా చేస్తున్నారు. ఇది జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో సహజమైపోయింది. కెరమెరి, జైనూర్ ప్రాంతాల్లో ఇలాంటి కేసులు వెలుగుచూశాయి. అయితే బాలికల అక్రమ రవాణ నిరోదక చట్టం 1956లోనే అమల్లోకి వచ్చినప్పటికీ, అది సరిగా పనిచేయకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. ఇదిలా ఉంటే, జిల్లాలో చిన్న పిల్లలే లక్ష్యంగా కొందరు వ్యక్తులు తిరుగు తున్నారు. పసిపిల్లలకు మాయ మాటలుచెప్పి ఎత్తుకెళ్లి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

దృష్టి సారించాలి..

ఆడపిల్లలను ఎత్తుకెళ్లి విక్రయాలు జరుపుతున్న ముఠాలపై పోలీసులు, సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది. నిరాదరణకు గురయిన ఆడపిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేయాలి. ఇప్పటికే చాలామంది పిల్లలు జిల్లావ్యాప్తంగా అదృశ్యమయినందున ఆయా కేసులను లోతుగా పరిశీలించాలి. చిన్న పిల్లలను ఎత్తుకెళ్తున్న ముఠా గుట్టు రట్టు చేయాలి. ఈ విషయంలో అటు ఐసీడీఎస్, ఇటు పోలీసులు ఉమ్మడిగా పనిచేయాల్సిన అవసరముంది. జిల్లాలో ప్రారంభమైన ఆపరేషన్ చైల్డ్ కార్యక్రమంలో ఒంటరిగా తిరుగుతున్న పిల్లల జాడ వెతుకుతున్నప్పటికీ, అదృశ్యమయిన పిల్లలకోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవడం లేదు. ఈ చట్టం కింద పనిచేసే అధికారులు ఆడపిల్లల అదృశ్యాల విషయంలో కాస్త లోతుగా పనిచేయాల్సి ఉంది.



★ సిరికొండ మండలం లకంపూర్‌లో ఓ బాలికకు బలవంతంగా చేస్తున్న పెళ్లిని అడ్డుకున్న అధికారులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తున్న చిత్రమిది. మైనర్ బాలిక అయినప్పటికీ తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా పెళ్లి చేసేందుకు గ్రామస్థులు సిద్ధమయ్యారు. బాలిక నిరాకరించినప్పటికీ బలవంతం చేశారు. విషయం స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారుల దృష్టికి వెళ్లడంతో స్థానిక ఎస్సై బాలస్వామి సహాయంతో పెళ్లిని అడ్డుకున్నారు. ఇలాంటి బాల్య వివాహాలు ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా జరుగుతున్నాయి.



★ ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన రవి, దశరథ్‌లు తమ కుమార్తెలను రాజస్థాన్‌కు చెందిన బజరంగీకి విక్రయింస్తూ పోలీసులకు పట్టుబడడంతో వారిని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన చిత్రమిది. ఏడాదిక్రితం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వేస్టేషన్‌లో ఇద్దరు చిన్నారులను అప్పగించి డబ్బులు తీసుకునే సమయంలో తేడారావడంతో ఇరువురి మధ్య కాస్త గొడవ జరిగింది. విషయాన్ని గమనించిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో షీటీం సభ్యులు, పోలీసులు వెళ్లి కొనుగోలుదారుడు బజరంగీ, మధ్యవర్తి లతీఫ్, ఆడపిల్లల కుటుంబసభ్యులను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించి కేసులు నమోదు చేశారు. విక్రయించ తలపెట్టిన ఆడపిల్లల్లో ఒకరికి పన్నెండేళ్లు, మరొకరికి ఎనిమిదేళ్లు ఉన్నాయి. ఇలా చిన్నపిల్లలను నయానో బయానో తీసుకెళ్లి ఇతర రాష్ట్రాల్లో అమ్మేసే ముఠా జిల్లాలో సంచరిస్తుంది.

తెలిసిన వెంటనే పెళ్లిళ్లు ఆపుతున్నాం

- రాజేంద్రప్రసాద్, జిల్లా బాలల సంరక్షణ అధికారి



ఎక్కడైనా మైనర్ బాలికలకు పెళ్లి చేస్తున్నట్లు సమాచారం రాగానే వెళ్లి పోలీసుల సహాయంతో ఆపుతున్నాం. చిన్న పిల్లలకు పెళ్లి చేయడం నేరం. ఈ విషయంపై ఏజెన్సీ ప్రాంతంలో అవగహన కల్పిస్తాం. ఎక్కడైనా ఆడ పిల్లలను అమ్ముతున్నట్లు తెలిస్తే చరవాణి నెంబరు 9440555872కు సమాచారం ఇవ్వండి. వెంటనే స్పందిస్తాం.

నేడు ఆదిలాబాదులో సబ్ జూనియర్ అథ్లెటిక్ మీట్

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: అండర్ 10, 12, 14 సంవత్సరాల్లోపు విద్యార్థులకు సబ్ జూనియర్ అథ్లెటిక్ అసోసియేషన్ మీట్‌ను గురువారం ఉదయం 9 గంటలకు ఆదిలాబాదు జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహిస్తున్నట్లు సంఘ నిర్మల్ జిల్లా కార్యదర్శి శామ్యూల్ తెలిపారు. ఇందులో భాగంగా పదేళ్లలోపు విద్యార్థులకు 60, 200, 600 మీటర్ల పరుగుపందెం, దూరం దూకుట, 12 సంవత్సరాల్లోపు వారికి 80, 300, 600 మీటర్ల పరుగుపందెం, దూరం దూకుల, ఎత్తు దూకుట, షాట్‌పుట్, 14 సంవత్సరాల్లోపు వారికి 100, 200, 400, 800 మీటర్ల పరుగుపందెం, దూరం, ఎత్తు దూకుట, షాట్‌పుట్ క్రీడల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలుంటాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు ఈనెల 7, 8, 9 తేదీల్లో హైదరాబాదులోని గచ్చిబౌలి మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పోటీల్లో పాల్గొనేవారు తమ ఆధార్‌కార్డు, బోనఫైడ్ ధ్రువపత్రాలను తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు చరవాణి 94921 36510లో సంప్రదించాలని కోరారు.

జడ్పీ ఛైర్‌పర్సన్‌కు మహిళా ఉద్యోగుల శుభాకాంక్షలు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని పలువురు మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో జడ్పీ ఛైర్‌పర్సన్ వి. శోభారాణిని జిల్లాకేంద్రంలోని ఆమె నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఇందులో మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, సరోజ, సరస్వతి, రాధ తదితరులున్నారు.



జడ్పీఛైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళా ఉద్యోగులు

కోడి కూయకముందే వరుస..

- పింఛన్ కోసం వృద్ధుల యాతన

ముథోల్, న్యూస్‌టుడే: పింఛన్ డబ్బుల కోసం వచ్చేవారందరూ నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, బీడీ కార్మికులు. ప్రతి నెలా ప్రభుత్వం అందజేసే పింఛన్ వారికి ఆధారం. అలాంటి వారు డబ్బులు పొందేందుకు తపాలా కార్యాలయాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. ఎప్పుడు డబ్బులు వస్తాయా, ఎప్పుడు పంపిణీ చేస్తారా అన్ని అక్కడే నిరీక్షిస్తున్నారు. వారం రోజుల నుంచి తపాలా కార్యాలయంలో డబ్బులు లేక పింఛన్‌దారులు ఆందోళన చెందారు. రెండు రోజుల క్రితం డబ్బులు రావటంతో అధికారులు పంపిణీ చేస్తున్నారు. పింఛన్‌దారులు డబ్బులు తమకు అందుతాయో లేదో అన్న సందేహంతో ముథోల్, చుట్టుపక్కల గ్రామాల నుంచి కోడి కూయకముందే చలిలో కార్యాలయానికి వరుసలో నిలబడుతున్నారు. అధికారులు ఉదయం పది గంటల వరకు రాకపోవటంతో వృద్ధులు వరుసలో నిల్చోలేక బండరాళ్లు పెట్టి అధికారుల కోసం వేచిచూస్తున్నారు. ముథోల్‌లో ఉదయం తపాలా కార్యాలయం ముందు పింఛన్‌కోసం బండరాళ్లు పెట్టి అధికారుల కోసం వృద్ధులు వేచిచూస్తున్న చిత్రం న్యూస్‌టుడేకు చిక్కింది. అధికారులు స్పందించి పింఛన్‌దారులకు ఇబ్బందులు కాకుండా పింఛన్ అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బండరాళ్లు వరుసలో పెట్టి నిల్చున్న వృద్ధులు



తపాలా కార్యాలయం భవనం నిడలో కుర్చున్న మహిళలు, వృద్ధులు



JUNIOR INTER
Chemistry

One can expect 3 to 5 VSAQs from these 4 lessons in inter exams and 5 questions in competitive exams. Inorder to cover all the basics, one must go through all Chapter and VSAQs along with solved problems. List out all important formulas at one place and be perfect with logarithams & square root based calculations for excellent score.

ప్రతిభ

What is critical temperature?

States of Matter, Stoichiometry, Thermodynamics, Chemical Equilibrium and Acids - Bases

2 Marks Questions

Q: Calculate Kinetic energy (in SI units) of 4 g of methane at –73°C.

A: $K.E = \frac{3}{2} nTR$

$= \frac{3}{2} \times \frac{4}{16} \times (-73 + 273) \times 8.314$

$= 1.5 \times 0.25 \times 200 \times 8.314$

= 623.6 J

Q: Calculate Kinetic energy of 5 moles of N_2 at 27°C.

A: $K.E. = \frac{3}{2} nTR = \frac{3}{2} \times 5 \times (27 + 273) \times 8.314$

$= 1.5 \times 5 \times 300 \times 8.314 = 18706.5$ J

Q: Which of the gases diffuses faster among N_2, O_2 and CH_4? Why?

A: At constant P & T, the rate of diffusion of a gas is inversely proportional to its molecular mass. CH_4 diffuses faster as it has least molecular mass (16 g/ mole).

Q: Calculate RMS speed, most probable speed of CO_2 gas at 27°C.

A: $U_{rms} = \sqrt{\frac{3RT}{M}}$

$= \sqrt{\frac{3 \times 8.314 \times (27 + 273)}{\frac{44}{1000}}}$

$= 4.42 \times 10^2$ m/sec

$U_{mp} = 0.8166 \times U_{rms} = 0.8166 \times 4.42 \times 10^2$

$= 3.36 \times 10^2$ m/sec

Q: State Dalton's law of partial pressures.

A: At constant temperature and volume, the total Pressure exerted by the mixture of non reactive gases is equal to sum of partial pressures of component gases (P_1, P_2)

$P_{total} = P_1 + P_2$

Q: What are standard ambient temperature and pressure (S.A.T.P) conditions?

A: 298.15 K temperature & 1 bar Pressure.

Q: Give the ratio of most probable (M.P), Average (AV) and R.M.S speeds of gas molecules.

A: $U_{M.P} : U_{AV} : U_{R.M.S}$

$= \sqrt{\frac{2RT}{M}} : \sqrt{\frac{8RT}{M}} : \sqrt{\frac{3RT}{M}}$

= 1.000 : 1.128 : 1.224

Q: What is critical temperature? Give its value for CO_2.

A: The temperature above which any gas can not be liquified by applying any pressure.

T_C of CO_2 = 30.98°C

Q: What is Surface tension? Give its units in SI System.

A: The downward force acting per unit length perpendicular to the line drawn on the surface of liquid. Units : Nm^{-1}

Q: What is coefficient of viscosity? Give its units in SI system.

A: The Force, when velocity gradient $\left(\frac{du}{dz}\right)$ is unity and the area of contact is unit area (A). Units: NS m^{-2}

$F = n.A. \frac{du}{dz}$

Q: What is "Compressibility factor"?

A: The ratio of actual molar volume of gas to molar volume of an ideal gas. For ideal gas

Z = 1. $Z = \frac{PV}{nTR}$

Q: What is "Boyle's temperature"?

A: The temperature at which a real gas obeys ideal gas equation over appreciable range of pressure.

Q: Give Vander Waals equation of state.

A: $\left(P + a\frac{n^2}{v^2}\right)(V - nb) = nTR$

a, b = Vander Waals constants

n = no. of moles, P = pressure, V = Volume,

T = absolute temp., R = Universal gas constant

Q: What is "disproportionation reaction"? Give 1 example.

A: The redox reaction in which an element undergoes oxidation as well as reduction.

$2 H_2O_2 \rightarrow 2 H_2O + O_2$

Q: State the "Law of multiple proportions".

A: When 2 elements combine to form 2 or more compounds, then the mass of one element that combines with a fixed mass of other element in the ratio of whole number.

eg. CO & CO_2

Q: Give 2 redox reactions related to environment.

A: ★ Use of liquid H_2 as fuel

★ Development of OZONE hole by CFCs.

Q: What do you mean by "Significant figures"?

A: Meaningful digits which are known with certainity. Eg: 4.007 has 4 significant figures.

Q: Calculate the no. of moles present in

a) 540 g. of glucose b) 200 g. of $CaCO_3$

A: (a) $n_{glucose} = \frac{mass}{g.m.mass} = \frac{540}{180} = 3$ moles

(b) $n_{CaCO_3} = \frac{mass}{g.m.mass} = \frac{200}{100} = 2$ moles

Q: The empirical formula (E.F.) of a compound is CH_2O. Its molecular weight is 90. Calculate the molecular formula of the compound.

A: E.F. = CH_2O

E.F.Wt. = 12 + 2(1) + 16 = 30

$n = \frac{M.F.Wt.}{E.F.Wt.} = \frac{90}{30} = 3$

M.F. = $(E.F.)_n = (CH_2O)_3 = C_3H_6O_3$

Q: Assign oxidation number of underlined elements

a) $\underline{Cr}_2O_7^{-2}$ b) $Ca\underline{O_2}$ C) $\underline{O}F_2$ d) $K_2\underline{Mn}O_4$

A: a) $\underline{Cr}_2O_7^{-2}$

$2x + 7(-2) = -2$

$\therefore x = 6$

b) $Ca\underline{O_2}$

$+2 + 2x = 0$

$\therefore x = -1$

(c) $\underline{O}F_2$

$x + 2(-1) = 0$

$x = +2$

d) $K_2\underline{Mn}O_4$

$2(+1) + x + 4(-2) = 0$

$\therefore x = +6$

Q: Calculate normality of H_2SO_4 solution if 50 ml of it completely neutralises 250 ml of 0.1 N $Ba(OH)_2$ solutions.

A: $V_1N_1 = V_2 N_2$

$N_1 = \frac{V_2 N_2}{V_1} = \frac{250 \times 0.1}{50}$

= 0.5 N



Q: Calculate the volume of 0.1 M $KMnO_4$ required to react with 100 ml of $H_2C_2O_4.2H_2O$ solution in presence of H_2SO_4?

A: 2 Moles of $KMnO_4$

= 5 Moles of $H_2C_2O_4.2H_2O$

$\frac{V_1M_1}{n_1} = \frac{V_2M_2}{n_2}$

$V_1 = \frac{V_2M_2n_1}{n_2M_1} = \frac{100 \times 0.1 \times 2}{5 \times 0.1} = 40$ ml

Q: What is the sign conversion of a) work done on the system and b) work done by the system?

A: a) work done on the system = +Ve

b) work done by the system = –Ve

Q: What are "intensive" and "extensive" properties?

A: **Intensive property:** The property of a system which depends upon the total amount of the material. eg: Mass, Volume

Extensive property: The property of a system which doesn't depend upon the total amount of material. eg: Density, Viscosity

Q: The equilibrium constant for a reaction is 10. (T = 300 K). What will be the value of Δ G°?

A: $\Delta G° = -2.303\ RTlog\ K_c$

$= -2.303 \times 8.314 \times 300 \times \log 10$

$= -2.303 \times 8.314 \times 300 \times 1 = -5.744$ K.J

Q: State 3rd law of thermodynamics.

A: The entropy of a pure and perfect crystal is zero at absolute zero temperature.

$\lim_{T \to 0} S = 0$

Q: Define "Enthalpy".

A: The total heat content of a system at constant pressure & temperature.

Q: Define "Entropy", "Standard molar entropy".

A: **Entropy:** The degree of disorderness of molecules of the system.

Standard molar entropy: The entropy of 1 mole of a substance at 1 atom pressure & 25°C.

Q: What is "Gibbs energy"?

A: The amount of energy available from a system which can be converted to useful work at constant Pressure & Temperature.

Q: Enthalpies of formation of CO, CO_2, N_2O and N_2O_4 are –110, –393, 81 and 9.7 K.J mol^{-1} respectively. Find the value of Δ_rH for the reaction $N_2O_4 + 3CO \rightarrow N_2O + 3\ CO_2$.

A: $\Delta_rH = H_{products} - H_{reactants}$

$= [3\ H_{CO_2} + H_{N_2O}] - [H_{N_2O_4} + 3H_{CO}]$

$= [3 \times (-393) + 81] - [9.7 + 3(-110)]$

= –778 K.J

Q: What is "homogeneous equilibrium"?

A: The equilibrium in which all the reactants and the products are present in same phase

$N_2(g) + 3\ H_2(g) \rightleftharpoons 2\ NH_3(g)$



Writer:

ANS Sankara Rao

Subject Expert

Q: What is "heterogeneous equilibrium"?

A: The equilibrium in which reactants & products are present in different phase.

$CaCO_3(s) \rightleftharpoons CaO(s) + CO_2(g)$

Q: What is meant by "dynamic equilibrium"?

A: The reversible reaction in which the rate of forward reaction is equal to the rate of backward reaction and both are taking place even at equilibrium state.

Q: Calculate pH of 0.1825% HC*l* aqueous solution.

A: $[H^+] = N = \frac{0.1825}{37.5} \times \frac{1000}{100} = 5 \times 10^{-2}$

pH = –log [H+]

$pH = -\log [5 \times 10^{-2}] = -[\log 5 + \log 10^{-2}]$

$= -[0.6990 - 2] = 1.3010$

Q: Calculate pH of 10^{-8} M NaOH.

A: $[OH^-] = [OH^-]_{NaOH} + [OH^-]_{H_2O}$

$= 10^{-8} + 10^{-7} = 10^{-7}(10^{-1} + 1)$

$= 1.1 \times 10^{-7}$

$pOH = -\log[OH^-] = -\log[1.1 \times 10^{-7}] = 6.96$

$\therefore$ pH = 14 – pOH= 14 – 6.96 = 7.04

Q: Calculate pH of 0.05 M $Ba(OH)_2$ solution.

A: $[OH^-] = N = 2 \times 0.05 = 0.1 = 10^{-1}$

$pOH = -\log[OH^-] = -\log[10^{-1}] = -(-1) = 1$

pH = 14 – pOH = 14 – 1 = 13

Q: Define pH.

A: Negative logarithm of H^+ ion concentration pH = –log [H+]

Q: What is "Solubility Product"?

A: The product of concentration of Cations & Anions present in saturated salt solution.

Units: $(moles/lit)^n$

Q: 50 ml of NH_4OH & 25 ml of 2M NH_4Cl were mixed to make a buffer. What is its pH if its Pk_b is 4.8

A: $pOH = pk_b + \log \frac{M_sV_s}{M_bV_b}$

$= 4.8 + \log \frac{2 \times 25}{0.1 \times 50} = 4.8 + 1 = 5.8$

$\therefore$ pH = 14 – pOH

= 14 – 5.8 = 8.2

Q: All the bronsted bases are Lewis bases. Explain.

A: Bronsted base is proton acceptor.

$NH_3 + H^+ \rightarrow NH_4^+$. Lewis base is electron pair donor. Where NH_3 can accept a proton (H^+) and donates lone pair of electrons to H^+ ion. So NH_3 is Bronsted base as well as Lewis base.

Q: Classify the following solutions of salts into acidic and basic $AlCl_3$, Na_2CO_3, $CuSO_4$, CH_3COONa.

A: **Acidic:** $CuSO_4$ & $AlCl_3$

Basic: CH_3COONa & Na_2CO_3

Q: What are 'London Forces'?

A: Forces of attraction between 2 temporary dipoles. Eg: n-pentane.

Send your feedback to...

pratibhadesk@eenadu.net



ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.

ప్రతిభ

ఆహారానికి ఏదీ భద్రత...?

జనరల్ స్టడీస్

డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

✦ భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.

✦ 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.

✦ సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

✦ సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.

✦ డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.

✦ నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

> *అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.*

✦ సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.

✦ 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

✦ అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.

✦ ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.

✦ వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.

✦ ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్ లాపిన్ అభిప్రాయపడ్డారు.

> *ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.*

✦ డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

✦ 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయీ సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయీ సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.

✦ మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

హాయ్! బుజ్జీ!!



రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

పేపర్ వెయిట్.. తయార్!

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?

తయారీ ఎలా?



◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజిన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.


పుట్టింది ఎప్పుడంట?

- 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
- జస్టిన్ స్కూబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
- ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

లోపల పువ్వులెలా?

- ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.





ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్‌పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు


- మదర్ థెరిసా

నేర్చుకుందాం!


ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Thumb - థమ్
Subtle - సటల్

కవలలేవి? ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



దారి కనుక్కోండి!



సబ్జెక్ట్ ల్యాబ్ సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We [ ] with our (ముక్కు)
2. We [ ] with our (కళ్లు)
3. We [ ] with our (చెవి)
4. We [ ] with our (నాలుక)
5. We [ ] with our (చేతులు)

జవాబులు: స్కూల్ సవాల్: 1.1857 2.పోర్చుగల్ 3.నయా రాయ్‌పూర్ కవలలేవి: 2,4 సబ్జెక్ట్‌ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See 3.Listen 4.Taste 5.Touch



దేగామలో ముంపు బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న పాలనాధికారి దివ్యదేవరాజన్

త్వరలోనే బాధితులకు న్యాయం

బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే : బజార్‌హత్నూర్ జలశయం నిర్మాణంలో నివాసాలను కోల్పోయి గత కొన్నేళ్లుగా ఆశ్రయం లేక అవస్థలు పడుతున్న ముంపు బాధితులకు త్వరలోనే న్యాయం చేస్తామని పాలనాధికారి దివ్యదేవరాజన్ హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని దేగామ గ్రామాన్ని సందర్శించిన పాలనాధికారి ముంపు బాధితులతో మాట్లాడారు. ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీపీ రాంరెడ్డి, తహసీల్దార్ రాజేందర్‌సింగ్, ఎంపీడీఓ శంకర్, ఏపీఓ శివాజీ, సర్పంచి దుర్వ లక్ష్మణ్, ఎంఈఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ఐటీడీఏలో అవినీతిని అరికట్టాలి'

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: ఐటీడీఏలో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికంతోపాటు పూర్తిస్థాయి పీఓను నియమించాలని హీరా సుక్క ఆదివాసీ పర్ధాన్ జాగృతి సమితి నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు బుధవారం ఆదిలాబాద్‌లో జిల్లా పాలనాధికారిని కలిసి తమ డిమాండ్లు వినిపించారు. సంఘం తరపున జ్ఞాపికను అందించారు. పాలనాధికారిని కలిసిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్, ఉపాధ్యక్షుడు మెస్రం క్రిష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శులు గేడం మాధవ్, కొచాడే నారాయణ్ తదిరుతులున్నారు.



పాలనాధికారికి జ్ఞాపికను అందజేస్తున్న పర్ధాన్ సంఘం నాయకులు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్-2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ - సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం
11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం
12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 డీజే రిపీట్
01:15 స్టే..పూలిష్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 నా షో నా ఇష్టం రిపీట్
సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 టాప్స్
10:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ. 6:00, రా. 11:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా. 6:00, రా. 10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 6:30, రా. 10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 1:00, రా. 8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ. 1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ. 9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ. 2:00, రా. 7:00)
- ★ సుఖజీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ. 10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ. 3:00, రా. 9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ. 11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ. 11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ. 3:30, రా. 7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ. 3:45, రా. 7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడెవీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఝూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బరానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

SVBC — ఉదయం: 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

భక్తి TV — ఉదయం: 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారాస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు,7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

ZEE తెలుగు — ఉదయం: 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

maa — ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

GEMINI — ఉదయం: 06-00 టెలిషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

HBO — ఉదయం: 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, **మధ్యాహ్నం:** 12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, **సాయంత్రం:** 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ **రాత్రి:** 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు.

1. రబీ వరి పొలాల్లో ఎలుకల నిర్మూలన
2. వేరుశనగలో జిప్సం ఆవశ్యకత
3. పసుపు సాగులో ఇందూరు యువ రైతు ఆదర్శం

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.

రైతేరాజు

జైకిసాన్‌లో... ఈటీవీ తెలంగాణ — నేటి సాయంత్రం 6.30 గంటలకు.

1. గుర్రపుడెక్కతో సేంద్రియ ఎరువు ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఐఐసిటి
2. అటోమేటిక్ స్టాటర్ల స్థానంలో 'కిసాన్‌రాజా' కొత్త పరికరం పనితీరుపై రైతుల హర్షం

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

ఆరుతడి పైర్లలో సూక్ష్మనీటి పద్ధతులు

ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. రబీ పంటల్లో నీటి యాజమాన్యం- పంటల పెరుగుదల, దిగుబడి, నాణ్యతలపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారి రవీందర్ తెలిపారు.

వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం తక్కువగా ఉంది. వినియోగించే నీటిలో దాదాపు 60-70 శాతం వృథా అవుతోంది. దీని వల్ల సాగునీటి వృథా, భూసారం క్షీణించడం వంటి సమస్యలు వస్తున్నాయి. అధునాతన నీటి పారుదల విధానాలైన బిందు, తుంపర్ల సేద్య పద్ధతుల వల్ల దిగుబడి పెరగడమే గాకుండా, నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.



నీరు ఎక్కువగా లభ్యమయ్యే చోట ఆ నీటిని విచ్చలవిడిగా వాడటం వల్ల సారవంతమైన భూములెన్నో చౌడు భూములుగా మారి పంటల దిగుబడి క్రమేణా తగ్గుతున్నాయి. నేలలు కోతకు గురవుతున్నాయి. ఆశించిన దిగుబడులు సాధించాలంటే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. నీటిని పెట్టిన మొదటి మూడు రోజులలో నేల లోపలి పొరలు నీటితో నిండిపోయి పొరలలో ఉన్న గాలి బయటికి వెళ్ళిపోతుంది. దీనివల్ల నేలలో సామర్థ్యం కంటే ఎక్కువ నీరు నిల్వ ఉంటుంది. మొక్కలకు కావల్సిన పోషకాలు భూమిలో ఉన్నా మొక్కలకు లభ్యం కావు. దీని వల్ల మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. కానీ బిందు సేద్య పద్ధతిలో నీటిని ప్లాస్టిక్ గొట్టాలు, ఇతర పరికరాలతో బిందువుల రూపంలో అన్ని మొక్కలకు సమానంగా మొక్క వేరు భాగానికి కావల్సినంత అందించవచ్చు. ఈ విధానం ద్వారా భూమిలో ఎప్పుడు తేమ మాత్రమే ఉండేలా చేయవచ్చు.

★ మొక్కజొన్న జళ్ళు వేసేటప్పుడు, పాలు పోసుకునేటప్పుడు, గింజ గట్టిపడే సమయంలో నీరు చాలా అవసరం. వేసవిలో 7-10 రోజులకొకసారి నీటితడి ఇవ్వాలి.

★ వేరుశనగలో విత్తిన వెంటనే ఒకతడి, తరువాత 20-25 రోజులకు, ఆ తరువాత పూత, కాత దశలో ప్రతి 10-15 రోజులకు ఒక తడి ఇవ్వాలి.

★ పొద్దుతిరుగుడు పువ్వులో ఆశించిన దిగుబడులు సాధించాలంటే మొగ్గతొడిగే దశ, పువ్వు వికసించే దశ, గింజ కట్టే దశలలో నీటితడి అవసరం.

★ నువ్వు పంటకు పూత, కాయ పెరుగుదల, గింజకట్టు దశల్లో తడులు తప్పక ఇవ్వాలి.

★ శనగ పంటలో విత్తిన 20-25 రోజులలో తడి ఇవ్వాలి. శనగ పంట ఎక్కువ నీటిని తట్టుకోదు. అవసరాన్ని బట్టి నీటి తడులు అందించాలి.

★ కుసుమ పంటకు తేమ ఉన్న బలమైన నేలల్లో సకాలంలో వేసిన పంటకు నీరు ఇవ్వాల్సిన అవసరం లేదు. తేలిక నేలలకు, ఆలస్యంగా విత్తిన పంటకు ఒకటి, రెండుసార్లు తడులు ఇవ్వాలి. పూత మొదలైన తరువాత నీరు పెట్టవద్దు.

– న్యూస్‌టుడే, జైనథ్
(ఆదిలాబాద్ వ్యవసాయం)

పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం

పాడి పశువులను విధిగా పాకల్లో ఉంచి పోషించడాన్ని ప్రతి రైతు కర్తవ్యంగా భావించాలి. వాతావరణ ప్రభావాల నుండి పశువులను కాపాడే పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షెడ్ రేకులతో గానీ కప్పి నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్', పశువుల నుండి వెలువడే మూత్రం, పేడ వెళ్లడానికి కాలువలు నిర్మించాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి ప్రస్తుతం మార్కెట్లో లభించే రబ్బర్ మ్యాట్లను పరచడం మంచిది.

తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. నిర్ణీత కాల వ్యవధిలో సున్నం వేయించాలి. పశువుల మల మూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. ఒకే వరుస కానీ, రెండు వరుసలు కానీ పశువులను కట్టి మేపడం, పాలు పిండటం వల్ల పశువులు వాతావరణ తీవ్రతకు గురికావు. వ్యాధుల నివారణ కూడా సులభం అవుతుంది.

షెడ్లు కట్టే రైతులను ప్రోత్సహించేలా షెడ్‌లకు బీమా సౌకర్యం కల్పించేందుకు రైతులను ప్రోత్సహించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. దీనిద్వారా పశుగ్రాసాలకు సహజంగా ఎరువు లభిస్తుంది. ఒకటి, రెండు పశువులున్నా పాక నిర్మాణం చేపట్టాలి. అగ్ని ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు కల్పించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

– మధుసూదనరావు,
విజయ డెయిరీ, ఆదిలాబాద్



హస్తాలే.. నేస్తాలు!

చేతులతో తడిమి.. మనసుతో చూసి ✤ ఆదర్శం ఈ చిన్నారుల ఆత్మవిశ్వాసం
✤ నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి


యోగాసనాలు చేస్తున్న సాయి అంధుల పాఠశాల విద్యార్థులు

ఏసీసీ(మంచిర్యాల), మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే

నవరసాలే సప్తవర్ణాలుగా, శబ్దతరంగాలే జీవజాతులుగా, వినికిడి, స్పర్శచర్యలనే అనుభవాలుగా మార్చి మనస్సులనే చూపులుగా మార్చుకుని చీకటి జీవితాలనుంచి వెలుతురు దిశగా దూసుకుపోతున్నారు వీరు. అందరూ కళ్లతో చూస్తే వీరు మనస్సుతో చూస్తారు. బాహ్యనేత్రాలు లేకున్నా భావనేత్రాలతో లోకాన్ని చూస్తూ బ్రెయిలీ లిపి ద్వారా చదువుతూ.. స్పర్శే శ్వాసగా భావిస్తూ అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సాయి అంధుల పాఠశాల విద్యార్థులు. ఓవైపు చదువులో రాణిస్తూనే శాస్త్రీయ, భక్తి, జానపదం, ఏ పాట అయినా అవలీలగా పాడేస్తూ తమ గాన మాధుర్యంతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. ధ్వని అనుకరణ, యోగాసనాలు, సాంకేతిక రంగాల్లో ప్రతిభచాటుతూ అబ్బుర పరుస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రతిభా పాటవాలతో ఎందరికో స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నారు. గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఈ అంధుల పాఠశాల గురించి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

ఉమ్మడి జిల్లాలో సుమారు 1000 వరకు అంధులు ఉన్నారు. ప్రభుత్వ పరంగా ఉమ్మడిజిల్లాలో ఒక్క అంధ పాఠశాల సైతం లేదు. దీంతో వీరంతా చదువుకు దూరమవుతున్నారు. చదువుకోవాలని ఆసక్తి ఉండి ప్రతిభ ఉన్నా అవకాశం లేక వారి ప్రతిభ మరుగునపడుతోంది. అంధ చిన్నారుల కోసం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


బ్రెయిలీ లిపిలో పురాణ గ్రంథాలు


బ్రెయిలీ లిపితో పరీక్ష రాస్తున్న బాలికలు

ఉమ్మడి జిల్లాలో ఏకైక అంధుల పాఠశాల


అంధులను ఆదుకోవాలనే సంకల్పంతో మంచిర్యాల జిల్లాకు చెందిన అశోక్‌రావు, పద్మ, సంపత్‌వ్యాస్, దుర్గావ్యాస్‌లు ముందుకువచ్చారు. 2010లో శ్రీసాయి అంధుల పాఠశాలను స్థాపించి అంధులకు ఉచిత విద్య, భోజనం, వసతి, అన్ని కల్పిస్తూ విభిన్నప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. గత 8సంవత్సరాలుగా తమస్థాయి మేరకు వారికి ప్రత్యేక పద్ధతిలో చదువును అందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయసహకారాలు లేకపోయిన కేవలం దాతల సహాయంతో ఈ పాఠశాలను నడిపిస్తున్నారు.

సోనమ్మ గానం చేస్తే మైమరిచిపోవాల్సిందే



ఆదిలాబాద్‌జిల్లా తురుకచాందకు చెందిన సోనమ్మ పాఠశాల ప్రారంభం నుంచి ఇక్కడ చదువుతోంది. సంగీతం నేర్చుకొంటుంది. కష్టతరమైన యోగాసనాలు అవలీలగా వేస్తుంది. పాటలు పాడుతూ ఆకట్టుకుంటుంది. పలు వేదికల్లో పాల్గొని తన ప్రదర్శనతో ఆహుతులను అలరిస్తుంది. భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులు చదివి తనలాంటి వారికి చేయూతనివ్వాలని కోరుతోంది.

ఏదైనా అవలీలగా..



ఈ బాలుడి పేరు రాజేందర్. స్వగ్రామం బుట్టాపూర్. ఏడో తరగతి చదువుతున్నాడు. చదువుతో పాటు కంప్యూటర్‌లో దిట్ట. గణితంలో 150 స్క్వేర్ ఎక్కాలు, క్యూబ్‌లు అవలీలగా చెప్పగలడు. పాటలు పాడతాడు. తల్లిదండ్రులు లేకపోయినా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తున్నాడు.

బాలరత్న ఆదిత్య



నిర్మల్ జిల్లా పెంబి గ్రామానికి చెందిన ఆదిత్య ఏడో తరగతి చదువుతున్నాడు. చదువులో చురుగ్గా ఉండటంతో పాటు తనకిష్టమైన మిమిక్రీలో ప్రతిభ చాటుతున్నాడు. రాజకీయనాయకులు, సినీరంగ కళాకారుల గొంతును అనుసరిస్తూ ఆకట్టుకుంటున్నాడు. వేదికపై ఆదిత్య ప్రదర్శన ఇస్తే చాలు నవ్వుల్లో ముంచెత్తుతాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తన మిమిక్రీతో అబ్బురపరిచి బాలరత్న బిరుదు పొందాడు.

అలవోకగా లయబద్ధంగా



ఈ బాలుడు హాజీపూర్ మండలం దొనబండకు చెందిన గణేష్- మల్లీశ్వరి దంపతుల కుమారుడు మహేష్. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చూపులేకపోయినా ఎంతో ధైర్యం ప్రదర్శిస్తాడు. చదువుతో పాటు వాయిద్యంలో పరిణతి చూపుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఎవరూ పాట పాడినా దానికి అనుగుణంగా వాయిద్యాన్ని వాయిస్తాడు. లయబద్ధంగా తాళం వేయడంతో పాటు తబలా, డోలక్, డప్పు వాయిద్యాలను అలవోకగా వాయించి అబ్బురపరుస్తాడు. "అందమైన సృష్టిని చూడకున్నా, సమాజం మమ్మల్ని పట్టించుకోకున్నా మేము అంధత్వాన్ని జయించేందుకు చదువుకునేలా లిపిని రచించిన లూయిబ్రెయిలీనే మాకు దేవుడు" అని ఈ బాలుడు చెబుతున్నాడు.

అంజలి ఆత్మవిశ్వాసం ఆదర్శం



ఈ చిన్నారి పేరు అంజలి. నర్సక్కపేటకు చెందిన మధునయ్య - రాజక్క దంపతుల కుమార్తె. తొమ్మిదో తరగతి చదువుతోంది. చిన్న వయస్సులోనే దేశంలోని రాష్ట్రాలు, రాజధానులు, భాషలు, ఎక్కాలు చకచకా చదివేస్తుంది. అడిగిన ప్రతి ప్రశ్నకు ఒక్కని మిషంలోనే సమాధానం చెబుతోంది. వైకల్యం పక్కన పెట్టి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. శాస్త్రీయనృత్యం నేర్చుకుంది. మనసుతో చూస్తూ అభినయించడం పాటకు అనుగుణంగా నటించడం ఆమె ప్రత్యేకత.

భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలి



అశోక్‌రావు, అంధుల పాఠశాల నిర్వాహకుడు, మంచిర్యాల

ఎనిమిదేళ్ల నుంచి పాఠశాలను అద్దె భవనంలోనే నడిపిస్తున్నాం. ఖర్చు ఎక్కువగా కావడంతో పరిమితంగా విద్యార్థులను తీసుకోవాల్సి వస్తోంది. జిల్లా పాలనాధికారిని కోరగా గతేడాది ఐఆర్‌పీ(భవిత కేంద్రం)ని కేటాయించారు. సొంత భవనం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ సంబంధిత అధికారులు ఇప్పటి వరకు స్థలం కేటాయించలేదు. అధికారులు స్థలం కేటాయిస్తే మరింత మందికి విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఈనాడు-ఈటీవీ తెలంగాణ నిర్వహిస్తున్న

ముత్యాల ముగ్గుల పోటీ

జనవరి, 2, 2018 విజేతలు

1. డి. అనిత, హైదరాబాద్; 2. జ్యోతి, ఖమ్మం; 3. కె. మాధవీలత, హన్మకొండ; 4. వి.విజయలక్ష్మి, హైదరాబాద్; 5. వి.ఉష, చెన్నై; 6. టి. సరళ, మంచిర్యాల్; 7. ఏ. రాధిక, గోదావరిఖని; 8. జె. నవ్యశ్రీ, ఖమ్మం; 9. ఏ. శ్రీలక్ష్మి, అడశర్లపాడు, ఖమ్మం; 10. వై. జయ, బెల్లంపల్లి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

నిజాయితీ చాటుకున్న రైతు

నర్సింగాపూర్ (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన నల్ల రాజయ్య అనే రైతు తాను పండించిన వరి ధాన్యం గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. ఈ ధాన్యానికి సంబంధించిన డబ్బులు రూ.24,779 నగదును ఐకేపీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రెండుసార్లు రాజయ్య బ్యాంకు ఖాతాలో జమైంది. ఇది గ్రహించిన ఆ రైతు వెంటనే ఐకేపీ అధికారులను కలిశారు. వారి సూచన మేరకు ఆ డబ్బులను డీడీ రూపంలో తీసి తన మిత్రుడు మమత సూపర్‌బజార్ డైరెక్టర్ నల్ల రవితో కలిసి వెళ్లి మండలసమాఖ్య అధికారులకు అందజేశారు. తన నిజాయితీతో ఆదర్శంగా నిలిచిన రైతును తోటి రైతులు, మండలసమాఖ్య అధికారులు అభినందించారు.


తనవి కాని డబ్బుల డీడీని మంచిర్యాల మండలసమాఖ్య అధికారికి అందజేస్తున్న రైతు రాజయ్య

స్వామి వారి ప్రసాదాలు నాణ్యంగా ఉండాలి

గూడెం(దండేపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి వారి ప్రసాదాలు నాణ్యతగా ఉండాలని ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అధికారులకు సూచించారు. ఆలయంలో బుధవారం ఆలయ అధ్యక్షుడు వెంకటస్వామి అధ్యక్షతన సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు తీర్మానాలు చేశారు. దేవస్థానానికి సీజీఎఫ్ నిధుల నుంచి రూ.38 లక్షలు మంజూరయ్యాయని, వాటితో ఆలయంపైన రూ.25 లక్షలతో వ్రత మండపము, విశ్రాంతి గది, పౌర్ణమి రోజున నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని తీర్మానించారు. భక్తుల రద్దీ సమయాల్లో వారు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నారాయణ, సభ్యులు కొండు సత్తయ్య, మేడి నారాయణ, కొండా చంద్రశేఖర్, జాడి రమేశ్, సత్తవ్వ, గట్టు మురళీధర్‌రావు, ఆలయ పర్యవేక్షకులు రమణారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.


గూడెం సత్యదేవుని ఆలయంలో ధర్మకర్తల సమావేశం నిర్వహిస్తున్న సభ్యులు

గూడెం హుండీ ఆదాయం లెక్కింపు

గూడెం(దండేపల్లి గ్రామీణం): పుష్య పౌర్ణమి సందర్భంగా దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం దేవాదాయ ధర్మదాయ శాఖ నిర్మల్ డివిజన్ పర్యవేక్షకుడు రంగు రవికిషన్ ఆధ్వర్యంలో లెక్కించినట్లు ఆలయ ఈఓ తోడేటి నారాయణ తెలిపారు. హుండీ ద్వారా రూ.1,32,016, రసీదులు, ఇతరముల ద్వారా రూ.1,13,589 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.2,45,605 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వెంకటస్వామి, ధర్మకర్తల మండలి సభ్యులు కొండు సత్తయ్య, కానుగంటి తిరుపతి, సాయిని సుధాకర్, ఆకుల తిరుపతి, మారిశెట్టి సత్తవ్వ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


గూడెంలో సత్యనారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

నేడు దస్తురాబాద్‌లో 4కె రన్
నూతన గ్రంథాలయ ప్రారంభోత్సవం

కడెం, న్యూస్‌టుడే: దస్తురాబాద్‌లో గురువారం ఉదయం నిర్వహిస్తున్న 4కె రన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామీణ్ సపోర్ట్ ఫౌండేషన్ కన్వీనర్ కడారి నరేష్ కోరారు. దస్తురాబాద్ పోలీసుల సహకారంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. దస్తురాబాద్‌నుంచి గోండుగూడెం వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో సినీ హీరో ప్రిన్స్, ఎవరెస్టును అధిరోహించిన మలావత్ పూర్ణ, నిర్మల్ జిల్లా అధికారులు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, స్థానికులు పాల్గొంటున్న కార్యక్రమాన్ని మండల వాసులు జయప్రదం చేయాలని కోరారు. నూతనంగా ఏర్పాటుచేసిన గ్రంథాలయ ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు.

సమావేశమైన ఆలయ పాలకమండలి సభ్యులు

బాసర, న్యూస్‌టుడే: బాసర సరస్వతీ ఆలయ పాలకమండలి సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులు తొలిసారిగా ఆలయం వద్ద సమావేశమై ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వచ్చే వసంతపంచమి ఉత్సవానికి భక్తుల సౌకర్యార్థం, ఉత్సవ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి ఆలయ అధికారులకు పలు సూచనలందించారు. సమావేశంలో వంశపారంపర్య ధర్మకర్త శరత్‌పాఠక్, ఆలయ ఈవో సోమయ్య, 14 మంది పాలకమండలి పాల్గొన్నారు.

బోథ్

మహిళ సంఘాలకు వంటనూనె పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడలో స్టార్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో సంఘాల సభ్యులకు సంక్రాంతి పండగ కోసం వంటనూనె డబ్బాలు పంపిణీ చేశారు. బుధవారం ఆ సమాఖ్య పరిధిలోని 30 సంఘాల సభ్యులకు వీటిని అందజేశారు. పొదుపు నిధుల నుంచి కొనుగోలు చేసి అందజేయగా మూడు నెలల వరకు ఈ డబ్బులు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఓ పండరి, ఆర్‌పీ రూప, స్టార్ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు బేబిమణి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధ్యాన మందిర వార్షికోత్సవాలు

బోథ్, న్యూస్‌టుడే: బోథ్ మండల పరిధిలోని పట్నాపూర్ పంచాయతీ ఇన్కర్‌పల్లెలో గల పూలాజీ బాబా ధ్యాన మందిర 10వ వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి శ్రీ సంత్‌పూలాజీ బాబా హాజరు కానున్నటు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

దుమ్ము రేగుతోంది.. ప్రాణం తీస్తోంది!

అంతర్రాష్ట్ర రహదారిపై నరక ప్రాయంగా ప్రయాణం☆ ముందు జాగ్రత్తలు పాటించకుంటే వ్యాధులపాలు

తలమడుగు, న్యూస్‌టుడే:

ఆ అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణం అంటేనే ఒళ్లు గగ్గుర్పొడుస్తోంది. ఈ రహదారులన్నీ పూర్తిగా గుంతలు, దుమ్ము, ధూళితో నిండిపోయాయి. ముందు వెళ్లే వాహనం ద్వారా పైకిలేచే దుమ్మంతా శరీరంపై పడటంతో పాటు శ్వాస ద్వారా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి పలు శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. రహదారులపై దుమ్ము వెదజల్లకుండా ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తలమడుగు, తాంసి మండలాల పరిధిలో ఉన్న అంతర్రాష్ట్ర రహదారి ఇలా దుమ్ముమయంగా ఉండి ఎందరో ప్రయాణికులను ఆసుపత్రి పాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

తలమడుగు, తాంసి మండలాల పరిధిలో దాదాపు 30 కిలోమీటర్ల పొడవునా అంతర్రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వీటిపై ఒక్కసారి ద్విచక్రవాహనంపై ప్రయాణించి వస్తే చాలు శరీరంపై దుమ్ముతో కూడిన ఒక పొర ఏర్పడటం ఖాయం. ఇంతగా దుమ్ముమయంగా ఉండటంతో ప్రయాణికులకు శ్వాస ద్వారా ఏ మేర దుమ్ము ధూళి ఊపిరితిత్తుల్లోకి వెళ్తుందో ఊహించుకోవచ్చు. వందలాది మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. అంతర్రాష్ట్ర రహదారుల నిర్వహణ ఘోరంగా ఉంది. ఎందుకంటే ఇటీవల మంజూరైన నిధులతో గుత్తేదారులు నూతన రహదారుల నిర్మాణం చేపట్టారు. ఒక భాగం వైపు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో



దుమ్ములో వెళ్తున్న మహిళలు

మరోవైపు నీటి ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోయాల్సి ఉండగా గుత్తేదారులు అలా చేయడం లేదు. దీంతో రహదారుల గుండా ఉన్న దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదిలాబాద్ నుంచి తాంసి, తలమడుగు మండలాలకు సంబంధించి పొన్నారి, ఖోడద్, ఉండం, సుంకిడి, సాయిలింగి, లక్ష్మీపూర్ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి గుంతలమయం, దుమ్ముధూళితో నిండి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నారు. ఇటీవల రహదారుల వచ్చే దుమ్ముతో ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్న ఎవరూ పట్టించుకోలేదు.

దుమ్ముతో దమ్ము

తలమడుగు మండలంలోని సుంకిడి నుంచి లక్ష్మీపూర్ వరకు సీఆర్ఎఫ్ కింద మంజూరైన రూ14 కోట్లతో చేపట్టే అంతర్రాష్ట్ర పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. గతేడాది నిధులు మంజూరైనప్పటికి గుత్తేదారులు నిర్మాణాలు ప్రారంభించడంతో ప్రజలు రాకపోకల దృష్ట్యా తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంవత్సరాలుగా దుమ్ములోనే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. మహారాష్ట్ర నుంచి నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రహదారి దుమ్ముమయంగా మారుతోంది. భారీ వాహనం వెళ్తే కొద్దిసేపు ఆగాల్సిందే. దుమ్ము శరీరాన్ని కప్పేస్తోంది. నిత్యం వందలాది మంది దీనిపై ప్రయాణం చేస్తారు.

పత్తి దుబ్బమయం

అంతర్రాష్ట్ర రహదారికి అనుకొని ఉన్న సుంకిడి, సాయిలింగి, కుచులాపూర్, లచ్చంపూర్, ఉండం, ఖోడద్ గ్రామాల రైతులకు సంబంధించిన పత్తిపంటపై దుమ్ము చేరుతుండటంతో పత్తి ఏరలేని దుస్థితి నెలకొంది. తెల్లబంగారం మొత్తం దుమ్ముకమ్మేస్తుంది. ఇప్పటికే గులాబీ పురుగు, అధిక మొత్తంలో కురిసిన వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు గుత్తేదారుల నిర్లక్ష్యంతో చేతికందే పత్తిని కోల్పోయే పరిస్థితి నెలకొంది. తమ గోడును అధికారులకు, నేతలతో మొరపెట్టుకున్న పట్టించుకునే వారు కరవయ్యారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ

☛ దుమ్ము రహదారులపై ప్రయాణించే వారు ఆ సమయంలో తప్పనిసరిగా ముఖానికి మాస్కులు ధరించాలి.

☛ వీలైనంత వరకు ద్విచక్రవాహనాలపై ప్రయాణించకపోవడమే మేలు

☛ బస్సుల్లో ప్రయాణిస్తే కొంత వరకు ప్రయోజనం ఉంటుంది.

☛ భారీ వాహనాల వెనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణించొద్దు.

☛ దుమ్ము ధూళి ప్రభావానికి గురయ్యే వారు తరచూ బెల్లం, పల్లీపట్టీలు తింటే కొంత వరకు వ్యాధులు రాకుండా ఉంటాయి.

☛ ఇది తలమడుగు మండలంలోని సుంకిడి అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణ పనులు చేస్తున్న సందర్భంగా పక్కన ఉన్న మట్టి రహదారిపై నీటి తడులు వేయకపోవడంతో వాహనాల రాకపోకలతో ఇలా నిత్యం దుమ్ము లేస్తోంది. ప్రయాణికులు విధిలేక ఈ దుమ్ములోనే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. శ్వాసతో పాటు ఈ దుమ్ముధూళి ఊపిరితిత్తుల్లోకి వెళ్తోంది.



అప్రమత్తంగా ఉండాలి

-వైద్యాధికారి నీలోఫర్,తలమడుగు



దుమ్ము ధూళి కారణంగా పలు రకాల శ్వాసకోశ వ్యాధులు సోకుతాయి. సరైన సమయంలో చికిత్సలు తీసుకోకుంటే అవి క్షయ, ఊపిరితిత్తులు చెడిపోవడం, గొంతు నాళాలు చెడిపోవడం లాంటి దీర్ఘకాలిక వ్యాధులుగా మారే ప్రమాదం ఉంది. శ్వాసకోశ సంబంధ ఏ ఇబ్బంది ఏర్పడినా వీలైనంత త్వరగా వైద్య నిపుణులను సంప్రదించాలి.



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు ప్రవీన్

వైభవంగా అయ్యప్పకు అభిషేకం

తాంసి, న్యూస్‌టుడే : మండల కేంద్రం తాంసిలో బుధవారం జూకంటి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేదపండితులు ప్రవీన్, సాయికిరణ్, సతీష్ మంత్రోచ్చారణల మధ్య మణికంఠుడికి పంచామృతాలతో అభిషేకం చేశారు. శాస్త్రోక్తంగా పద్దెనిమిది మెట్లపైన పడిని వెలిగించారు. కప్పర్ల, తలమడుగు, తాంసి, సుంకిడి, నిపాని, వడ్డాడి స్వాములు పూజలో పాల్గొని, భక్తి పాటలు పాడుతూ భజనలు చేశారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఈజీఎస్ ఏపీఓ సంగీత

ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలి

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : ఏడాదిలో తప్పని సరిగా ప్రతి కుటుంబానికి వంద రోజుల పాటు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఈజీఎస్ ఏపీఓ సంగీత అన్నారు. బుధవారం గుడిహత్నూర్ మండంలోని కొల్హారి పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. జాబ్‌కార్డులు లేని కూలీలకు వారం రోజుల్లో జాబ్‌కార్డులు అందిస్తామన్నారు. గత రెండేళ్ల నుంచి తమ గ్రామంలో ఉపాధి పనులు లభించకపోవడంతో ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న క్షేత్ర సహాయకులు పనులు కల్పించడం లేదని ఫిర్యాదు చేశారు. సమావేశంలో కొల్హారి సర్పంచి బాలాజీ పటేల్, కార్యదర్శి బాలాజీ, కారోబారి మారుతిరావ్, తెరాస నాయకులు దిలీప్, చందాసింగ్, భీంరావ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు చీరలను, దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఒలివకొండ ప్రేయర్ టవర్ ఫౌండేషన్ సభ్యులు

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ

బోథ్, న్యూస్‌టుడే: బోథ్ మండల కేంద్రంలోని ఫ్రెండ్స్‌క్లబ్ ఆవరణలో బుధవారం ఒలివకొండ ప్రేయర్ టవర్ స్వచ్ఛంద సంస్థ, భీమ్‌సేనా ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను, చీరలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ పి.దినకరణ్ మాట్లాడుతూ..తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలె 187వ జయంతి వేడుకల సందర్భంగా పేదలకు దుప్పట్లను, చీరలను, పండ్లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చిన్నరాయుడు, డా.దశరథ్, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్‌గాంధీ కృషితోనే సాంకేతికాభివృద్ధి'

బోథ్, న్యూస్‌టుడే: దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందిందంటే అది మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చలవేనని కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు అనిల్ జాదవ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని లాల్‌పిచ్ మైదానంలో రాహుల్‌గాంధీ యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. యువత క్రీడా స్ఫూర్తితో పోటీల్లో రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.రాజు యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు సి.సదానందం, మాజీ మార్కెట్ ఛైర్మన్ ఎమ్.సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సంటెన్న, మన్నూర్ పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రావ్, నాయకులు జె.శ్రీధర్‌రెడ్డి, కె.భూమేష్, గంగాధర్, రాజశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, బుచ్చరెడ్డి, ముత్యాలు, రమణ, అలీమోద్దిన్, రహిమోద్దిన్, మహిముద్, గంగారాం, కిషన్, తదితరులు పాల్గొన్నారు.



బోథ్ లాల్‌పిచ్ మైదానంలో రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అనిల్‌జాదవ్



మాలసంక్షేమసంఘం కాలసూచీని ఆవిష్కరిస్తున్న నాయకులు

మాలసంక్షేమసంఘం కాలసూచీ ఆవిష్కరణ

నేరడిగొండ, న్యూస్‌టుడే : నేరడిగొండ మండల మాలసంక్షేమసంఘం రూపొందించిన కాలసూచీ(2018)ని ఆసంఘం నాయకులు బుధవారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు బోడ అడెల్లు మాట్లాడుతూ.. మాలలు చాలా వెనుకబడి ఉన్నారని, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. మాలలకు రూ.5 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తులేకుండా, బ్యాంకులతో సంబంధం లేకుండా, 100శాతం రాయితీ రుణాలను అందించి, ఆర్థికాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖకవి జీఆర్ కుర్మె, ఉపసర్పంచి పట్టెపు లక్ష్మణ్, మద్దెల నారాయణ, కుర్మె నారాయణస్వామి, మద్దెల అడెల్లు, చిన్న లస్మన్న, సంటెన్న, బద్దుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్, గుడిహత్నూర్, శంభుగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ జిల్లా అర్గనైజర్ కస్తాల ప్రేమల తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు రాకుండా చిన్నారులకు పట్టిక ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొనకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఎంపీడీఓ పుష్పలత, జడ్పీటీసీ సభ్యుడు కేశవ్ గిత్తె, కన్వీనర్ బ్రహ్మానంద్ తదితరులు ఉన్నారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే

బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే: దేశంలోనే తొలి మహిళ ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే దేశంలోని మహిళలందరికీ ఆదర్శమని దేశంలో ఎన్నో వివక్షలను ఎదుర్కొని మహిళ సమాజం ఉన్నతి కోసం తన జీవితాన్నే అర్పించిన గొప్ప మహిళ సావిత్రిబాయి పూలే అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కానిందే ఉద్ధవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పూలాజీబాబా ఆలయ ఆవరణలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా నాయకులు జల్కేపాండురంగ్, కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నర్సయ్య, బాపురావ్, విఠల్, జగన్, ఇస్తారీ, స్వామి, జగదీష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మాలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రం తాంసిలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మాలీ సంఘం మండల నాయకులు గంగారాం, ఆశన్న సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జ్యోతిబాపులే, సావిత్రిబాయి పూలే జీవితాలను ఆదర్శంగా తీసుకుని, సామాజిక సేవలో ముందుండాలన్నారు. ప్రభుత్వం వెనకబడిన మాలీలను ఎస్టీ జాబితలో చేర్చాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు జైజవాన్, గోవింద్, నాగన్న,గంగన్న, పొచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమని ఇచ్చోడలోని కృష్ణవేణి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. ధర్మన్న అన్నారు. బుధవారం ఆయన పాఠశాలలో నిర్వహించిన భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా మాట్లాడారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిమ్నవర్గాలు, మహిళల అక్షరాస్యతకు కృషి చేశారని, మొట్టమొదటి మహిళా పాఠశాలలను స్థాపించారని పేర్కొన్నారు. ఆమె సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిత్ర పటానికి పూలమాల వేస్తున్న మాలీ సంఘం నాయకులు గంగారాం

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలోనే మొదటిసారిగా మహిళా పాఠశాలను పూలే స్థాపించారన్నారు. అణగారిన వర్గాల చైతన్యానికి సంఘసంస్కరణలకు సావిత్రిబాయి పూలే కృషి చేశారని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినిలు ఆమెను ఆదర్శంగా తీసుకుని ఎదగాలన్నారు. అంతకు ముందు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జ్ఞానోభా, కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు సూర్యప్రకాష్, భూమన్న, గంగాధర్, లక్ష్మణ్, సదానందం, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలమడుగు: తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళల్లో జ్ఞాన జ్యోతులను వెలిగించిన సావిత్రిబాయి పూలే 187వ జయంతి వేడుకల్ని బుధవారం మండలంలోని కుచులాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. మాలీ సంఘం నేతలు వామన్, జనార్ధన్‌మాన్‌దాడే, కిషన్‌లు సావిత్రిబాయి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె తన భర్త సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే ప్రేరణతో 1848లో దేశంలో తొలి మహిళా పాఠశాలలను ప్రారంభించిందన్నారు. స్త్రీ విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేశారని కొనియడారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘ సభ్యులు రాములు షెండే, రామరావు, శంకర్, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: గుడిహత్నూర్ శాంతాపూర్, మన్నూర్ పంచాయతీలోని జిల్లా పరిషత్తు సెకండరీ ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూజలు చేసి నివాళ్లులు అర్పించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకిషన్ మాట్లాడారు.. బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించడం కోసం సావిత్రిబాయి ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో మన్నూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, ఉపాధ్యాయులు ప్రమోద్, సుదర్శన్ విద్యాకమిటీ చైర్మన్ అజమ్ తదితరులు పాల్గొన్నారు.


ఇచ్చోడలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



మన్నూర్ పాఠశాలలో సావిత్రిబాయి చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


ఇచ్చోడలో విలేకరులతో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

నేడు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఇచ్చోడ బంద్

ఇచ్చోడ, న్యూస్‌టుడే: ఇచ్చోడ మండల కేంద్రంలో గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తున్నట్లుగా మండల దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం వారు ఇచ్చోడలో విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్రలో భీమాకోరెగావ్ సంఘటననూ తీవ్రంగా ఖండిస్తూ బంద్‌కు పిలుపునిచ్చినట్లుగా పేర్కొన్నారు. దళితులపై బీమాకోరెగావ్‌లో దాడికి పాల్పడ్డ వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. బీమాకోరెగావ్ సంఘటనను నిరసిస్తూ జిల్లా బంద్ పాటిస్తున్నట్లుగా తెలిపారు. ఇచ్చోడలో వాణిజ్యసంస్థలు, దుకాణాల వారు స్వచ్ఛందంగా బంద్ పాటించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సోంకాంబ్లే కృష్ణకుమార్, నర్వాడే రమేష్, సోపాన్‌రావ్, గంగయ్య, నగేష్, రాహుల్, హన్మంతు, ప్రజ్ఞాకుమార్, జయకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశానికి హాజరైన జడ్పీటీసీ నారాయణ

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

గైర్హాజరైన ఎంపీపీ, వైస్‌ఎంపీపీ

..**బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే:** మళ్లీ పాత పాటే.. 13 మంది సర్పంచులు 8మంది ఎంపీటీసీ సభ్యులున్న మండల పరిషత్తు సమావేశం బుధవారం మొక్కుబడిగా సాగింది. అయిదారుగురు తప్ప మిగతా ప్రజాప్రతినిధులు సమస్యలపై నోరుమెదపలేదు. ప్రజా సమస్యలపై తీర్మానం చేయకుండానే సమావేశాన్ని ముగించారు. మండల పరిషత్తు అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపాధ్యక్షురాలు అల్లూరి శ్రీమతి గైర్హాజరవ్వడంతో ఆలస్యంగా మొదలైన సర్వసభ్య సమావేశాన్ని త్వరగా ముగించేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నారాయణ, ఎంపీడీఓ శంకర్, తహసీల్దార్ రాజేందర్‌సింగ్, మండల సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో భవిష్యత్తు

జాతర్ల(బజార్‌హత్నూర్), న్యూస్‌టుడే: క్రీడల్లో రాణించడం వల్ల విద్యార్థులకు మంచి భవిష్యత్తు జాతర్ల గ్రామసర్పంచి పెందూర్ బీంబాయి అన్నారు. బుధవారం మండలంలోని జాతర్ల నవజ్యోతి యూత్‌క్లబ్ మీనిస్టేడియంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల సంభాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల శిశుమందిర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వొర్నిరమణ, నారాయణరెడ్డి, ఆశ్రమ పాఠశాల పీడీ గోపాల్, ఎస్ఎంసీ చైర్మన్ ముత్యాపువార్ నాగ్‌నాథ్, రాజన్న, లింగన్న, జాంసింగ్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, స్వప్న, రాజేశ్వర్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబస్తీ భూములను పరిశీలించిన సహాయ పాలనాధికారి

ఇచ్చోడ, న్యూస్‌టుడే: ఇచ్చోడ మండలంలోని మొక్రా(కె) గ్రామంలో దళితబస్తీ కింద తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను సహాయ పాలనాధికారి గోపి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దళితబస్తీ భూములను సాగు చేస్తున్న లబ్ధిదారు రైతులతో మాట్లాడారు. గ్రామంలో 30 మంది లబ్ధిదారులకు 80ఎకరాల భూమిని పంపిణీ చేశారు. దళిత బస్తీ కింద పంపిణీ చేసిన భూములు బాగున్నాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, తహసీల్దార్ రాథోడ్ మోహన్‌సింగ్, మొక్రా(కె) వీడీసీ అధ్యక్షుడు గాడ్గె సుభాష్, లబ్దిదారు రైతులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం

ఎదులాపురం, న్యూస్‌టుడే : స్థానిక బొక్కలగూడలోని నౌనిహాల్ ఉర్దూ మాధ్యమ పాఠశాల యాజమాన్యం అయిదో తరగతి విద్యార్థిని షిఫాముస్కాన్‌ను తీవ్రంగా శిక్షించిన విషయం నిర్ధరణ అయిందని బాలల సంక్షేమ సమితి అధ్యక్షుడు అమృత్‌రావు పేర్కొన్నారు. ఈ పాఠశాల వారు అకారణంగా ఈ విద్యార్థినిని గత నెల రెండున పుస్తకాల బ్యాగు నెత్తిపై ఉంచి కనికరం లేకుండా గోడకుర్చీ వేసి కూర్చోబెట్టినట్లు కుటుంబ సభ్యులు జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు పాలనాధికారి ఆదేశాల మేరకు పాఠశాలలో, బాధిత విద్యార్థి ఇంటి వద్ద బుధవారం విచారణ జరపగా విద్యార్థినిని వేధించిన విషయం నిర్ధరణ అయిందన్నారు.

సీపీఎస్ అంతమయ్యేదాక నిరంతర పోరాటం

పీఆర్టీయూ జిలా ప్రధాన కార్యదర్శి నల్లరత్నాకర్‌రెడ్డి

తలమడుగు,న్యూస్‌టుడే: సీపీఎస్ విధానం రద్దయ్యేంతవరకు పీఆర్టీయూ సంఘం నిరంతర పోరాటం చేయనుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లరత్నాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం తలమడుగు మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో పీఆర్టీయూ సంఘం నూతన సంవత్సర కాలసూచీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సామాజిక భద్రతలేని ఈ వ్యవస్థ తప్పకుండా రద్దుకావాలన్నారు. గత కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకుండా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియమాకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఏంఈఓ కౌసల్య, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దీలీప్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, ప్రకాశ్‌గౌడ్, సుఖ్‌దేవ్, రాజేందర్ , శ్రీనివాస్, పవన్, సంతోశ్, అబొ, సురేందర్, గంగయ్య,సాగర్, నవీన్‌యాదవ్, హేమలత, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



తలమడుగులో కాలసూచీలను అవిష్కరిస్తున్న పీఆర్టీయూనేతలు

భక్తి శ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవాలు

బోథ్, న్యూస్‌టుడే: బోథ్ మండల పరిధిలోని పార్డి'బి', దేవుల్‌నాయక్‌తాండ గ్రామంలో శ్రీ జగదాంబాదేవీ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు, భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 11 గంటల నుంచి జగదాంబాదేవీకి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు అనిల్‌జాదవ్ హాజరై పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ మహారాజ్ పుణ్యతిథి కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్డి, ఘన్‌పూర్, సాకెర, తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఖానాపూర్

పీఆర్టీయూ కాలసూచీ ఆవిష్కరణ

పెంబి (ఖానాపూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: పెంబి మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం పీఆర్టీయూ 2018 కాలసూచీని ఎస్సై సంజీవ్‌కుమార్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సంఘం మండల నాయకులు వెంకట్రాములు, విజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

కడెం: మండలంలోని పెద్దూరుకు చెందిన ఎనుగంటి సత్తన్న(40) గత నెల 18న ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడని ఏఎస్సై జన్నారపు నారాయణ తెలిపారు. ఈయన కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికి చివరకు ఆయన తండ్రి ఎనుగంటి గంగరాజం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సేవాదృక్పథంతో ముందడుగు

- వారం రోజులపాటు విస్తృత కార్యక్రమాలు
- ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

కడెం, న్యూస్‌టుడే: సామాజిక చైతన్యం, సేవా దృక్పథం లక్ష్యంగా కొనసాగే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం వారం రోజులు మండలంలోని కొత్త మద్దిపడిగలో సాగింది. కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ సేవకులు ఈ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో వీరు వివిధ సామాజిక పరమైన అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణంతో లాభాలు, మొక్కలు పెంచడం, భూగర్భ జలాలు పెరిగేందుకు ఇంకుడుగుంతల నిర్మాణం ఆవశ్యకత తదితరాలపై గ్రామస్థులు ఆలోచించేలా ప్రదర్శనలు, కార్యక్రమాలు నిర్వహించారు.

సేవాభావం అలవడేలా..

కళాశాల స్థాయినుంచే విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాల్సిన అవసరాన్ని ఎన్ఎస్ఎస్ గుర్తుచేస్తుంది. ఇందులో పనిచేసిన సేవకులు క్రమశిక్షణతోపాటు సామాజిక సేవాగుణాన్ని అలవర్చుకుంటారు. కళాశాలలో చదివే రెండేళ్లలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాల్లో పద్ధతిగా పాల్గొంటే చాలు సేవా భావం అలవడుతుంది. కొత్త మద్దిపడిగలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్థులకు అవగాహన కల్పించే పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను కొంతమేర చైతన్యవంతులను చేయగలిగారని చెప్పొచ్చు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ మరుగుదొడ్లు నిర్మించుకున్న వారిని అభినందిస్తూ, నిర్మించుకోని వారిని నిర్మించుకోవాల్సిన అవసరాన్ని చెప్పారు. ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని దానివల్ల భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత రాదని సూచించారు. రెండుచోట్ల తామే ఇంకుడు గుంతలు తవ్వి నిర్మించారు. మురుగుకాల్వలను శుభ్రం చేశారు. పరిశుభ్రతను పాటించాలని ప్రదర్శన నిర్వహించారు. ఆలయాలకు వెళ్లే దారిలో, గ్రామంలో, పాఠశాల ఆవరణలో శ్రమదానం చేశారు. ఇలా తమ సేవాభావాన్ని చాటారు. తమ గ్రామంలో తాము ఎందుకు ఈ పనులు చేసుకోవద్దని యువత, గ్రామస్థులు ఆలోచించేలా వలంటీర్లు ఈ పనులను చేసిచూపించారు. శిబిరం నిర్వహణతో గ్రామస్థులకు కొంతమేర సామాజిక అవగాహన పెంపొందిందని సేవకులకు సేవాభావం అలవడినట్టయింది. వలంటీర్లు శ్రమదానం చేస్తుంటే యువకులు వారికి సహకరించడం చూస్తే అది యువతను ఉత్తేజపరిచిందని, వారిలో చైతన్యం వచ్చినట్లయిందని స్పష్టంగా తెలిసింది. వలంటీర్లు గ్రామంలో నిర్వహించిన సర్వేలో మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు చాలామంది ఇదివరకే నిర్మించుకున్నట్లు తేలింది. నిర్మించుకోని వారు నిర్మించుకుంటే గ్రామంలో పరిశుభ్రత నెలకొనే అవకాశముందని వలంటీర్లు సర్వేలో తేల్చారు.



మొక్కలు నాటుతున్న వలంటీర్లు

సేవాభావం నేర్చుకున్నాను..

ఎస్.కె నిహాల్, ద్వితీయ సంవత్సర విద్యార్థి



ఎన్ఎస్ఎస్‌లో రెండేళ్లపాటు ప్రత్యేక శిబిరాల్లో పాల్గొన్నాను. శిబిరం మంచి అనుభూతినిచ్చింది. సేవ చేయాలనే ఆలోచన మరింతగా పెరిగింది. నాకోసం కాదు ఒకరికోసం ఒకరు అని పనిచేసుకుంటే సమాజానికి మేలు జరుగుతుంది. ఇకముందు ఎక్కడ సేవచేయాల్సి వచ్చినా చేసేందుకు సిద్ధం. మనద్వారా పదిమందికి సామాజిక అంశాల్లో అవగాహన కలిగిస్తా.. వారు మెరుగుపడితే అదే నాకు ఆనందం, తృప్తిగా భావిస్తా.

చైతన్యం తెచ్చామని ఆశిస్తున్నా..

అఖిల, ద్వితీయ సంవత్సర విద్యార్థిని



కొత్త మద్దిపడిగలో పరిశుభ్రతపై ప్రదర్శనలు నిర్వహించాం. మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు ఉండేలా చూసుకుంటే భవిష్యత్తు తరాలకి ఎంతో మేలు చేసినవారవుతారని ఇంటింటికీ తిరిగి పూలు ఇచ్చి మరీ చెప్పాం. శ్రమదానం చేసి మన పరిసరాలు, మన గ్రామాన్ని మనమే శుభ్రం చేసుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించాం. మా శిబిరం ద్వారా కొందరిలోనైనా చైతన్యం వస్తే చాలు.

విద్యార్థి దశనుంచే సామాజిక అవగాహన

సుధాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి



విద్యార్థి దశనుంచే సామాజిక సేవా దృక్పథం అలవడేందుకు ఎన్ఎస్ఎస్ పథకం దోహదపడుతుంది. గ్రామంలో విద్యార్థులు ప్రత్యక్షంగా పరిస్థితులను చూస్తారు. వాటిపై ఆలోచించి అక్కడుండే రుగ్మతలను రూపుమాపేందుకు విద్యార్థుల్లో చైతన్యం వస్తుంది. వలంటీర్లు మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని ప్రదర్శన నిర్వహించారు. శ్రమదానం చేశారు. ఇలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ సేవాభావాన్ని పెంపొందించుకున్నారు.



ఆర్.ఐకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని వినతి

జన్నారం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని కోరుతూ స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఆర్.ఐ.మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి మాదిగలను మోసం చేస్తున్నాడని అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతియుతంగా నిరసనలు తెలుపుకునే అవకాశం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాదిగా ప్రజాప్రతినిధుల జిల్లా ఇన్‌ఛార్జి ఓరుగంటి సత్యం, మాదిగ వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా ఇన్‌ఛార్జి పూర్ణపు రాజారాం, బుడగ జంగాల నాయకుడు గంగన్న, జగన్‌మోహన్, కాలువ సుగుణ, రవి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్ మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

జన్నారం, న్యూస్‌టుడే: మండలంలోని రాంపూర్ గ్రామ మున్నూరు కాపు సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కొంతం శంకరయ్య, అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్, దాసరి రాజన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. రాంపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ముత్యాల రాజన్న, ఉపాధ్యక్షుడిగా దాసరి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బండారి తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా బండారి అనిల్, కోశాధికారిగా కుడిది శ్రీనివాస్, పదకొండు మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాగే సలహాదారులుగా పల్లె రాజన్న, బండారి రామయ్య, బండారి లచ్చయ్య, దాసరి నారాయణ, బండారి లచ్చన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ఖానాపూర్: ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ నివాసంలో బుధవారం అయ్యప్పస్వామి పదునెట్టాంబడి పూజ కన్నుల పండుగగా సాగింది. ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. అయ్యప్పస్వామికి ఎమ్మెల్యే రేఖా-శ్యామ్‌నాయక్ దంపతులు గురుస్వామి పీసుపాటి పాపారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నిమ్మగడ్డ సందీప్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితుల సమస్యలు తీర్చాలి

గల్ఫ్ బాధితుల సమస్యలు పరిష్కరించేందుకు బుధవారం గల్ఫ్ అవగాహన వేదిక ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. విశ్రాంతి భవనం నుంచి మస్కాపూర్, బాదన్‌కుర్తి, సుర్జాపూర్, ఎల్లాపూర్‌లమీదుగా ద్విచక్రవాహన ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే రేఖానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గల్ఫ్ అవగాహన వేదిక అధ్యక్షుడు, ఎన్ఆర్ఐ పాలసీ సాధన ఉద్యమకారుడు దొనికెని కృష్ణ మాట్లాడారు. ఉపాధి కోసం వెళ్లి విదేశాల్లో మృతి చెందిన వారికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధనలో భాగంగా నేడు నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ముందు చేసే దీక్షను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఆకుల శ్రీనివాస్, చిన్నయ్య, నర్సయ్య, దయానంద్, పుప్పాల గజేందర్, రాజరెడ్డి, సాగర్, బాసెట్టి శివకుమార్, రాజేందర్, కొక్కుల ప్రదీప్, జి.రాజేందర్‌గౌడ్, చిన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్ దంపతులు



గల్ఫ్ బాధితుల సమస్యల పరిష్కారం కోరుతూ ర్యాలీ

లంబాడా ఉపాధ్యాయులను తిప్పి పంపిన ఆదివాసీలు

ఇంద్రవెల్లి, ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదివాసీ గూడేల్లోని పాఠశాలలో లంబాడా ఉపాధ్యాయులు విధులు నిర్వహించవద్దని, పీసా చట్టం ప్రకారం గ్రామసభ తీర్మానం చేసి, పాఠశాల నుంచి తిప్పి పంపిన ఎందుకు వస్తున్నారని ఆదివాసీలు లంబాడా ఉపాధ్యాయులను పాఠశాల నుంచి పంపించారు. బుధవారం రోజున మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించుటకు లంబాడా ఉపాధ్యాయులు హాజరైనట్లు గోండుగూడ, ప్రధాన్‌గూడ ఆదివాసీలకు తెలియగానే గ్రామ పటేల్ మడావి ఇంద్రు ఆధ్వర్యంలో పలువురు ఆదివాసీలు పాఠశాలకు వచ్చి తిప్పి పంపించారు. మండల కేంద్రంతో పాటు కేస్లాపూర్, ముత్నూర్ పాఠశాలలో ఆదివాసీలకు తెలియకుండా మంగళవారం విధులకు హాజరైన ఉపాధ్యాయులను సైతం బుధవారం ఆదివాసీలు తిప్పిపంపారు. లంబాడాలు కావాలని ఆదివాసీలను రెచ్చగొట్టేవిధంగా వ్యవహరిస్తున్నారనివాపోయారు.

★ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలంటూ ఆదిమ తెగ గిరిజనులు డిమాండ్ చేశారు. గత కొన్ని రోజుల నుంచి లంబాడీలు, ఆదివాసీల మధ్య మొదలైన పోరు ఉద్యమంలా కొనసాగుతుంది. బుధవారం ఉట్నూరు మండలంలోని లక్కారం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించేందుకు వచ్చిన వచ్చిన లంబాడ ఉపాధ్యాయులు విధుల్లోకి రావద్దంటూ ఆదివాసీ ప్రజలు వారిని కోరారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్సై అక్కడికి చేరుకుని ఇరువురికి సర్ది చెప్పారు.



ట్రాక్టర్‌తో దమ్ముకొడుతున్న రైతు

ముమ్మరంగా యాసంగి పనులు

జన్నారం: మండలంలో యాసంగి పనులు ముమ్మరంగా మొదలయ్యాయి. ఖరీఫ్‌లో దోమపోటు వల్ల నష్టపోయిన పంటను యాసంగిలో సాధించాలనే పట్టుదలతో అన్నదాత ముందుకు వెళుతున్నారు. మండలంలో మొత్తం 2800 ఎకరాల్లో వరిసాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. కవ్వాల్, కలమడుగు, చింతగూడ, రోటిగూడ, తపాల్‌పూర్, ఇంధన్‌పల్లి, రాంపూర్, రేండ్లగూడ తదితర గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు సేకరించి విత్తన శుద్ధి చేసి ధాన్యాన్ని మొలకగా చేసి అనంతరం నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయాధికారులు సైతం ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఖరీఫ్‌లో తలెత్తిన ఇబ్బందులే యాసంగిలోనూ పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయాధికారిణి శైలజతో పాటు వ్యవసాయ విస్తరణాధికారులు సైతం పంట పొలాల వద్దకు వెళ్లి సూచనలిస్తున్నారు.

భాజపా నియోజకవర్గ కన్వీనర్‌గా పడాల రాజశేఖర్

ఖానాపూర్, న్యూస్‌టుడే: భాజపా ఖానాపూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న పడాల రాజశేఖర్‌ను, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా గన్నారపు రాజేందర్‌లను జిల్లా అధ్యక్షురాలు డా.రమాదేవి నియమించారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమకు ఈ బాధ్యతలను అధ్యక్షురాలు అప్పగించారని న్యూస్‌టుడేతో చరవాణిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల ప్రధాన కార్యదర్శి టేకు ప్రకాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్

యువత క్రమశిక్షణతో మెలగాలి

ఖానాపూర్ గ్రామీణం: విద్యార్థి దశలో యువత సేవాభావం అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎంఏ ఖాలిఖ్ అన్నారు. మండలంలోని తర్లపాడులో బుధవారం ఎన్ఎస్ఎస్ సేవకుల వారం రోజుల శీతాకాల శిబిరం ముగింపు సభలో పాల్గొని మాట్లాడారు. ముగింపు సభ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో పీవో క్యాతం సంతోష్‌రెడ్డి, అధ్యాపక బృందం, పలువురు గ్రామనాయకులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ నిర్లక్ష్యం!

- ☛ కులాంతర జంటలకు అందని ప్రోత్సాహకం
- ☛ ఏళ్లుగా బాధితులకు తప్పని ఎదురుచూపులు

ఉట్నూరు, న్యూస్‌టుడే

కుల వివక్షతను రూపుమాపేందుకు కులాంతం వివాహం చేసుకున్న జంటలకు నగదు ప్రోత్సహకాలను అందజేసి ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వం గొప్పగా చెబుతున్నా కార్యాచరణ అమల్లో నిర్లక్ష్యం చేస్తోంది. కులాంతర వివాహం చేసుకున్న జంటకు గతంలో ఇచ్చే రూ.10వేల ప్రోత్సహకాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏకంగా రూ.50వేలకు పెంచింది. కులాంతర వివాహాలకు ప్రోత్సహిస్తున్నామని, నిధులను పెంచామని ప్రచారంతో హోరెత్తిస్తున్న సర్కారు నిధుల విడుదలలో మాత్రం ఉదాసీనత ప్రదర్శిస్తోంది. వెరసి లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. ప్రోత్సహకాల కోసం గిరిజన లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా వారి సమస్యను పరిష్కరించే వారే కరవయ్యారు.

ఉమ్మడి జిల్లాలోని గిరిజన యువతీ, యువకులు కులాంతర వివాహాలు చేసుకుంటే వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.50 వేలు నగదు ప్రోత్సహకాన్ని అందజేసి ప్రోత్సహించాల్సింది. ఈ విధంగా 2008 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో కులాంతర వివాహాలు చేసుకున్న 60 గిరిజన జంటలు నగదు ప్రోత్సహకాల కోసం ఐటీడీఏ జిల్లా గిరిజన సంక్షేమశాఖలో దరఖాస్తు చేసుకొన్నారు. వారికి. నగదు ప్రోత్సహకాలు అందజేయడానికి రూ.30లక్షలు నిధులు అవసరముంది. కానీ ప్రభుత్వం నిధుల మంజూరును విస్మరిస్తోంది. దీంతో బాధిత జంటలు ప్రోత్సహకాల కోసం ఐటీడీఏ అధికారులను సంప్రదిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాకపోవడంతో లబ్ధిదారులు తిరిగితిరిగి వెసిగి వేసారిపోతున్నారు.



ఐటీడీఏ కార్యాలయం

లేఖలు బుట్టదాఖలు..

కులాంతర వివాహాలు చేసుకున్న గిరిజన జంటలకు ఇచ్చే ప్రోత్సహ నిధులను మంజూరు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు పలుమార్లు లేఖలు రాశారు. అయినా స్పందన కొరవడింది. రాసిన లేఖలన్ని బుట్టదాఖలయ్యాయి. కులాంతర నిధుల మంజూరులో ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. కుల వివక్షత నిర్మూలననే ధ్యేయమనే ప్రభుత్వం ప్రోత్సహకాల నిధుల మంజూరు చేయకపోవడం బాధకరమని గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



'లలిత, బింగి సురేష్ కులాంతర వివాహ చిత్రం ఇది. ప్రస్తుతం లలితకు ఇద్దరు సంతానం. కడెం మండలం గంగాపూర్ నాయకపుగూడ నివాసి. పేద కుటుంబానికి చెందిన ఈమె మార్చి 26, 2008 సంవత్సరంలో ఉట్నూరుకు చెందిన గిరిజన యువకుడు బింగి సురేష్‌ను కులాంతర వివాహం చేసుకుంది. నగదు ప్రోత్సహకం కోసం ఐటీడీఏ జిల్లా గిరిజన సంక్షేమశాఖలో దరఖాస్తు చేసుకుంది. కానీ ఈమెకు ఇప్పటి వరకు ప్రోత్సహకం ఇవ్వలేదు. గత కొన్నేళ్ల నుంచి ప్రోత్సహకం కోసం తిరుగుతున్నా పట్టించుకొనే వారే కరవయ్యారని వాపోయింది. పెళ్లి చేసుకున్న నాటి నుంచి ప్రోత్సహకం కోసం అధికారుల చుట్టు తిరుగుతున్నా ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలున్నారు. ఇచ్చేది ఇంకెప్పుడో అధికారులకే తెలియాలంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తోంది.



'ఐండ్ల భీమవ్వ, నరేష్ కులాంతర వివాహం చేసుకున్న నాటి చిత్రం ఇది. ఉట్నూరు మండలం దేవనగర్‌కు చెందిన గిరిజన యువతి ఐండ్ల భీమవ్వ ఉట్నూరు బోయవాడకు చెందిన తాళ్ల నరేష్‌కు 2011, జనవరి 26న కులాంతర వివాం చేసుకుంది. నగదు ప్రోత్సహకం కోసం ఐటీడీఏలో దరఖాస్తు చేసుకుంది. కానీ ఈ దంపతులకు నేటికి నగదు ప్రోత్సహకం అందలేదు. ఇవి ఉదాహరణలు మాత్రమే. కులాంతర వివాహాలు పరిహారం కోసం ఐటీడీఏ చుట్టూ తిరుగుతున్నా జంటలు ఎన్నోఉన్నాయి.

వెంటనే మంజూరు చేయాలి



తాళ్ల నరేష్, లబ్ధిదారుడు..

కులాంతర వివాహాలు చేసుకున్న మాలాంటి జంటలకు ఇచ్చే ప్రోత్సహకాల నిధుల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైంది కాదు. అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధను చూపి వెంటనే ప్రోత్సహకాలు మంజూరు అయ్యేలా చూడాలి. సంవత్సరాలవుతున్నా స్పందించకపోవడం ధారుణం. తీరుమారాలి. సమస్యను పరిష్కరించాలి.

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

కడెం, న్యూస్‌టుడే: కడెంలో ఎల్ఎంఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపక బృందం బుధవారం మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే గొప్పదనాన్ని, ఈమె జయంతిరోజున మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొంటున్న విషయాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందూర్ నేత ఈసందర్భంగా వివరించారు.


దస్తురాబాద్‌లో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తూ

కార్యక్రమంలో కళశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్, తెరాస విద్యార్థి విభాగం నాయకుడు హసీబ్ తదితరులు పాల్గొన్నారు. కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ తుకారం, అధ్యాపక బృందం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి(హెచ్) దమ్మనగర్‌లో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచి దిగాంబర్ చవాన్ పాల్గొని సావిత్రి త్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

దస్తురాబాద్‌లో.. ఉన్నతపాఠశాలలో టీమాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు, టీమాస్ కన్వీనర్ శైలేందర్, కేవీపీఎస్ నాయకుడు పి.రాజలింగం, టీమాస్ జిల్లా నాయకుడు బి.సురేష్, నాయకులు నర్సయ్య, తిరుపతి, స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు. దస్తురాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్వేరోస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. స్వేరోస్ జిల్లా నాయకుడు ఇందూర్, ఆశ్రమపాఠశాల ప్రధానోపాధ్యాయుడు పున్నం, టీమాస్ నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్: బహుజనులతో పాటు అన్ని వర్గాల్లోనూ స్త్రీలు విద్యకు దూరమైన సమయంలో విద్యను అభ్యసించి, తొలి ఉపాధ్యాయురాలిగా ఖ్యాతి గడించిన సావిత్రిబాయి పూలే జయంతివేడుకలు బుధవారం ఖానాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి జడ్పీబాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచి నేరెల్ల సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నారపు శంకర్, ప్రధాన కార్యదర్శి దాసరి రాజేశ్వర్, తాల్లపల్లి రాజగంగన్న, గొర్రె గంగాధర్, మద్దెల ముత్యం, నేత శ్యామ్, నిట్ట రవీందర్, ప్రధానోపాధ్యాయుడు సునిల్, శ్రీదేవి, వసంత సునిత పాల్గొన్నారు.

మహిళ సంఘాలకు వంటనూనె పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడలో స్టార్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో సంఘాల సభ్యులకు సంక్రాంతి పండగ కోసం వంటనూనె డబ్బాలు పంపిణీ చేశారు. బుధవారం ఆ సమాఖ్య పరిధిలోని 30 సంఘాల సభ్యులకు వీటిని అందజేశారు. పొదుపు నిధుల నుంచి కొనుగోలు చేసి అందజేయగా మూడు నెలల వరకు ఈ డబ్బులు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. దీంతో పండగకి నిరుపేదలకు ఉపయోగపడుతాయని సమాఖ్య సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఓ పండరి, ఆర్పీ రూప, స్టార్ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు బేబిమణి పాల్గొన్నారు.

తుడుం దెబ్బ మండల కన్వీనర్‌గా నాగ్‌నాథ్


ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఇంద్రవెల్లి మండల తుడుం దెబ్బ కన్వీనర్‌గా మెస్రం నాగ్‌నాథ్‌ను నియమించినట్లు తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు, రాష్ట్ర కార్యదర్శి ఉయిక సంజీవ్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది నుంచి మండలశాఖ ఎన్నికలు నిర్వహించకపోవడంతో మండల కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలనే డిమాండ్‌తో ఆదివాసీలు చేపట్టిన ఉద్యమాన్ని మండలంలోని ప్రతి గ్రామానికి తీసుకవెళ్తు ఆదివాసీలను చైతన్యం చేస్తానని నూతనంగా కన్వీనర్‌గా ఎంపిక అయిన నాగ్‌నాథ్ అన్నారు.


మెస్రం నాగ్‌నాథ్

మర్రిచెట్టులో..గణపతి

దిలావర్‌పూర్ గ్రామంలోని పురాతన చారిత్రక రాజరాజేశ్వరాలయం ఆవరణలో ఉన్న భారీ మర్రివృక్షం కాండం కిందిభాగంలో కాండం శాఖలు చీలినట్లుగా ఉన్నాయి. మర్రితొర్రలో అచ్చం వినాయకుని తొండం వలే అచ్చుగుద్దినట్లుగా ఉండటంతో భక్తులు గమనించారు. ఇక్కడి పూజారి ఆలయకమిటీ సభ్యులు కాండం గణపతి రూపానికి రంగులు అద్దడంతో వినాయకుని రూపం సంతరించుకొంది. శివాలయానికి వచ్చే భక్తులకు వృక్షంలో వినాయకుని రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

- న్యూస్‌టుడే, ఖానాపూర్ గ్రామీణం


మర్రిచెట్టులో గణపతి రూపం

'ప్రతి విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలి'

జన్నారం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. జన్నారం మండలం మల్యాల్ గ్రామపంచాయతీ పరిధిలోని పైడిపెల్లి గ్రామంలో గత ఏడు రోజులుగా కొనసాగుతున్న వికాస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శిబిరం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పైడిపెల్లి గ్రామాన్ని ఎన్ఎస్ఎస్ దత్తత తీసుకోవడం హర్షనీయమని అన్నారు. రెండు క్యాంపులకు హాజరైన విద్యార్థులు అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. వికాస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్‌విద్యార్థుల సేవాభావాన్ని ఆయన కొనియాడారు. అంతకు ముందు గ్రామంలో ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వికాస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అంజుత్‌రావు, ప్రిన్సిపాల్ కస్తూరి సతీష్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి సమన్వయకర్త వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకటేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

పేదింటి మహిళకు సాయం

జన్నారం, న్యూస్‌టుడే: జన్నారం మండల కేంద్రంలోని వికాస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉదారత చాటుకున్నారు. ఏడు రోజుల శిబిరంలో భాగంగా మండలంలోని పైడిపెల్లి గ్రామంలో వివిధ పనులు చేశారు. సర్వే నిర్వహిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఆత్రం లింగుబాయి ఆర్థిక స్థితిగతులు తెలుసుకున్నారు. పూటగడవడమే కష్టంగా ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో విద్యార్థులంతా కలిసి రూ.2500 పోగు చేసి ముగింపు శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రమోహన్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు ఇచ్చిన నగదును లింగుబాయికి అందజేస్తున్న సమయంలో చలించిపోయిన చంద్రమోహన్‌గౌడ్ తనవంతుగా రూ.500 సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో కిరాణ దుకాణం లేకపోవడంతో వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల మానవతా దృక్పధాన్ని కళాశాల కరస్పాండెంట్ ఎన్.అంజుత్‌రావు, ప్రిన్సిపల్ సతీష్, సమన్వయర్త వెంకటేశ్ అభినందించారు.


మాట్లాడుతున్న చంద్రమోహన్‌గౌడ్